www.velthuru.com RNI TEL TEL/ 2019 / 78609
మంగళవారం
# వెలుతురు
తెలుగు దిన పత్రిక
రంగారెడ్డి। 30, జనవరి 2024
సంపుటి: 5 సంచిక: 251, పేజీలు: 12, వెల: రూ.5/-

## మథుర శ్రీకృష్ణజన్మభూమి సమస్య
### అలహాబాద్ హైకోర్టు ఉత్వర్వులపై సుప్రీం స్టే



**న్యూఢిల్లీ,జనవరి29వెలుతురు:** ఉత్తరప్రదేశ్‌లోని మథురలోని శ్రీకృష్ణ జన్మభూమి -షాహీ ఈద్గా మసీదు వివాదానికి సంబంధించి షాహీ ఈద్గా మసీదుకు కమిషన్‌ను నియమిస్తూ అలహాబాద్ హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులపై సుప్రీంకోర్టు స్టేను పొడిగించింది. తదుపరి విచారణ వరకు ఈ స్టే కొనసాగుతుందని సుప్రీంకోర్టు ఉత్తర్వుల్లో పేర్కొంది. మథురలోని శ్రీకృష్ణ జన్మభూమి-షాహీ ఈద్గా మసీదు వివాదానికి సంబంధించిన అంశంపై విచారణను సుప్రీంకోర్టు ఏప్రిల్‌కు వాయిదా వేసింది. ఈ కేసులోని వాది ప్రతివాదుల అభ్యర్థనలను వ్రాతపూర్వక సమర్పించాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. మథురలోని శ్రీకృష్ణ జన్మభూమి జన్మభూమి వివాదానికి సంబంధించి అలహాబాద్? హైకోర్టు నియమించిన కమిషన్? విషయంలో సుప్రీంకోర్టును ఆశ్రయించారు. లహాబాద్ హైకోర్టు మసీదు ప్రాంగణంలో సర్వేను పర్యవేక్షించేందుకు అడ్వకేట్ కమిషనర్‌ను నియమించేందుకు అంగీకరించింది. ఈ ఆలయం ఒకప్పుడు హిందూ దేవాలయంగా ఉండేదని సూచించే గుర్తులు ఉన్నాయని పిటిషనర్లు పేర్కొన్నారు.



## అభివృద్ధి కోసం పదేళ్లపాటు కష్టపడ్డాం...

- మహాలక్ష్మితో ఆటోడ్రైవర్లకు గోస
- ఎక్కడా 24 గంటల కరెంట్ రావడం లేదు
- చేవెళ్ల అసెంబ్లీ సమీక్షలో కెటిఆర్ విమర్శలు

**హైదరాబాద్,జనవరి29వెలుతురు:** పదేండ్లు ఎంతో కమిట్‌మెంట్‌తో పనిచేశామని.. అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా సర్కారును నడిపించామని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్

మిగతా.. 2లో




## వైద్య కళాశాలలు ఉన్నచోట
# పారా మెడికల్ కోర్సులు

- బీబీ నగర్ ఎయిమ్స్‌పై నివేదిక సిద్దం చేయండి
- కొడంగల్‌లో మెడికల్, నర్సింగ్ కాలేజీల ఏర్పాటుకు పరిశీలన
- ప్రజల డిజిటల్ హెల్త్ ప్రొఫైల్ సిద్ధం చేయాలి
- ఉన్నతస్థాయి సమీక్షలో సీఎం రేవంత్ ఆదేశాలు



**హైదరాబాద్,జనవరి29వెలుతురు:** తెలంగాణలో వైద్య కళాశాల ఉన్న ప్రతీచోట నర్సింగ్, పారా మెడికల్ కాలేజీలు ఉండాలని.. ఇందు కోసం కామన్ పాలసీని తీసుకురావాలని సీఎం రేవంత్ రెడ్డిఅధికా రులను ఆదేశించారు. సచివాలయంలో వైద్య ఆరోగ్య శాఖపై సోమవారం ఆయన సమీక్షించారు. ఈ సమా వేశంలో వైద్య ఆరోగ్య మంత్రి దామోదర రాజనర్సింహ, సీఎస్ శాంతికుమారి, ప్రిన్సిపాల్ సెక్రటరీ శేషాద్రి, ఆరోగ్య శాఖకు సంబంధించిన ఇతర ఉన్నతాధికారులు ఈ సమా వేశంలో పాల్గొన్నారు. బీబీనగర్ ఎయిమ్స్‌లో వైద్య సేవలు పూర్తిస్థాయిలో అందుబాటులోకి వచ్చేలా చర్యలు తీసుకో వాలని నిర్దేశించారు. దీని ద్వారా ఉస్మానియా, నిమ్స్ ఆస్పత్రులపైనా భారం తగ్గుతుందని అభిప్రాయపడ్డారు. అలాగే, ఖమ్మం, నల్గొండ, వరంగల్ జిల్లాల ప్రజలకు చాలా ప్రయోజనకరంగా ఉంటుందని అన్నారు. ఎయి మ్స్‌ను సందర్శించి నివేదిక సమర్పించాలని సూచించారు. వైద్య సేవల కోసం అవసరమైతే తానే స్వయంగా కేంద్రమంత్రిని కలిసి వివరిస్తానని అన్నారు. కొడంగల్ లో మెడికల్, నర్సింగ్ కాలేజీల ఏర్పాటును పరిశీలించాలని నిర్దేశించా... సందర్భంగా ఉస్మానియా విస్తరణలో సమస్యలను అధికారులు సీఎంకు వివరించారు. ఆస్పత్రి హెరిటేజ్ భవనంపై మంగళవారం హైకోర్టులో విచారణ ఉందని అధికారులు సీఎం దృష్టికి తీసుకురాగా.. ఉన్నత న్యాయస్థానం ఆదేశాల మేరకు నడుచుకుందామని స్పష్టం చేశారు. రాష్ట్రంలో ప్రతి ఒక్కరికీ డిజిటల్ హెల్త్ ప్రొఫైల్ సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. అందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని.. డిజిటల్ హెల్త్ ప్ర్గొల్ కార్డును ఒక యూనిక్ నెంబరుతో అనుసంధానించాలని సూచించారు. దీంతో అత్యవసర పరిస్థితుల్లో సరైన వైద్యం అందించే వీలుంటుందని అన్నారు. ఈ హెల్త్ ప్ర్గొల్ కార్డుతో ఆరోగ్యశ్రీని అనుసంధానం చేయాలని పేర్కొన్నారు.

అలాగే, ఆరోగ్యశ్రీకి తెల్లరేషన్ కార్డు తప్పనిసరి అనే నిబంధన సడలించే అంశాన్ని కూడా పరిశీలించాలని అధికారులకు నిర్దేశిరచారు. వరంగల్, ఎల్బీ నగర్, సనత్ నగర్, అల్వాల్ లో టిమ్స్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రుల నిర్మాణాలు వేగవంతంగా పూర్తి చేయాలని సీఎం ఆదేశించారు. వైద్యుల కొరత లేకుండా

మిగతా.. 2లో

## ఒత్తిడితో కూడిన చదువు మంచిదికాదు

- ఇతరులతో పోల్చి విద్యార్థుల్లో న్యూనత పెంచవద్దు
- పరీక్ష పే చర్చ కార్యక్రమంలో ప్రధాని మోడీ సూచన



**న్యూఢిల్లీ,జనవరి29వెలుతురు:** విద్యార్థులపై ఒత్తిడి పెంచడం.. ఇతరులతో పోల్చడం వంటి చర్యలు సరికాదని తల్లిదండ్రులకు ప్రధాని మోడీ సూచించారు. పాజిటివ్ దృక్పథంతో వారిని ముందుకు సాగేలా చూడాలన్నారు. రోజుకు 10 నుంచి 12 గంటలు చదవాలని తల్లిదండ్రులు విద్యార్థుల పైన ఒత్తిడి చేయడం మంచిది కాదని ప్రధాని మోదీ అన్నారు.

పరీక్షా పే చర్చ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన.. ఢిల్లీ లోని భారత మండపంలో

మిగతా.. 2లో



### పరమాత్మ అవతారంగా
## మోడీ ఫీల్

- తనకుతానుగా విష్ణుమూర్తి 11వ అవతారంగా భావన
- మోడీ నిరంకుశ తీరుపై మండిపడ్డ మల్లికార్జున ఖర్గే

**డెహ్రాడూన్,జనవరి29, వెలుతురు:** ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ తనను తాను విష్ణుమూర్తి 11వ అవతారంగా అనుకుంటున్నారని, మతాన్ని రాజకీయాలతో ముడిపెడుతున్నారని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే నిశిత విమర్శలు చేశారు. ప్రజలు ఉదయం లేవగానే దేవీదేవతలు, గురువుల ముఖాలు చూడడానికి బదులు తన ముఖమే చూడాలని

మిగతా.. 2లో

## కెటిఆర్‌వి అహంకారపూరిత వ్యాఖ్యలు

- సిఎం రేవంత్‌పై వ్యాఖ్యలు దారుణం
- మండిపడ్డ మంత్రి కోమటిరెడ్డి, మల్లు రవి
- అహంకారానికి పరాకాష్ట : సిపిఐ నారాయణ

**హైదరాబాద్,జనవరి29వెలుతురు:** సీఎంరేవంత్ రెడ్డి.. కేసీఆర్ కాలు గోటికి కూడా సరిపోడంటూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కేటీఆర్ చేసిన వ్యాఖ్యలపై సర్వత్రా విమర్శలు పెరిగాయి. కెటిఆర్ అహంకారానికి పరాకాష్టగా పలువురు నేతలు మండిపడ్డారు. కాంగ్రెస్ నేతలు, మంత్రులు, సిపిఐ నేత నారాయణ కూడా మండిపడ్డారు. ఇంకా అధికార అహంకారం వీడలేదని విమర్శలు చేశారు. కెటిఆర్ వ్యాఖ్యలపై మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి మండిపడ్డారు. కెటిఆర్‌లో ఇంకా అహంకారం తగ్గలేదన్నారు. ప్రజలు గుణపాఠం చెప్పినా పద్దతి మారలేదన్నారు. కాలి గోటికి సరిపోనివాడే మిమ్మల్ని ఫామ్ హౌస్ కు పంపించాడని ఘాటు విమర్శలు చేశారు. యాదాద్రి భువనగిరి జిల్లా బీబీ నగర్ మండలంలోని మహాదేవపూర్‌లో వేణుగోపాలస్వామి దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మీడియాతో మాట్లాడిన కోమటిరెడ్డి .. రేవంత్ రెడ్డి ప్రమాణ స్వీకారం చేసిన మూడవరోజే మూసి ప్రక్షాళన గురించి మాట్లాడారని.. మీరెప్పుడైనా దాని గురించి మాట్లాడారా అని ప్రశ్నించారు. కేటీఆర్ బాషా మార్చుకోవాలని, ముఖ్యమంత్రిని గౌరవించడం నేర్చుకోవాలని మంత్రి కోమటిరెడ్డి హితవు పలికారు. రేవంత్ రెడ్డి ఇండిపెండెంట్ జెడ్పీటీసీ నుంచి సీఎం అయిన వ్యక్తి అని.. నువ్వు కేసీఆర్ పేరుతో దొంగ మాటలు చెప్పి ఎమ్మెల్యే అయ్యావని విమర్శించారు. రేవంత్ రెడ్డి చిటికెనా వేలుకు కూడా సరిపోవంటూ కేటీఆర్ పై ధ్వజమెత్తారు. కేటీఆర్ అహంకారంతోనే నల్లగొండ జిల్లాలో వేల ఓట్ల మెజార్టీతో ఎమ్మెల్యేలు గా కాంగ్రెస్ అభ్యర్థులు గెలిచారని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ చెప్పింది అంటే చేసే చూపిస్తుందని తెలిపారు.

మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీష్ రావులు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని

మిగతా.. 2లో






### రాజ్యసభ ఎన్నికలకు
## షెడ్యూల్ విడుదల

- తెలుగు రాష్ట్రాల్లో ఆరు స్థానాలకు ఎంపిక
- ఫిబ్రవరి 8న రాజ్యసభ ఎన్నికలకు నోటిఫికేషన్
- ఫిబ్రవరి 27న పోలింగ్ ..అదే రోజున ఓట్ల లెక్కింపు

**న్యూఢిల్లీ,జనవరి29వెలుతురు:** రాజ్యసభ ఎన్నికలకు షెడ్యూల్ విడుదలైంది. 15 రాష్ట్రాలకు చెందిన 56 మంది సభ్యుల ఎంపికకు ఈసీ షెడ్యూల్ రిలీజ్ చేసింది. ఫిబ్రవరి 8న రాజ్యసభ ఎన్నికలకు నోటిఫికేషన్ విడుదల కానుండగా.. ఫిబ్రవరి 27న పోలింగ్ జరగనుంది. అదే రోజున ఓట్ల లెక్కింపు

మిగతా.. 2లో



### నేడు ప్రొఫెసర్ కోదండరామ్, మీర్ అలీఖాన్‌ల
## ప్రమాణ స్వీకారం

- మండలి సభ్యులుగా నామినేట్ కావడంతో ప్రమాణానికి రాక

**హైదరాబాద్,జనవరి29, వెలుతురు:** శాసనమండలికి నియమితులైన ప్రొఫెసర్ కోదండరామ్, మీర్ అలీఖాన్‌లు మంగళవారం ప్రమాణం చేయనున్నారు. ఈ మేరకు మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడడ్డికి సమాచారం అందించారు. నిజానికి సోమవారమే వారు ప్రమాణ స్వీకారం చేయాల్సి ఉంది. ఈ మేరకు వారు మండలికి వచ్చినా ఛైర్మన్ రాకపోవడంతో వెనుదిరిగారు. ప్రమాణ స్వీకారం గురించి మండలి ఛైర్మన్‌కు సమాచారం ఇవ్వలేదని టీజెఎస్ అధ్యక్షులు కోదండరాం అన్నారు. ఉదయం 11 గంటలకు ఎమ్మెల్సీలుగా ప్రమాణ స్వీకారం చేయడానికి కోదండరాం,అలీఖాన్ లు మండలికి వెళ్లారు. అయితే అక్కడ మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి అందుబాటులో లేరు. దీంతో కాసేపు అక్కడే ఎదురు చూశారు. అనంతరం మాట్లాడిన ఆయన..

మిగతా.. 2లో



### నార్కట్‌పల్లి రహదారిపై
## అర్థరాత్రి ప్రమాదం

- కారును ఢీకొన్న లారీ..ఐదుగురు దుర్మరణం

**మిర్యాలగూడ,జనవరి29, వెలుతురు:** నల్గొండ జిల్లా మిర్యాలగూడ వద్ద అద్దంకి-నార్కట్‌పల్లి ప్రధాన రహదారిపై ఆదివారం అర్ధరాత్రి ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. కారును గుర్తుతెలియని లారీ ఢీకొట్టడంతో అందులో ప్రయాణిస్తున్న రెండు కుటుంబాల్లోని అయిదుగురు మృతి చెందారు. వీరిలో ఇద్దరు చిన్నారులు ఉన్నారు. మరో మహిళ తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఈ ఘటనలో మిర్యాలగూడలోని నందిపాడు కాలనీకి చెందిన చెరుపల్లి మహేశ్ (32), ఆయన భార్య జ్యోతి (30), కుమార్తె రిషిత (6), మహేశ్ తోడల్లుడు, యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలం గొల్నెపల్లికి చెందిన భూమా మహేందర్ (32), ఆయన కుమారుడు లియాన్సీ (2) అక్కడికక్కడే మృతి చెందారు. మహేందర్ భార్య భూమా మాధవి తీవ్రంగా గాయపడ్డారు.

మిగతా.. 2లో

## 10 ఎంపీ స్థానాల్లో విజయం సాధిస్తాం

- కుక్కలు చింపిన విస్తరిలా ఇండియా కూటమి
- బీహర్ పరిణామాలే ఇందుకు నిదర్శనం
- తెలంగాణలో 10 లోక్‌సభ సీట్లు గెలుస్తామన్న బండి

**హైదరాబాద్, జనవరి 29 వెలుతురు:** దేశానికి, తెలంగాణకు భవిష్యత్తు బీజేపీయేనని ఆ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ అన్నారు.



లోక్‌సభ స్థానాల్లో బీజేపీ ఈసారి 350కిపైగా స్థానాల్లో గెలవడం ఖాయమని, తెలంగాణలోనూ 10కి పైగా ఎంపీ స్థానాల్లో విజయం సాధిస్తామని జోస్యం చెప్పారు. ఇండియా కూటమి కుక్కలు చింపిన విస్తరిలా మారిందని విమర్శించారు. బీహార్ లో జరుగుతున్న పరిణామాలే అందుకు నిదర్శనమని తెలిపారు. కేటీఆర్ మాటలను బీఆర్ఎసోళ్లే పట్టించుకోవడం లేదని

మిగతా.. 2లో



## నిరుపేదలకు ఆహారం పంపిణీ

**హైదరాబాద్ వెలుతురు జనవరి 29:**
సోమవారం రోజున తెలంగాణ నాన్ గెజిటెడ్ ఆఫీసర్ యూనియన్, హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు, అసద్ అన్వర్ మెమోరియల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు డాక్టర్. సయ్యద్ మాజీదుల్లా హుస్సేని (ముజీబ్) గారి ఆధ్వర్యంలో మెహదీ నవాజ్ జంగ్ క్యాన్సర్ ఆసుపత్రి ఆవరణలో సుమారు 500 నిరుపేద అటెండర్లకు పరిశుభ్రమైన మాంసాహార ఆహారాన్ని పంపిణీ చేశారు. ఈ సందర్భంలో మీడియాతో డా.ముజీబ్ కీర్తిశేషులైన తల్లిదండ్రుల పేరుమీద ట్రస్ట్ నిర్వహిస్తూ వారి ఆశీర్వాదంతో తన కుటుంబ సభ్యుల సంపూర్ణ మద్దతుతో సర్వశక్తిమంతుడు తనను ప్రతి సామాజిక కార్యక్రమాలలో ఎంచుకున్న సందర్భంగా శిరసు వంచి కృతజ్ఞతలు తెలిపారు. పెద్దలు గౌరవనీయులు తెలంగాణ రాష్ట్ర మాజీ హోం మినిస్టర్ శ్రీ మహమ్మద్ మహమూద్ అలీ గారు ఆయురారోగ్యాలతో ఉండాలని ఈనాడు ప్రత్యేకంగా అందరికీ భోజన సదుపాయాలు ఏర్పాటు చేయడం జరిగింది.కార్యక్రమంలో కేంద్ర సంఘం నాయకులు పర్వతాలు, మహమ్మద్ అబ్దుల్ ముజీబ్, వైదిక్ శర్మ, బొలిగిద్ద శంకర్, శ్రీధర్ నాయుడు, ఆస్పత్రి కోశాధికారి శేఖర్, జిల్లా ఏపీఆర్ఓ మహమ్మద్ వహీద్, ముస్తఫా షరీఫ్ మరియు హబీబ్ చావుష్ పాల్గొన్నారు.



**హైదరాబాద్ వెలుతురు జనవరి 29:** ఆదివారం రోజున సాయంత్రం హిమాయత్ నగర్ డివిజన్లోని తెలుగు అకాడమీ దొంగ ఉన్న లైన్ లో చాలా రోజుల నుంచి శుభ్రం చేయడం లేదని, చెత్త అట్లనే పేరకపోయిందని సమాచారం అందుకున్న బిఆర్ఎస్ సీనియర్ నాయకులు జి రామన్ గౌడ్ వెంటనే మున్సిపల్ అధికారులకు తెలిపి ఈరోజు తెల్లవారుజామున అక్కడి నుండి దానిని శుభ్రం చేయించడం జరిగింది.

## యువత అన్ని రంగాల్లో ముందుండాలి

**రేపటి తరానికి యువత ఆదర్శంగా నిలవాలి**

**మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్ రావు**

**- యువత క్రీడా స్ఫూర్తిని కొనసాగించాలి...**

**- విద్య తో పాటు క్రీడా నైపుణ్యం పెంపొందించుకోవాలి...**

**సిద్దిపేట టౌన్ వెలుతురు జనవరి 29:**
నియోజకవర్గ స్థాయి లో పాలమాకుల గ్రామ యూత్ ఆధ్వర్యంలో టియచ్ఆర్ వాలి బాల్ టోర్నమెంట్ లో బహుమతులను ప్రదానం చేసిన మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్ రావు



యువత క్రీడా స్ఫూర్తిని కొనసాగించాలి విద్యతో పాటు క్రీడా నైపుణ్యం పెంపొందించుకోవాలి యువత అన్ని రంగాల్లో ముందుండాలి రేపటి తరానికి యువత ఆదర్శం గా నిలవాలని మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్ రావు అన్నారు నంగునూర్ మండలం పాలమాకుల గ్రామంలో టియచ్ఆర్ యూత్ చింటు ఇమ్రాన్ ఆధ్వర్యంలో నిర్వహించిన టియచ్ఆర్ సీజన్ -2 వాలి బాల్ టోర్నమెంట్ లో గెలుపొందిన వారికి మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్ రావు క్యాంప్ కార్యాలయం లో బహుమతులు నగదు ప్రదానం చేసారు యువత అన్ని రంగాల్లో ముందుకు సాగాలని సూచించారు వాలి బాల్ టోర్నిలో విన్నర్‌గా గెలుపొందిన పాలమాకుల గ్రామ టీమ్ కు రన్నర్‌గా నిలిచిన చందలపూర్ గ్రామ యూత్‌కు నగదును ట్రోపిని అందజేశారు.


ఈ సందర్భంగా వారిని అభినందించారు.

## ఓబీసీ సెల్ మండల అధ్యక్షులు జంగిటి శ్రీనివాస్ నియామకం

**నియామకానికి సహకరించిన రాష్ట్ర టీపీసీసీ కార్యదర్శి దేవులపల్లి యాదగిరి**

**సిద్దిపేట జిల్లా ఓబీసీ సెల్ అధ్యక్షులు సూర్యవర్మకి ధన్యవాదాలు**

**సిద్దిపేట టౌన్, వెలుతురు జనవరి 29:**
సిద్దిపేటలో ఓబిసి సెల్ జిల్లా అధ్యక్షుడు సూర్య వర్మ చేతులమీర ఎన్ను కోవడం జరిగింది ఇట్టి నియామక పత్రాన్ని టిపిసిసి రాష్ట్ర కార్యదర్శి దేవులపల్లి యాదగిరి చేతుల మీదుగా తీసుకోవడం జరిగింది. ఓ బీసీ సెల్ జంగిటి శ్రీనివాస్ అధ్యక్షుడు మాట్లాడుతూ నన్ను నమ్మి నా పనిని గుర్తించి నాకు ఈ అవకాశాన్ని కల్పించిన దేవులపల్లి యాదగిరికి ప్రత్యేక ధన్యవాదములు నాకు ఈ పదవి రావడానికి నాకు సహకరించిన మండల కాంగ్రెస్ అధ్యక్షుడు తప్పెట శంకర్ తెలియజేస్తున్నాను ఓబిసి సెల్ అధ్యక్షులు మండల నియమకం అదే విధంగా నా పైన నమ్మకం ఉంచి నాకు ఈ పదవి ఇచ్చినందుకు నేను గతంలో కంటే ఇంకా నూతన ఉస్సాహంతో పని చేస్తాను అదే విధంగా మండలంలో గానీ గ్రామాల వారీగా గానీ యువకులకు ఎప్పుడు అందులో బాటులో ఉండి నంగునూర్ మండలంలో ఓసి సెల్ నీ బలోపేతం చేయడానికి నేను అహర్నిర్షలు కృషి చేస్తానని ఈ సందర్భంగా తెలియజేస్తున్నాను. ఈ కార్యక్రమంలో ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు రాగుల కృష్ణ దేవులపల్లి శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.







## బఫర్‌లో బరితెగింపు!

# దర్జాగా నాలా కబ్జా...

**అడ్డగోలుగా అనుమతులు ఇచ్చిన సిటీ ప్లానర్...**

**మంజూరు వెనుక భారీగా ముడుపులు ముట్టాయన్న ఆరోపణలు..**

**నిర్మాణాలతో కుంచించుకుపోతున్న భరత్ నగర్ నాలా....**

**కూకట్‌పల్లి వెలుతురు:**
కొందరు రియల్ ఎస్టేట్ వ్యాపారుల వల్ల భూ కబ్జాలు రోజురోజుకూ మితిమీరుతున్నాయి. ఖాళీగా కనిపిస్తే చాలు నాలాలు, చెరువులు, వాగులు, శిఖం, ప్రభుత్వ భూముల ను అన్యాక్రాంతం చేస్తున్నారు. ఆక్రమించుకున్న భూముల్లో రాత్రికి రాత్రే మట్టిపోసి వెంచర్లుగా మారుస్తున్నారు. తాజాగా మూసాపేట్ సర్కిల్ పరిధిలోని భరత్ నగర్ కాలనీ లో జరుగుతున్న నాలని ఆక్రమించి భవన నిర్మాణంపై పలు స్థానిక ప్రజలు ఫిర్యాదులు చేసి నాలాను ఆక్రమించి చేస్తున్న నిర్మాణాన్ని వెలుగులోకి తీసుకురావడం జరిగింది. స్థానికులు ఇచ్చినటువంటి ఫిర్యాదును అధికారులకు సైతం పంపించడం, ఆ వెను వెంటనే అధికారులు స్పందించి నాలాను ఆక్రమించి జరుగుతున్న నిర్మాణంపై చర్యలు తీసుకుంటామని ప్రకటించారు. ఒకవైపు చర్యలు తీసుకుంటామని ప్రకటించిన వెంటనే, నాలపై జరుగుతున్న నిర్మాణ పనులు వేగం పెంచారు. పనులు జరుగుతున్నా అధికారులు మాత్రం దాన్ని చర్యలు చేపట్టకపోవడంలో పట్ల పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మరో వైపు అధికారులే తొందరగా పనులు పూర్తి చేసుకోవాలని సూచించినట్లు సమాచారం. పనులు మాత్రం రాత్రివేళల్లో కూడా కొనసాగిస్తున్నారు. పనులు నడుస్తుండటం, అధికారులు దానివైపు పట్టించుకోకపోవడాన్ని బట్టి చూస్తే.... దానివెనుక వున్నది అధికారులేనని స్థానికులు భావిస్తున్న పరిస్థితి. చర్యలు తీసుకుంటామన్న అధికారులు ఎందుకు పట్టించుకోవడం లేదు..? పైగా పనులు పూర్తి కావస్తున్నా అటువైపు కన్నెత్తి కూడా చూడక పోవడంలో ఆంతర్యమేంటి..? యాక్షన్ తీసుకుంటామన్న అధికారులకు కలెక్షన్లు ముట్టాయా....? ఇలా స్థానికులు లేవనెత్తుతున్న ప్రశ్నలు. ఒక వైపు ప్రజలు వెలుగులోకి తీసుకురావడం...మరో వైపు స్థానికులు దానిపై జిహెచ్ఎంసి ట్విట్టర్లో ఫిర్యాదు చెయ్యడం అయినా అధికారుల్లో చలనం రావడం లేదంటే దాని వెనుక వున్న మతలబు ఇట్టే అర్థం చేసుకోవచ్చు. ఇప్పటి వరకు అక్రమ భవన నిర్మాణాలనే పట్టిచుకోని అధికారులు ప్రభుత్వ స్థలాలను, నాలాలను కబ్జా చేసి నిర్మాణాలు కొనసాగిస్తున్నా పట్టించుకోవడం లేదంటే అధికారులకు ఏవిధంగా ఏస్థాయిలో ముడుపులు అందుతున్నాయో అర్థం చేసుకోవచ్చు. అధికారులు ముడుపులకు ఆశ పడుతుండటంతో నిర్మాణ దారులు బరితెగించిపోతున్నారనేది నగ్న సత్యం. మూసాపేట్ 23 సర్కిల్ పరిధిలోని భరత్ నగర్ కాలనీలో వివేకానంద స్కూల్ దగ్గర లో నాలా బఫర్ జోన్ స్థలాన్ని ఆక్రమించి చేస్తున్న నిర్మాణం పై జిహెచ్ఎంసి, ఇరిగేషన్ అధికారుల తాత్సారం వెనుక వున్న మతలబు ఆమ్యామ్యాలేనని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా నాలా బఫర్ జోన్ లో జరుగుతున్న నిర్మాణంపై యాక్షన్ తీసుకుంటారా..? లేకా కలెక్షన్ల కోసం దానిపై ప్రేమ ఒలకబోస్తారా..? తేల్చాల్సింది అధికారులే... అవసరమైతే స్థానికులు బల్దియా బాస్ వద్దకు వెల్తామని స్పందిచని పక్షంలో ప్రజావాణి దృష్టికి సైతం తీసుకువెల్తామని, భరత్ నగర్ కాలనీలో నాలా బఫర్ జోన్ స్థలంపై నిర్మిస్తున్న భవనాన్ని ఆపే వరకు ఫిర్యాదులు చేస్తూనే వుంటామని చెబుతున్నారు. ఏదిఏమైనా అధికారులు ఇప్పటికైనా చర్యలు తీసుకుంటారా..? లేదా..? వేచి చూడాలి మరి!











# 317 జీవోను సవరిస్తారా? లేదా?

**ఆ జీవోతో ఉద్యోగ, ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు**

**చీఫ్ సెక్రటరీ కార్యాలయం వద్ద పడిగాపులు పడుతున్నా పట్టించుకోరా?**

**ప్రభుత్వాన్ని ప్రశ్నించిన బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్**

**గంగాధర మండలంలోని పంటలకు సాగునీటిని విడుదల చేయండి**

**చొప్పదండి నియోజకవర్గంలో రూ.23 లక్షల వ్యయంతో అభివృద్ధి పనులు ప్రారంభించిన సంజయ్**

**నీటి విడుదలపై నిన్న కలెక్టర్, నేడు ఇరిగేషన్ ఎస్ఈతో మాట్లాడిన సంజయ్**

**చొప్పదండి నియోజకవర్గం, వెలుతురు జనవరి 29:**
ఉద్యోగ, ఉపాధ్యాయులకు గొడ్డలిపెట్టుగా మారిన 317 జీవోను సవరిస్తారా? లేదా? అనే అంశంపై కాంగ్రెస్ ప్రభుత్వం స్పష్టం చేయాలని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్ కుమార్ కోరారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు 317 జీవోను సవరించాలని బీజేపీ పెద్ద ఎత్తున పోరాటాలు చేసిందని, తాను జైలుకు సైతం వెళ్లానని చెప్పారు. అప్పటి కాంగ్రెస్ పార్టీ నేతలు సైతం 317 జీవోను సవరించాలని కోరిన విషయాన్ని గుర్తు చేశారు.
సోమవారం రోజున మధ్యాహ్నం చొప్పదండి నియోజకవర్గం గంగాధర మండలంలోని చర్లపల్లికి విచ్చేసిన బండి సంజయ్ కుమార్ రూ. 23 లక్షల కేంద్ర నిధులతో చేపట్టిన అభివృద్ధి పనులను ప్రారంభించారు. స్థానిక ప్రజలతో కలిసి బీరప్ప ఆలయాన్ని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా గొల్ల కురుమలు బండి సంజయ్ కు గొంగడి బహుకరించారు. అనంతరం బండి సంజయ్ మీడియాతో మాట్లాడారు.



చొప్పదండి నియోజకవర్గంతోపాటు చుట్టుపక్కల ప్రాంతాల్లో సాగు నీరు రాక రైతులు పంటలు ఎండిపోతున్నాయనే బాధలో ఉన్నారు. నారాయణపూర్ రిజర్వాయర్ నీటిని విడుదల చేయాలని గత కొద్దిరోజులుగా రైతులు కోరుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. ఇది సరికాదు.. తక్షణమే సాగునీటిని విడుదల చేయాలని అధికారులను కోరుతున్నా. రేపు మాపు అని సాకు చూపకుండా నీటిని విడుదల చేసి రైతులను ఆదుకోవాలని కోరుతున్నా. రాజకీయ పార్టీలు ఆందోళన చేసే అవకాశం ఇవ్వొద్దని కోరుతున్నా.
కేసీఆర్ ప్రభుత్వ మూర?త్వపు ఆలోచనవల్ల 317 జీవో పేరుతో ఉద్యోగ, ఉపాధ్యాయులను చెట్టుకొకరిని, పుట్టకొకరిని చేశాయి. ఉద్యోగులంతా రోడ్డెక్కారు. చాలా మంది ఆత్మహత్యలు, హఠాన్మరణాలపాలయ్యారు. అయినా 317 జీవోను సవరించలేదు. దీనిపై బీజేపీ పెద్ద ఎత్తున ఆందోళన చేసింది. నేను నా ఎంపీ కార్యాలయంలో ధర్నా చేస్తే పోలీసులు గ్యాస్ కట్టర్లతో నా కార్యాలయ గేట్లను ధ్వంసం చేసి నన్ను అరెస్ట్ చేసి జైలుకు తీసుకెళ్లారు. 317 జీవోను సవరించాలని కాంగ్రెస్ నేతలు కూడా ఎన్నికల్లో కోరారు. అధికారంలోకి వచ్చాక సవరిస్తామని చెప్పారు. మరి ఇప్పుడెందుకు జాప్యం చేస్తున్నారు. డబ్బులతో పనిలేదు. జీవోను సవరిస్తే చాలు...ఉద్యోగ, ఉపాధ్యాయులు తీవ్రమైన ఇబ్బందులు పడుతున్నా మీ కంటికి కన్పించడం లేదా? ఆ సంఘం నాయకులంతా ప్రస్తుతం చీఫ్ సెక్రటరీ కార్యాలయం వద్ద పడిగాపులు పడుతున్నారు. దయచేసి వారికి అపాయిట్ మెంట్ ఇవ్వాలి. వారి సమస్యను విని వెంటనే పరిష్కరించాలని కోరుతున్నా..

### కలెక్టర్, ఎస్ఈతో మాట్లాడిన బండి సంజయ్

నారాయణపూర్ రిజర్వాయర్ నీటి విడుదలపై నిన్న జిల్లా కలెక్టర్ పమేలా సత్పతితో మాట్లాడిన బండి సంజయ్ ఈరోజు జిల్లా ఇరిగేషన్ అధికారి గుప్తతో చర్లపల్లి గ్రామం నుండి ఫోన్ లో మాట్లాడారు. నీరు లేక పంటలు ఎండిపోయే పరిస్థితి నెలకొందని, రైతులు తీవ్రమైన ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. సానుకూలంగా స్పందించిన ఇరిగేషన్ అధికారులు నీటి విడుదలపై సోమవారం రోజున సాయంత్రం నిర్ణయం తీసుకుంటామని చెప్పారు.

# సంపాదకీయం..

## దిగజారుడు రాజకీయాల్లో దిట్ట నితీశ్!

దేశ సార్వత్రిక ఎన్నికలు, పలు రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల ముందు బీహార్ రాజకీయాలు ఏవగింపు కలిగించేలా ఉన్నాయి. తాను నిబద్ధ రాజకీయనేతగా చెప్పుకుంటూ వచ్చిన నితీశ్ కుమార్ అవకాశవాద రాజకీయాలకు ఆద్యుడిగా నిలిచిపోయారు. ఎప్పటికప్పుడు తన విధానాలను మార్చుకుంటూ పోవడం రాజకీయాల్లో ఆయనను మించిన వారు ఎవరూ లేదనరి చెప్పుకోవాలి. అవసరమైతే కాంగ్రెస్ కూటమితో..లేదంటే బిజెపి కూటమితో జతకట్టడం అలవాటు చేసుకున్నారు. పదవి కోసం నానాగడ్డీ తినడం లాలూ దగ్గర నేర్చుకు న్నారా అన్న అనుమానాలు వస్తున్నాయి.ఇంతటి దిగజారుడు రాజకీయాలు గతంలో.. ఇకముందు కూడా ఎవరు చేయరేమో. ఎన్నికల్లో గెలుపోటములు మాత్రమే ప్రధానం అనుకునే వైఖరి ప్రమాదకరం. ఎందుకంటే.. ప్రజా సమస్యల కోసం నిలబడి పోరాడే చిత్తశుద్ధి గల నాయకుడు గెలిచే అవకాశం లేకపోయినా సరే, పార్టీలు అలాంటి వారికి టిక్కెట్లు ఇచ్చి నిలబెట్టాలి, ప్రోత్సహించాలి. వారికి అన్ని రకాలుగా అండగా నిలబడి పార్టీనే గెలిపించుకోవాలి. ఒకటి రెండు చోట్ల ఓటమి చెందవచ్చు కానీ.. ప్రజల కోసం నిస్వార్థంగా పనిచేసే వారికి లభించే గుర్తింపు కావాలి. ఆ మాత్రం గుర్తింపు ఉంటే వారిలోని చిత్తశుద్ధి సడలిపోకుండా ఉంటుంది. కానీ పార్టీలు అలాంటి నిజమైన నాయకుల్ని తయారుచేయడం గురించి పట్టించుకోవడం లేదు. అలాంటి వారు ఉన్నా.. ప్రోత్సహించే ఉద్దేశమూ లేదు. అధికారం, ధనార్జన మాత్రమే లక్ష్యాలుగా ఉంటున్నాయి. దానికి తగ్గట్టుగానే అభ్యర్థుల ఎంపిక జరుగుతోంది. అంతిమంగా ప్రజల కోసం పనిచేయడం మాత్రమే తెలిసిన వారు కనపడకుండా పోతున్నారు. ప్రత్యక్ష రాజకీయాల నుంచి విరమించు కుంటున్నారు. నితీశ్ విషయంలో కొంత నిజాయితీ అనిపించేది. కానీ గత చరిత్ర పరిశీలిస్తే ఆయన నిజాయితీ మంటగలిచిందనే చెప్పాలి. నితీష్ కుమార్ 20 ఏళ్లుగా బీహార్ ముఖ్యమంత్రి పీఠాన్ని వదల కుండా అంటిపెట్టుకున్నా అక్కడి ప్రజల పరిస్థితిలో మార్పు రాలేదు. జీవనస్థితిగతులు మారలేదు. ఏ ఎండకు ఆ గొడుగు పట్టడంలో...అవసరాన్ని బట్టి గోడదూకడంలో నితీష్ ముందుటారని నిరూపించు కున్నారు. ఎప్పుడు ఎవరికి చేయిస్తారో ..ఎప్పుడు ఎవరితో కలుస్తారో ...రాజకీయ విశ్లేషకులు కూడా అంచనా వేయలేకపోతున్నారు. తలపండిన రాజకీయ నేతలు, పండితులు కూడా నితీష్ కుమార్ వ్యూహాల ను పసి గట్టలేకపోయారు. పదవి కోసం ఎంతకైన దిగజారుతాడని మాత్రం ఇప్పుడు మరోమారు రుజువు అయ్యింది. రాజకీయ విలువలు గురించి అవసరం లేదు. సీఎం పదవి తర్వాతే ఏదైనా అంటాడు. సీట్లు ఎవరికి ఎక్కువున్నా సీఎం పదవి తనదే అంటారు నితీష్ కుమార్. 2013 నుంచి ఇప్పటికి నాలుగుసార్లు కూటముల మార్చేశారు నితీష్. ఎన్నిసార్లు కూటములు ఫిరాయించినా..20 ఏళ్లుగా ఆయనే ముఖ్యమంత్రి. బీహార్‌లో మహాగడ్‌బంధన్‌కు రాంరాం చెప్పారు. నితీష్ కుమార్...యూటర్న్ తీసుకోవడం ఇదేం తొలిసారి కాదు. గతంలో అనేకసార్లు ఆయన కూటమిలు మార్చేశారు. మొదట్నుంచి నితీష్ రాజకీయ రూటే సపరేటు... జనతాదళ్‌తో రాజకీయ జీవితాన్ని ప్రారంభించిన నితీష్... ఆ పార్టీ తరపున 1985లో తొలిసారి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. 1994లో ఆ పార్టీని చీల్చి సమతాపార్టీ పెట్టుకున్నారు. 1996లో లోక్‌సభకు ఎన్నికైన ఆయన అటల్ ప్రభుత్వంలో కేంద్రమంత్రిగా పనిచేశారు. 2003లో తన పార్టీని జేడీయూలో విలినం చేసేసారు. ఆ తర్వాత ఆ పార్టీకి అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. అప్పట్నుంచి ఆయనకు తిరుగు లేకుండా పోయింది. 2005లో బీజేపీతో చేతులు కలిపిన ఆయన ఘనవిజయం సాధించి తొలిసారి బీహార్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు తీసుకున్నారు. 2010లోనూ బీజేపీతో కలిసే ఎన్నికలకు వెళ్లి విజయం సాధించారు. కానీ 2013లో బీజేపీ తన ప్రధాని అభ్యర్థిగా నరేంద్రమోడీని ప్రకటించడంతో నితీష్ కమలంతో తెగతెంపులు చేసుకున్నారు. కాంగ్రెస్, ఆర్జేడీలతో కలిపి మహాగడ్‌బంధన్ ఏర్పాటు చేశారు. అయితే 2014లో లోక్‌సభ ఎన్నికల్లో పార్టీ ఘోరంగా ఓడిపోవడంతో సీఎంగా రాజీనామా చేసి మాంజీని ఆ పీఠంపై కూర్చోపెట్టారు. 2015లో మాంజీని దించేసి తాను మరోసారి సీఎం అయ్యారు. ఎన్నికల్లో ఘన విజయం సాధించారు. అయితే 2017లో మహాగడ్‌బంధన్‌కు హ్యాండిచ్చి కమలం గూటికి చేరిపోయారు. ఐఆర్‌సీటీసీ కుంభకోణంలో...సీబీఐ లాలుప్రసాద్ ఇంట్లో సోదాలు చేయడంతో ఆర్జేడీ, కాంగ్రెస్ కూటమికి గుడ్ బై చెప్పారు. 2020లో తక్కువ మెజారిటీతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశారు. 2022లో మళ్లీ బీజేపీని వదిలి మహాగడ్‌బంధన్ అంటూ కూటమిని ఏర్పాటు చేశారు. ఆర్జేడీ కంటే జేడీయూకు తక్కువమంది ఎమ్మెల్యేలు ఉన్నా నితీషే సీఎం అయ్యారు. మళ్లీ రెండేళ్లు కూడా కాకముందే మళ్లీ యూటర్న్ తీసుకున్నారు.

రకరకాల కారణాలతో కూటములు మార్చే నితీష్ ఈసారి బయటకు రావడానికి కారణం ఇండియా కూటమి ప్రధాన మంత్రి ఫేస్ కాలేకపోవడమే అంటున్నారు. ఇండియా కన్వీనర్‌గా ఖర్గేను ప్రకటించడంతో ఇక తనకు ఛాన్స్ రాదని నితీష్ డిసైడైనట్లు కనిపిస్తోంది. పైగా మరోసారి కేంద్రంలో ఎన్డీయే ప్రభుత్వమే వస్తుందన్న అంచనాలు కూడా ఆయన్ను ఆలోచనలో పడేశాయి. ఉత్తరాదిలో ప్రధాని మోడీ హవా కొనసాగుతోంది. పైగా కర్పూరి ఠాకూర్‌కు భారతరత్నతో బీహార్‌లో పొలిటికల్ ఈక్వేషన్స్ మార్చేశారు మోడీ... దీంతో నితీష్‌కుమార్ జాగ్రత్తపడ్డారు. మోడీని ఢీ కొట్టలేని పరిస్థితులు, బలం లేకపోవడంతో బీజేపీతో కలసి నడవాలని నిర్ణయించుకున్నారు. అందుకే ఆయన బిజెపి కూటమిలో చేరి తన పదవిని పదిలం చేసుకున్నారు. రాజకీయంగా దిగజారుడు వ్యవహారాలకు నితీశ్ పెద్దపీట వేశారు. దీంతో ఆయన తన నిజాయితీని కలోపోయారు. పదవికోసం ఎంతకైనా దిగజారే నేతగా చరిత్రలో నిలిచిపోతారు.

## ఎపిలో వేడెక్కుతోన్న రాజకీయం

ఆంధ్రప్రదేశ్‌లో రాజకీయ వాతావరణం వేడెక్కుతోంది. ప్రస్తుత వైసిపి ప్రభుత్వం అనేక సమస్యలు, సవాళ్ళను ఎదుర్కొంటోంది. ఎన్నికల్లో పోటీ చేసేందుకు టిక్కెట్లు దొరకని నేతల నుండి పెరుగుతున్న అసమ్మతితో పాటు ప్రభుత్వ ఉద్యోగులతో సహా వివిధ వర్గాల వారి నుండి నిరసనలు, ఆందోళనలను ఎదుర్కొంటోంది. 2019 అసెంబ్లీ ఎన్నికల్లో, మొత్తం 175 అసెంబ్లీ స్థానాలకు గాను జగన్ పార్టీ 151 గెలుచుకుంది. రాష్ట్రంలోని 25 లోక్‌సభ స్థానాల్లోనూ 22 సీట్లను కైవసం చేసుకుంది. ఇటువంటి సవాళ్ళతో కూడిన సంక్లిష్ట సమయంలో, ఈసారి మొత్తంగా 175 అసెంబ్లీ స్థానాలను గెలుచుకునేలా పార్టీ కార్యకర్తల్లో స్ఫూర్తిని, ఉత్సాహాన్ని నింపేందుకు జగన్మోహన్ రెడ్డి 'వై నాట్ 175' అంటూ ఒక నినాదాన్ని తెర మీదకు తెస్తున్నారు. స్వంత పార్టీలోనూ, బయట పెరుగుతున్న అసమ్మతి ప్రభావం ఎన్నికల ఫలితాలపై ఎలా వుంటుందో అంచనా వేయడం అంత సులభం కాకపోవచ్చు కానీ అందుకుగల అవకాశాలను తోసిపుచ్చలేం.ఇక ఎన్నికల్లో గెలుపు కోసం అన్ని పార్టీలు రంగంలోకి దిగాయి. ఒకవైపు అధికార పార్టీ వైసీపీ, మరోవైపు ప్రధాన ప్రతిపక్షం టీడీపీ, ఇంకో వైపు.. కాంగ్రెస్ చీఫ్ వైఎస్ షర్మిలలు భారీ ఎత్తున సభలు నిర్వహిస్తూ రాజకీయ వేడి పుట్టిస్తున్నాయి. వైసీపీ అధినేత జగన్, అటు టీడీపీ అదినేత చంద్రబాబు కూడా.. పెద్ద ఎత్తున ఈ సభల్లో విమర్శలు.. ప్రతి విమర్శలు చేసుకున్నారు. షర్మిల రాకతో కాంగ్రెస్ పార్టీ రాజకీయాలు



కూడా వేడడిని అందుకున్నాయి. వచ్చే ఎన్నికలకు ఇది నాంది అన్నట్టుగా మూడు పక్షాలు కూడా.. విమర్శలు సంధించుకున్నారు. విశాఖలో వైసీపీ అధినేత జగన్.. ఎన్నికల శంఖం పూరించారు. 'సిద్ధం' పేరుతో నిర్వహించిన సభలో ఎన్నికలకు తాము సిద్ధయ్యామని స్పష్టం చేశారు. ఇక, రా.. కదలిరా! సభలతో టీడీపీ అధినేత చంద్రబాబు పార్లమెంటు స్థాయి నియోజకవర్గాల్లో కొన్నాళ్లుగా సభలు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో ఆయన కూడా వచ్చే ఎన్నికలకు రెడీ అయిపోయామని స్పష్టం చేస్తున్నారు. మరోవైపు కాంగ్రెస్ పార్టీని పుంజుకునేలా చేసేందుకు వైఎస్ షర్మిల చేపట్టిన యాత్రలు కూడా జోరుగానే సాగుతున్నాయి. ఆయా సభలు, యాత్రల్లో ఒకరిపై ఒకరు విమర్శలతో రెచ్చిపోతున్నారు. ఒకరు రాష్ట్రానికి పట్టిన శని వదులుతుందని అంటే.. మరొకరు.. రాష్ట్రానికి ఉన్న శకుని వదిలిపోతాడని మాటల తూటాలు పేల్చుకున్నారు. అటు వైపు మాటల తూటాలు పేలితే.. ఇటు వైపు అంతకుమించిన బాంబులే పేలాయి. ఇలా.. ఇరు పక్షాల మధ్య పోటా పోటీ వ్యాఖ్యలు చోటు చేసుకున్నాయి. షర్మిల ఏకంగా.. అన్న సీఎం జగన్‌పైనా, అధికార పార్టీపైనా తీవ్ర విమర్శలు చేస్తున్నారు. మొత్తంగా ప్రచార హోరు హోరెత్తిపోతోంది. బిజెపి నుంచి ప్రచారంలోకి మోడీ, అమిత్ షాలు కూడా త్వరలోనే అడుగు పెట్టనున్నారు. అదేసమయంలో జనసేన అదినేత పవన్ కళ్యాణ్ కూడా జోరు పెంచుతున్నారు. టీడీపీ నుంచి నారా ఫ్యామిలీ, నారా లోకేష్, బ్రాహ్మణి, బాలయ్య.. వంటివారు దిగిపోనున్నారు. ఇక, కాంగ్రెస్ పార్టీ నుంచి కూడా మరింత మంది ప్రచారం చేయనున్నారు. జై భారత్ నేషనల్ పార్టీ సహా కమ్యూనిస్టులు కూడా అరంగేట్రం చేయనున్నారు. మొత్తంగా ఎన్నికల వేడితో ఎపి రాజుకుంటోంది.

# పరీక్ష ఒత్తిడిని తగ్గించడం...

## విద్యార్థుల శారీరక ఆరోగ్యం, మానసిక శ్రేయస్సును సమతుల్యం చేయడం

-ధర్మేంద్ర ప్రధాన్
కేంద్ర విద్య , నైపుణ్యాభివృద్ధి మరియు వ్యవస్థాపకత శాఖ మంత్రి

ప్రస్తుతం అని రంగాలతో పాటు విద్యా రంగంలో పోటీ తీవ్రంగా ఉంది.విద్యా రంగంలో నెలకొన్న తీవ్రమైన పోటీ వాతావరణంలో వల్ల విద్యార్థులు విద్యలో రాణించడానికి తీవ్రంగా శ్రమించాల్సి వస్తోంది. ఇదే సమయంలో శారీరక,మానసిక ఆరోగ్యాన్ని కాపాడుకోవడం కోసం విద్యార్థులు ప్రయత్నించాల్సి వస్తోంది. ఈ రెండు అంశాల మధ్య సున్నితమైన సమతుల్యతను సాధించడం విద్యార్థులకు ఒక సవాలుగా మారింది. పరీక్షల సమయంలో ఒత్తిడి మరింత ఎక్కువగా ఉంటుంది. పరీక్షల్లో రాణించడానికి విద్యార్థులు తీవ్రంగా కృషి చేయడం సహజం. ఈ సమయంలో మానసిక ఒత్తిడి మరింత పెరుగుతుంది. దీని ప్రభావం వారి ఆరోగ్యంపై కూడా కనిపిస్తుంది. పరీక్ష సన్నద్ధత చాలా ముఖ్యం అనడంలో సందేహం లేదు. కానీ చదువుకు, ఆరోగ్యకరమైన జీవితానికి మధ్య సమతుల్యత సాధించడం చాలా ముఖ్యం.

నేడు పరీక్షల్లో రాణించి ప్రతిభ కనబరచడానికి విద్యార్థులు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నారు. మానసిక పరిస్థితి కంటే పరీక్షల్లో రాణించడానికి వారు ప్రాధాన్యత ఇస్తున్నారు. పరీక్షలో రాణించాలి అన్న విద్యార్థుల పట్టుదల, తపన వారిపై అనేక దుష్ప్రభావాలు కనిపిస్తున్నాయి. సృజనాత్మకత, ప్రతిభ దెబ్బతింటున్నాయి. ప్రతి పిల్లవాడు ప్రత్యేకమైన ప్రతిభను కలిగి ఉంటాడు. అందరూ విద్యాపరంగా ఒకే విధంగా రాణించలేరు. ఇది మనందరికీ బాగా తెలిసిన విషయమే! . పరీక్షల ఫలితాలను బట్టి పిల్లల ప్రతిభను అంచనా వేయలేం. పరీక్ష ఫలితాలు మాత్రమే విద్యార్థి జీవితంలో విజయానికి కొలమానం కాకూడదు. మనమందరం- తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, స్నేహితులు , కుటుంబ సభ్యులు కలిసి కృషి చేసి పిల్లలు తమ పూర్తి సామర్థ్యాన్ని గ్రహించడానికి అనువైన వాతావరణాన్ని అందించాలి. పరీక్ష ఫలితం కేవలం ప్రతిభపై మాత్రమే కాకుండా,ఏకాగ్రత పెంచి శ్రమను తట్టుకునే ఆరోగ్యకరమైన శరీరం, చురుకైన మనస్సు వంటి అనేక విషయాలపై ఆధారపడి ఉంటుంది అన్న అంశాన్ని ప్రతి ఒక్కరు గుర్తించాల్సి ఉంటుంది.

విద్యార్థులపై వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, చుట్టుపక్కల నివసిస్తున్న వారు అనేక ఆశలు పెట్టుకుంటారు. విద్యాపరంగా రాణించడానికి కుటుంబం, ఉపాధ్యాయులు, సమాజం పెట్టుకున్న ఆకాంక్షల భారాన్ని మోయాల్సి వస్తోంది.దీనివల్ల మానసికంగా, శారీరకంగా బలహీనపడే అనివార్య పరిస్థితికి దారి తీస్తుంది. కొన్నిసార్లు, వారి శక్తి వృథా అవుతుంది. అధిక ఒత్తిడి వారి ఆరోగ్యం, శ్రేయస్సును దెబ్బతీస్తుంది. ఆందోళన, నిరాశ , నిద్ర రుగ్మతలు వంటి మానసిక ఆరోగ్య సమస్యలకు అధిక ఒత్తిడి ఒక కారణంగా మారుతుంది. ఈ పరిస్థితి నుంచి బయటపడడానికి మానసిక శ్రేయస్సును పెంపొందించడం చాలా అవసరం. ఈ సవాళ్లను అధిగమించడానికి, విద్యార్థులు ఎల్లప్పుడూ సానుకూల దృక్పథం కలిగి ఉండాలి. ఏకాగ్రత స్థాయి పెంచడానికి, చదువుపై దృష్టి పెట్టడానికి వ్యాయామం, ధ్యానం, గట్టిగా గాలి పీల్చుకోవడం చేయాలి. వ్యవస్థీకృత అధ్యయన దినచర్యను అవలంభించాలి. ప్రాధాన్యతా క్రమంపై పనులను గుర్తించి పూర్తి చేయాలి. సాధించడానికి వాస్తవిక విద్యా లక్ష్యాలను నిర్ణయించుకోవాలి. దీనిలో కౌన్సిలింగ్ సేవలు కీలక పాత్ర పోషిస్తాయి.కౌన్సిలింగ్ వల్ల మానసిక ఆరోగ్యం కలుగుతుంది. ఆందోళన లేదా ఇతర మానసిక ఆరోగ్య సమస్యలు దూరం అవుతాయి.

పరీక్షల సమయంలో విద్యార్థుల శారీరక ఆరోగ్యం, మానసిక శ్రేయస్సును రక్షించుకోవడానికి ఈ క్రింది మార్గాలు ఎంతగానో ఉపయోగపడతాయి:

### చిన్న విరామాలు, శారీరక వ్యాయామం :

మనిషి ఆరోగ్యంగా చురుగ్గా ఉండడానికి శారీరక వ్యాయామం ఎంతగానో తోడ్పడుతుంది. క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం వల్ల గుండె ఆరోగ్యం మెరుగుపడుతుంది. ఒత్తిడిని తగ్గించే సాధనంగా శారీరక వ్యాయామం పనిచేస్తుంది.దీనివల్ల పనితీరు మెరుగుపడుతుంది. సమాచారాన్ని గుర్తుంచుకునే సామర్థ్యం పేరుంటుంది. ఈ రెండూ పరీక్ష పనితీరును మెరుగుపరచడానికి కీలకం. పరీక్షలకు సిద్ధం అవుతున్నప్పుడు విద్యార్థులు తమ ఆరోగ్యం కంటే చదువుకే ఎక్కువ ప్రాధాన్యం ఇస్తారు. అయితే, కొన్ని రకాల శారీరక కార్యకలాపాలను చేర్చడానికి మనం వారిని ప్రోత్సహించాలి. స్ట్రెచింగ్, నడక, జాగింగ్ లేదా యోగా ఒత్తిడిని గణనీయంగా తగ్గించగలవు, విద్యార్థులు వారి మనస్సులను రీఛార్జ్ చేయడానికి సహాయపడుతాయి.

### సమతుల్య ఆహారం మరియు పోషణ:

గట్టిగా చదవడానికి, ఆరోగ్య పరిరక్షణలో పోషకాహారం కీలక పాత్ర పోషిస్తుంది. ఆహారం మన శరీరానికి, మనస్సుకు



ఒక ఇంధనంగా పని చేస్తుంది. . మనం తినే ఆహారం నాణ్యత మన మొత్తం ఆరోగ్యం మరియు మానసిక శ్రేయస్సును గణనీయంగా నిర్ణయిస్తుంది. ఈ క్లిష్టమైన సమయంలో విద్యార్థులు తరచుగా చేసే ఒక సాధారణ తప్పు ఏమిటంటే, కొద్దిగా తినడం లేదా పోషకమైన ఇంట్లో తయారుచేసిన ఆహారానికి బదులుగా జంక్ ఫాస్ట్ ఫుడ్, చాక్లెట్లు, ఎనర్జీ డ్రింక్స్ మరియు చిప్స్ వంటి అనారోగ్యకరమైన ఆహారాన్ని తీసుకోవడం. కొన్నిసార్లు వారు ఆందోళన, ఒత్తిడి కారణంగా లేదా పరీక్షకు సిద్ధం కాడానికి సమయాన్ని ఆదా చేయడానికి పరీక్షల సమయంలో భోజనాన్ని దాట వేస్తారు. విటమిన్లు, ఖనిజాలు మరియు ఫైబర్ అధికంగా ఉండే సమతుల్య ఆహారం తీసుకోవడం సరైన మెదడు పనితీరుకు అవసరమైన శక్తి అందుతుంది.ద్రవ పదార్థాలు తీసుకోవడానికి కూడా విద్యార్థులు ఆసక్తి చూపారు. ద్రవ పదార్థాలు ముఖ్యమైనవి. ద్రవ పదార్థాలు తీసుకోకపోవడం వల్ల సామర్థ్యం ఏకాగ్రత గణనీయంగా తగ్గుతాయి.

### మంచి ఆరోగ్యానికి తగినంత నిద్ర:

పరీక్షల సమయంలో తగినంత నిద్ర కూడా ముఖ్యం. పనితీరు, జ్ఞాపకశక్తి నిలుపుదల మరియు భావోద్వేగ స్థితిస్థాపకత మధ్య నిద్రకు ప్రత్యక్ష సంబంధం ఉంది. విద్యార్థులు ప్రతిరోజూ ఒకే సమయంలో పడుకోవడం , మేల్కొనడం ద్వారా స్థిరమైన నిద్ర విధానాలు పాటించాలి. . రాత్రిపూట సరైన మోతాదులో నిద్రపోయే విద్యార్థులు ఎల్లప్పుడూ మంచి జ్ఞాపక శక్తిని కలిగి ఉంటారు. మెరుగైన పనితీరు కనబరుస్తారు. మంచి ఆరోగ్యానికి మంచి నిద్ర కూడా చాలా అవసరం.

### సహాయక, ప్రోత్సాహక వాతావరణం:

విద్యార్థులు తమ సమస్యలను చర్చించడానికి మరియు వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల నుంచి మద్దతు పొందడానికి అనుకూలమైన వాతావరణాన్ని మనం కల్పించాలి. . ఒత్తిడి, ఆందోళన లేదా ఇతర మానసిక ఆరోగ్య సవాళ్లను ఎదుర్కోడానికి కౌన్సిలింగ్ సేవలు అందించడం ఒక ప్రధాన సంస్థాగత ప్రాధాన్యతగా ఉండాలి. పరీక్షల ఒత్తిళ్ల గురించి బహిరంగ చర్చ జరిగేలా ప్రోత్సహించాలి. మానసిక సమస్యలను సమర్థవంతంగా ఎదుర్కొనే విధంగా ప్రోత్సహించాలి.

### వ్యాయామం , ధ్యానం:

పరీక్ష ఒత్తిడిని సమర్థవంతంగా ఎదుర్కోవడానికి ధ్యానం ఒక ఆయుధంలా ఉపయోగపడుతుంది. విద్యార్థులు ధ్యానం, లోతైన శ్వాస లేదా యోగా వంటి పద్ధతులు అభ్యసించాలి, ఇది మనస్సును శాంత పరచడానికి, ఏకాగ్రతను మెరుగుపరచడానికి, ఆందోళనను తగ్గించడానికి సహాయపడుతుంది. ఈ పనులు ఒత్తిడిని తగ్గించడానికి, మానసిక శ్రేయస్సును పెంచడానికి సహాయపడతాయి.

### సమయపాలన:

చివరి నిమిషంలో ఒత్తిడికి గురి కాకుండా తమను తాము రక్షించుకోవడానికి విద్యార్థులు అధ్యయన సమయాలు నిర్ణయించుకోవాలి. ఎలక్ట్రానిక్ మాధ్యమం పై విపరీతంగా ఆధారపడటం వల్ల విద్యార్థులకు స్క్రీన్ టైమ్ ఎలా పెరిగిందో మనందరికీ తెలుసు. ప్రస్తుత కాలంలో ఎలక్ట్రానిక్ మాధ్యమం ఒక అవసరంగా మారింది అని మనం అర్థం చేసుకున్నాం. కానీ, ఈ విషయంలో విద్యార్థులు సమతూకం పాటించాలి. పరీక్షల కోసం సమయాన్ని కేటాయించడానికి డిజిటల్ పరికరాలకు దూరం కాక తప్పదు అన్న అంశాన్ని విద్యార్థులు గుర్తించాలి.

చివరగా, పరీక్షల సమయంలో విజయంలో విద్యార్థుల శారీరక ఆరోగ్యం,మానసిక శ్రేయస్సు అంతర్భాగంగా ఉంటాయి అని ప్రతి ఒక్కరూ గుర్తించాల్సి ఉంటుంది. విద్యార్థుల బాగోగులు చూసుకోవడం వల్ల వారు విద్యా రంగంలో రాణిస్తారు. దీనివల్ల పరీక్షల తర్వాత ఎదురయ్యే సవాళ్లను ఎదుర్కోవడానికి వారు మానసికంగా సిద్ధం అవుతారు. చదువుతో పాటు ఆరోగ్యానికి ప్రాధాన్యత ఇవ్వాలని,, శారీరక వ్యాయామం, ధ్యానం, డిజిటల్ పరికరాలకు దూరంగా ఉండాలని , మానసిక శ్రేయస్సు, నాణ్యమైన నిద్ర మరియు ఆరోగ్యకరమైన ఆహారం, సమర్థవంతమైన సమయ నిర్వహణ వ్యూహాన్ని అనుసరించాలని మేము విద్యార్థులకు ప్రతి ఒక్కరూ సూచించి ఆచరించేలా చేయాలి.

పరీక్ష ఒత్తిడిని సమర్థవంతంగా నిర్వహించడం ద్వారా యువ విద్యార్థులు తమ సామర్థ్యానికి మరింత పదును పెట్టి రాణిస్తారు. వికాసిత భారత్ ఏ 2047 లక్ష్యాలను సాధించడానికి కట్టుబడిన ఆత్మవిశ్వాసం, ముందు చూపుగల యువకులుగా ఎదుగుతారు.

# ఎమ్మెల్యేల గెలుపుపై హైకోర్టులో పిటిషన్లు

ఉభయ తెలుగు రాష్ట్రాల్లోనూ రాజకీయాలు వేడెక్కు తున్నాయి. తెలంగాణలో ఓటమి చెందిన బిఆర్ఎస్ నేతలు కన్నూమిన్నూ గానక మాట్లాడుతున్నారు. మరీ ముఖ్యంగా బిఆర్ఎస్ వర్కింగ్ ప్రసిడెంట్ కెటిఆర్ తీరు దారుణంగా ఉంది. బజారు రాజకీయ నాయకుడి కన్నా దారుణంగా ఆయన ప్రవర్తన ఉంది. ఆయన తన వైఖరి మార్చుకోకుంటే ప్రజలు మరోమారు ఎంపి ఎన్నికల్లోనూ గుణపాఠం చెప్పక తప్పదు. ఇకపోతే గత నవంబరులో జరిగిన శాసనసభ ఎన్నికల్లో గెలిచిన 24 మంది అభ్యర్థుల ఎన్నికను సవాల్ చేస్తూ హైకోర్టులో పిటిషన్లు దాఖలయ్యాయి. వారి ఎన్నిక చెల్లదని, శాసనసభ సభ్యత్వాన్ని రద్దు చేసి.. తమను ఎమ్మెల్యేలుగా ప్రకటించాలని మరికొందరు ఉన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్ రావు ఎన్నికను సైతం సవాల్ చేశారు. అయితే, నిబంధనల ప్రకారం ఎన్నికలు ముగిసిన 45 రోజుల్లోపే ఆ ఎన్నికను సవాల్ చేస్తూ పిటిషన్ దాఖలు చేయాల్సి ఉంటుంది. అయితే, ఈ పిటిషన్లన్నీ ఇంకా స్క్రూట్నీ దశలోనే ఉన్నాయి. అన్నీ సక్రమంగా ఉంటే త్వరలోనే హైకోర్టు రిజిస్ట్రీ వీటికి నెంబర్లు కేటాయించనుంది.

2023 శాసనసభ ఎన్నికల్లో మాజీ మంత్రి కేటీఆర్, బీఆర్ఎస్ తరపున సిరిసిల్ల నుంచి పోటీ చేయగా.. కాంగ్రెస్ తరపున మహేందర్ రెడ్డి పోటీ చేశారు. కేటీఆర్ కు 89,224 ఓట్లు రాగా, మహేందర్ రెడ్డికి 59,557 ఓట్లు వచ్చాయి. అయితే, కేటీఆర్ తన ఎన్నికల అఫిడవిట్ లో పూర్తి సమాచారం ఇవ్వలేదని.. ఆయన ఎన్నిక చెల్లదని మహేందర్ రెడ్డి పిటిషన్ లో పేర్కొన్నారు. తన కుమారుడు హిమాన్షు పేరుతో ఉన్న 32 ఎకరాల భూమి వివరాలు వెల్లడించలేదని ఫిర్యాదు చేశారు. ఈ భూమి సేల్ డీడ్ ను సైతం మహేందర్ రెడ్డి సమర్పించారు. అలాగే, అమెరికా వర్శిటీలో చదువుతున్న కుమారుడికి కేటీఆరే ఫీజు కడుతున్నా డిపెండెంట్ గా చూపలేదని అన్నారు. అలాగే, వీవీ ప్యాట్లను మరోసారి లెక్కించేలా ఎన్నికల కమిషన్ కు



ఆదేశాలివ్వాలని కోరారు. కేటీఆర్ ఎన్నికను రద్దు చేసి తనను ఎమ్మెల్యేగా ప్రకటించాలని విజ్ఞప్తి చేశారు. కేటీఆర్ తన కొడుకు ఆస్తులు చూపలేదని మరో పిటిషన్ సైతం దాఖలైంది. అటు, సిద్దిపేటలో బీఆర్ఎస్ నుంచి హరీశ్ రావు, కాంగ్రెస్ తరపున హరికృష్ణ, బీఎస్పీ నుంచి చక్రధర్ గౌడ్ పోటీ చేశారు. హరీశ్ రావుకు 1,05,514 ఓట్లు రాగా హరికృష్ణకు 23,206 ఓట్లు, చక్రధర్ కు 16,610 ఓట్లు వచ్చాయి. అయితే, హరీశ్ రావు అఫిడవిట్ లో పూర్తి సమాచారం వెల్లడించకుండా దాచిపెట్టారని, తన కుమారుడి వివరాలు పేర్కొనలేదని చక్రధర్ హైకోర్టును ఆశ్రయించారు. 2018లో 36 కేసులుండగా, 2023లో 3 కేసులు ఉన్నట్లుగా అఫిడవిట్ లో పేర్కొన్నారని.. మిగిలిన కేసుల గురించి ప్రస్తావించలేదని అన్నారు. హరీశ్ రావు ఎన్నికను రద్దు చేయాలని కోరారు. హుజూరాబాద్ నుంచి బీఆర్ఎస్ తరపున పోటీ చేసి గెలిచిన పాడి కౌశిక్ రెడ్డి విజయాన్ని సవాల్ చేస్తూ బీజేపీ నేత ఈటల రాజేందర్ పిటిషన్ దాఖలు చేశారు. అలాగే, జూబ్లీహిల్స్ నుంచి బీఆర్ఎస్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ విజయాన్ని సవాల్ చేస్తూ కాంగ్రెస్ నేత అజారుద్దీన్, కూకట్‌పల్లి నుంచి మాధవరం కృష్ణారావు ఎన్నికపై కాంగ్రెస్ నేత బండి రమేశ్ పిటిషన్లు దాఖలు చేశారు. అలాగే, ఆసిఫాబాద్, గద్వాల, పటాన్ చెరు, కామారెడ్డి, షాద్ నగర్, ఆదిలాబాద్, మల్కాజిగిరి, కొత్తగూడెం తదితర నియోజకవర్గాల్లో బీఆర్ఎస్ నేతల గెలుపును సవాల్ చేస్తూ కాంగ్రెస్ అభ్యర్థులు ఉన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. ఎమ్మెల్యేల ఎన్నికల అఫిడవిట్ లో అవకతవకలు ఉన్నాయని, సరైన వివరాలు వెల్లడించలేదని ఆరోపించారు. ఈవీఎం, వీవీ ప్యాట్ లను మళ్లీ లెక్కించాలని కోరారు. మరోవైపు, నాగర్ కర్నూల్ నుంచి బీఆర్ఎస్ తరపున బరిలో నిలిచిన మర్రి జనార్దన్ రెడ్డి ఎన్నికల కమిషన్ తన విధులు సక్రమంగా నిర్వహించలేదని పిటిషన్ వేశారు. అయితే, 2018 అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించిన పిటిషన్లే ఇప్పటికీ హైకోర్టులో పెండింగ్ లో ఉన్నాయి. అప్పటి ఎన్నికలకు సంబంధించి కొత్తగూడెం, గద్వాల ఎమ్మెల్యేలను అనర్హులుగా ప్రకటిస్తూ ఉన్నత న్యాయస్థానం తీర్పులు ఇచ్చింది. అయితే, ఈ ఆదేశాలపై సదరు ఎమ్మెల్యేలు సుప్రీంకోర్టును ఆశ్రయించి స్టే తెచ్చుకున్నారు.

# మహిళల అభివృద్ధికి ప్రభుత్వం కృషి : బండి రమేష్




**కూకట్‌పల్లి, వెలుతురు:** మహిళల ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తుందని కూకట్ పల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి బండి రమేష్ అన్నారు. మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా అధ్యక్షురాలు రాజనొల్ల లక్ష్మీ ఆధ్వర్యంలో సోమవారం గాజుల రామారంలోని విన్ ప్యాలెస్ ఫంక్షన్ హాల్లో మహిళా విభాగం సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు సునీత రావు, మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా అధ్యక్షులు సింగిరెడ్డి హరివర్ధన్ రెడ్డి, కుతుబులాపూర్ నియోజకవర్గ ఇన్చార్జి కొలను హనుమంత్ రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సొంటి రెడ్డి పున్నా రెడ్డి, తెలంగాణ రాష్ట్ర జనరల్ సెక్రెటరీ పుష్ప రెడ్డి, కూకట్పల్లి నియోజకవర్గ ఇన్చార్జ్ బండి రమేష్ హాజరయ్యారు. ఈ సందర్భంగా బండి రమేష్ మాట్లాడుతూ రాబోయే పార్లమెంట్ ఎలక్షన్స్ లో పార్టీ అభ్యర్థిని బ్రహ్మాండమైన మెజారిటీతో గెలిపించుకోవాలని అన్నారు. ఘన చరిత్ర కలిగిన పార్టీ కాంగ్రెస్ పార్టీ అన్నారు. కాంగ్రెస్ పార్టీ దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపిందన్నారు. పార్టీ ఎదుగుదలకు మహిళల కృషి ఏనలేనిదని ఒక పార్టీ ఎదుగుదలకు మొదట స్థాయి మహిళలకే ఉంటుంది అన్నారు. స్త్రీ లేకపోతే జననం లేదు, స్త్రీ లేకపోతే గమనం లేదు, స్త్రీ లేకపోతే అసలు సృష్టి లేదు అన్నారు.

ఈ కార్యక్రమంలో జిల్లాలోని అన్ని నియోజకవర్గాలలోని బ్లాక్ డివిజన్లో మహిళ అధ్యక్షులు, నాయకురాలు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పార్టీతోనే మహిళలకు సముచిత స్థానం...

### కాంగ్రెస్ పార్టీ గెలుపు కోసం కృషి చేసిన ప్రతి మహిళకు కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుంది

### టీపీసీసీ అధికార ప్రతినిధి డా. సత్యం శ్రీరంగం.



**కూకట్‌పల్లి వెలుతురు:** కాంగ్రెస్ పార్టీతోనే మహిళలకు సముచిత స్థానం సాధ్యమని టిపిసిసి అధికార ప్రతినిధి టిపిసిసి సభ్యులు డాక్టర్ సత్యం శ్రీరంగం అన్నారు. మేడ్చల్ మల్కాజ్ గిరి జిల్లా అధ్యక్షురాలు రాజనొల్ల లక్ష్మి ఆధ్వర్యంలో సోమవారం గాజుల రామారంలోని విన్ ప్యాలెస్ ఫంక్షన్ హాల్ లో మహిళా విభాగం సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు సునీత రావు, మేడ్చల్ మల్కాజ్ గిరి జిల్లా అధ్యక్షులు సింగిరెడ్డి హరివర్ధన్ రెడ్డి, కుత్బుల్లాపూర్ నియోజక వర్గ ఇంచార్జి కోలన్ హన్మంత్ రెడ్డి, టీపీసీసీ అధికార ప్రతినిధి డా. సత్యం శ్రీరంగం, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి సొంటి రెడ్డి పున్నారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా సత్యం శ్రీరంగం మాట్లాడుతూ గత పది సంవత్సరాల నుండి కాంగ్రెస్ పార్టీ అధికారంలో లేనపుడు కాంగ్రెస్ పార్టీ కోసం భర్తలను, పిల్లల్ని వదిలి పెట్టి కాంగ్రెస్ నాయకులతో సమానంగా పోరాటం చేసి, కాంగ్రెస్ పార్టీ గెలుపు కోసం కృషి చేసిన ప్రతి సోదరీమణులకి కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని అన్నారు. ఇప్పటికే కాంగ్రెస్ పార్టీ మానిఫెస్టోలో పేర్కొన్నట్లు మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించిందని త్వరలో 500 రూ.ఎం గ్యాస్ సిలెండర్‌ను, అదేవిధంగా అర్హులైన ప్రతి మహిళకు 2500 రూ|| అందిస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లాలోని అన్ని నియోజకవర్గాలలోని బ్లాక్, డివిజన్ ల మహిళా అధ్యక్షులు, నాయకురాళ్లు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఈనెల 14 నుండి 30 వరకు జంతు సంరక్షణ పక్షోత్సవాలు

### జిల్లా కలెక్టర్ సి నారాయణరెడ్డి ఐపిఎస్

**వికారాబాద్ జిల్లా ప్రతినిధి (వెలుతురు న్యూస్):** దేశ వ్యాప్తంగా జంతు సంరక్షణ పక్షోత్సవాలు ఈనెల 14 నుండి 30 వరకు జరుపుకుంటున్న సందర్భంగా జిల్లా కలెక్టర్ గారు మరియు అదనపు కలెక్టర్ల గార్ల ఆధ్వర్యంలో ఈరోజు కాన్ఫరెన్స్ హాల్ లో జిల్లా పశు వైద్య మరియు పశు సంవర్ధక అధికారి మరియు మిగతా జిల్లా అధికారులతో కలిసి జంతు సంరక్షణ పక్షోత్సవాల కరపత్రాలను, పోస్టర్లను ఆవిష్కరించడం జరిగింది.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి మాట్లాడుతూ జంతు హింసకు పాల్పడకుండా, జంతువుల పట్ల కరుణతో ఉంటూ వాటిని సంరక్షించవలసిన అవసరం ప్రతి పౌరునిపై ఉందని తెలియచేశారు. వికారాబాద్ జిల్లా లో జంతు సంరక్షణ కొరకు సేవచేయు వారికి, స్వచ్ఛంద సంస్థలకు ప్రతి పౌరుడు సహకరించాలని తద్వారా ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి దోహదపడాలని, వన్యప్రాణులు కనిపించినట్లయితే అటవీశాఖ అధికారులకు సమాచారం ఇచ్చి వాటిని సురక్షిత అటవీ ప్రాంతానికి తరలించేందుకు సహకరించాలని, పక్షులు నివసించే ఆవాసాలైన వృక్షాలను నరకరాదని అదేవిధంగా పశువులను , జంతువులను రవాణా చేసే క్రమంలో తప్పనిసరిగా జంతు రవాణా నిబంధనలను పాటించాలని, వీధులలో తిరిగే కుక్కలు, పిల్లులు, ఆవులు తదితర జంతువుల పట్ల కరుణతో వ్యవహరించి వాటికి ఆహారం, త్రాగునీరు అందించాలని వాటిని హింసకు గురి చేయకూడదని, పెంపుడు జంతువులకు క్రమం తప్పకుండా రోగ నిరోధక టీకాలు వేయించాలని కోరుచున్నారు. పెంపుడు జంతువులను అమ్ముట, కొనుట వాటి సంతాన అభివృద్ధి ( బ్రీడింగ్ )చేయడం ద్వారా వ్యాపారం చేయువారు తప్పని సరిగా జంతు సంరక్షణ బోర్డు నుండి రిజిస్ట్రేషన్ పొందాలని సూచిస్తున్నారు. నిబంధనలు ఉల్లంగించినట్లయితే శిక్షార్హులు అవుతారాని తెలియచేస్తున్నారు. అలాగే ప్రజలు తినుబండారాలు కలిగిన ప్లాస్టిక్ కోవర్లను రోడ్డు ప్రక్కన మరియు ఆరు బయట పడేయరాదని, జంతువులు అట్టి ప్లాస్టిక్ కోవర్లు, సంచులు తినడం వలన చనిపోయే ప్రమాదం ఉందని తెలియచేస్తున్నారు. వివిధ గవర్నమెంట్ పాఠశాలల్లో జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాలలో జంతు సంరక్షణ, సంక్షేమం పై నిర్వహించిన వ్యాస రచన పోటీలో గెలుపొందిన 6,7,8,9 మరియు 10 వ తరగతి విద్యార్థులకు బహుమతులు అందజేసినారు. ఈ సందర్భంగా పశుసంవర్ధక శాఖ, వికారాబాద్ జిల్లా తరపున స్కూల్ పిల్లలకి జంతు సంరక్షణ పై అవగాహన కల్పించడం, పక్షుల కొరకు జామూన్, వేప, రావి ఇతర మొక్కలు నాటడం వంటి కార్యక్రమాలపై ప్రజలకు అవగాహణ కల్పించడం మరియు పశు వైద్య క్యాంప్‌లు నిర్వహించడం జరుగుతుందని తెలియ చేస్తున్నారు. ప్రతీ పశు వైద్యశాలలో పెంపుడు కుక్కలకు ఉచితముగా రేబీస్ వ్యాధి నిరోధక టీకాలు వేస్తారని తెలియచేసారు.

ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్లు రాహుల్ శర్మ, లింగ్యా నాయక్, పశుసంవర్ధక శాఖ అధికారి అనిల్ కుమార్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.





# ప్రజా సమస్యల పరిష్కారమే కాంగ్రెస్ ధ్యేయం : కాంగ్రెస్ నాయకులు

**కూకట్‌పల్లి, వెలుతురు:**
తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశానుసారం, కూకట్ పల్లి నియోజకవర్గ ఇంచార్జ్ బండి రమేష్ సూచనల మేరకు బాలానగర్ డివిజన్ ముఖ్యనాయకులు డివిజన్లలోని ప్రతి బస్తీ, కాలనీలు విస్తృతంగా పర్యటించి అక్కడ నెలకొన్న సమస్యలను ప్రజలను అడిగి తెలుసుకున్నారు. సమస్యలను ఇంచార్జ్ దృష్టికి తీసుకువెళ్లి త్వరగా పరిష్కారం అయ్యేలా చూస్తామని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర మహిళ జనరల్ సెక్రెటరీ కొండకింది పుష్ప రెడ్డి, ఏ. బ్లాక్ అధ్యక్షుడు నాగిరెడ్డి, ఏ. బ్లాక్ ఉపాధ్యక్షుడు మాదిరెడ్డి యుగంధర్ రెడ్డి, డివిజన్ అధ్యక్షుడు మధుగౌడ్, మాజీ కౌన్సిలర్స్ సంజీవ, లక్ష్మయ్య, సీనియర్ నాయకులు మోహన్ రెడ్డి, మేడ్చల్ డిస్ట్రిక్ట్ ఎస్సీ డిపార్ట్మెంట్ వైస్ ఛైర్మన్ మధుమోహన్, మేడ్చల్ మల్కాజిగిరి డిస్ట్రిక్ట్ ఫిషేర్మన్ కమిటీ వైస్ చైర్మన్ ఆకుల నరేందర్, వర్కింగ్ ప్రెసిడెంట్ ప్రసన్నకుమార్, డివిజన్ జనరల్ సెక్రటరీలు మహేందర్, హేమంత్, నియోజకవర్గ మీడియా కోఆర్డినేటర్ గజానంద్ శేఖర్, ఎస్సీ సెల్ కన్వీనర్ జిల్లా శివ, పుట్టపాక రాము, సంజయ్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రమాదాలకు నెలవుగా మారిన


# పర్వేద మలుపు

### ఆర్ అండ్ బి అధికారుల వల్ల ప్రమాదాలు

### రోడ్డుపైన కంకర ఊడుస్తున్న పర్వేద గ్రామ వార్డు మెంబర్

**శంకర్‌పల్లి జనవరి 29 (వెలుతురు):**
పర్వేద గ్రామం ఊరు చివరన మూలమలుపు ఉండటం వలన తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. మూలమలుపు వద్ద కంకర టిప్పర్ మలుపు తిరుగుతుండడంతో అక్కడ లారీలో నుండి కంకర పడడంతో రెండు రోజులుగా ప్రమాదాలు జరుగుతున్నాయి. అది





చూసిన పర్వేద వార్డు మెంబర్ రవిందర్ చూడలేక ప్రభుత్వంకి ఎన్నోసార్లు మొరపెట్టుకున్నాడు. రోడ్డు బాగు చేయమని ఎన్ని సార్లు చెప్పినా రోడ్ల భవనాల శాఖ ఆర్ అండ్ బి అధికారులు ఎమ్మెల్యేలు ఎంపీలు ఎవరు పట్టించుకోకపోవడం వలన తానే స్వయంగా రోడ్లు ఊడ్చాడు ఇలాంటి పరిస్థితి ఎవరికి రాకూడదని అతను ప్రభుత్వాన్ని ప్రశ్నించాడు.

## ఆశ వర్కర్‌లకు కనీస వేతనం

# రూ.26,000 ఇవ్వాలి

### - సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి ఐలాపురం రాజశేఖర్

**కూకట్‌పల్లి, వెలుతురు:** ఆశా వర్కర్లకు కనీస వేతనం 26వేలు చెల్లించాలని సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి ఐలాపురం రాజశేఖర్ బాలానగర్ పి హెచ్ సి మెడికల్ అధికారులు డాక్టర్ చందర్,డాక్టర్ మమత లకు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఐటీయూ నాయకులు ఫిబ్రవరి 16న జరిగే దేశ వ్యాప్త సెక్టోరియాల్ సమ్మెను డిమాండ్ లను పరిష్కరించాలని కోరారు. ఆశ వర్కర్స్‌లకు కనీస వేతనాలు రూ26వేల



తోపాటు ఎన్ హెచ్ ఎం కు బడ్జెట్ పెంచాలని, 45వ ఐల్ సి సిఫారసుల ప్రకారం ఆశలను కార్మికుల గా గుర్తించాలని కేంద్ర బీజేపీ ప్రభుత్వం నీ డిమాండ్ చేశారు. ప్రతి నెల పెంక్షన్ రూ.10,000 చెల్లించాలి ఇఎస్ఐ ,ఉద్యోగ భద్రత కల్పించాలని కార్మికుల కు నష్టం చేసే 4లేబర్ కోర్డ్ లను రద్దు చెయ్యాలని అదే విధంగా విద్యుత్ సవరణ బిల్లు 2022 ను రద్దు చెయ్యాలని కేంద్ర ప్రభుత్వం నీ హెచ్చరించారు. రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వ ఇచ్చిన హామీలను అమలు చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆశ వర్కర్స్ భాషమ్మ, అనిత, వినోద, పుష్ప, మౌనిక తదితరులు పాల్గొన్నారు.

# సర్పంచుల పనితీరు భేష్!

### గ్రామాల అభివృద్ధిలో వారి కృషి అమోఘం

### చాలా మంది సర్పంచులు అప్పులు చేసి అభివృద్ధి చేశారు

### చేసిన పనులకు ఎంబీలు చేసే బాధ్యత అధికారులదే

### బిల్లుల చెల్లింపుపై ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్ళాం

### జిల్లా పరిషత్ చైర్ పర్సన్ పట్నం సునీతారెడ్డి



**వికారాబాద్ జిల్లా ప్రతినిధి వెలుతురు న్యూస్):**
జిల్లాలో ఐదేళ్ల పదవీ కాలంలో గ్రామాల అభివృద్ధికి సర్పంచులు చేసిన కృషి మరువ లేనిదని జడ్పీ చైర్ పర్సన్ పట్నం సునీతారెడ్డి అన్నారు. వారి పనితీరు చాలా బేషుగ్గా ఉందని కొనియాడారు. జిల్లాలో చాలా మంది సర్పంచులు తమ గ్రామాల అభివృద్ధి కోసం సొంత భూములు అమ్ముకున్నారని, మరి కొందరు అప్పులు చేసి పనులు చేశారని అన్నారు. రేపటితో సర్పంచుల పదవీకాలం ముగుస్తునందున బాగా కష్టపడి పనిచేసిన సర్పంచులను సోమవారం పత్రికా ప్రకటనలో కృతజ్ఞతలు తెలిపారు. అలాంటి సర్పంచులకు సంబంధిత ఇంజినీర్లు, పంచాయతీ అధికారులు ఎంబీ రికార్డులు చేసి ఇవ్వాలని అధికారులకు సూచించారు. వీరికి పెండింగ్ బిల్లుల చెల్లింపుపై ఇప్పటికే ప్రభుత్వం దృష్టికి తీసికెళ్లినట్లు గుర్తుచేశారు. ఎంతో మంది కష్టపడి గ్రామాలను ఉన్నతంగా తీర్చిదిద్దారని, కొన్ని గ్రామాల సర్పంచులు అప్పటి ఎమ్మెల్యేల అండతో అక్రమాలకు పాల్పడినట్లు మండిపడ్డారు. ప్రజా మద్దతు లేని అలాంటి వారికి ఎవ్వరి మద్ధతు ఉండదని తేల్చిచెప్పారు. బషీరాబాద్ మండలం బాద్లాపూర్ సర్పంచ్ నీలిభాయి అభివృద్ధి చేసి అప్పుల పాలైతే అడ్డమీద కూలీ పనిచేయడం తనను ఎంతగానో బాధించిందని అన్నారు. ఇలాంటి సర్పంచ్ లు జిల్లాలో ఎంతో మంది ఉన్నారన్నారు. ఇలా చాలా మంది సర్పంచులు కూలీ పనులు, వ్యవసాయ పనులు చేశారన్నారు. అధికారులు పదవీ విరమణ చేసిన తర్వాత ఎలాగైతే సన్మానం చేస్తామో అలాగే గ్రామాల అభివృద్ధి కోసం కష్టపడి పనిచేసిన సర్పంచులను కూడా పదవీ నుంచి దిగిపోయే ముందు ఆయా గ్రామాల ప్రజలు ఘనంగా పౌర సన్మానాలు చేయాలని పిలుపునిచ్చారు. ఐదేళ్ల పాటు చిత్తశుద్ధితో పనిచేసిన సర్పంచుల సేవలను ప్రజలు కూడా ఎప్పటికి గుర్తించేకోవాలని కోరారు.



# నేడు పెద్ద శంకరంపేటకు కామారెడ్డి బిజెపి ఎమ్మెల్యే రాక

**వెలుతురు నారాయణఖేడ్ జనవరి 29 :**
మెదక్ జిల్లా నారాయణఖేడ్ నియోజకవర్గం పెద్ద శంకరంపేట్.. నేడు శంకరంపేటలోని భారతీయ జనతా పార్టీ కార్యాలయంలో నిర్వహించే మండల స్థాయి కార్యకర్తల సమావేశానికి ముఖ్యఅతిథిగా జహీరాబాద్ పార్లమెంట్ ఎలక్షన్ ఇంచార్జ్ కామారెడ్డి బిజెపి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి హాజరు కానున్నట్లు పెద్దశంకరపేట మండల బిజెపి అధ్యక్షుడు కోణం విఠల్ సోమవారం తెలిపారు.. జహీరాబాద్ పార్లమెంటు ప్రబారి బద్దం మహిపాల్ రెడ్డి.. మెదక్ సంగారెడ్డి జిల్లాల బిజెపి అధ్యక్షులు గడ్డం శ్రీనివాస్ గోదావరి అంజిరెడ్డి తదితరులు హాజరుకానున్నారు.. మండల స్థాయి బిజెపి నాయకులు కార్యకర్తలు.. అధిక సంఖ్యలో తరలివచ్చి ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.. ఈ కార్యక్రమంలో మండల ఓబీసీ సెల్ అధ్యక్షుడు మండల శ్రావణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



## మూసాపేట కార్పొరేటర్ కుటుంబాన్ని పరామర్శించిన మాధవరం కాంతారావు..

**కూకట్‌పల్లి వెలుతురు:** కూకట్‌పల్లి అసెంబ్లీ పరిధిలోని మూసాపేట్ డివిజన్ బిజెపి కార్పొరేటర్ కొడిచెర్ల మహేందర్ తండ్రి సాయిలు ఆదివారం అనారోగ్యంతో పరమదించారు. విషయం తెలుసుకున్న కూకట్ పల్లి అసెంబ్లీ బిజెపి ఇంచార్జి మాధవరం కాంతారావు సాయిలు పార్థివ దేహానికి నివాళులు అర్పించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. అనంతరం కార్పొరేటర్ మహేందర్ మరియు వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ కూకట్ పల్లి అసెంబ్లీ కన్వీనర్ శ్రీకర్ రావు, బాలాజీ నగర్ డివిజన్ బిజెపి అధ్యక్షులు వినోద్ కుమార్ గౌడ్, బిజెపి నాయకులు రవి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## శంకర్‌పల్లి మండల కాంగ్రెస్ పార్టి జనరల్ సెక్రెటరీగా దమ్మన్నగారి ప్రత్యూష ఏకగ్రీవ ఎన్నిక

**శంకర్‌పల్లి, జనవరి 29 (వెలుతురు):** శంకర్పల్లి మండల కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షురాలు పామేనా జ్యోతి భీమ్ భరత్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ జనరల్ సెక్రటరీగా ఆలంఖాన్ గూడ గ్రామానికి చెందిన దమ్మన్నగారి ప్రత్యూష సాయి రెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకోవడం



జరిగింది. ఈ సందర్భంగా ప్రత్యూష మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అర్హులకు అందేలా చేస్తానని, వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపుకు కృషి చేస్తానని, తనపై నమ్మకం ఉంచి నాకు ఈ బాధ్యత అప్పగించినందుకు పార్టీ అధిష్టానానికి, భూమి భరత్ , జ్యోతి భూమి భరత్‌కు కృతజ్ఞతలు. జనరల్ సెక్రెటరీగా ఎన్నుకున్నందుకు రంగారెడ్డి జిల్లా మహిళా ఉపాధ్యక్షురాలు పామేనా జ్యోతి బీమ్ భరత్‌ను ఘనంగా సన్మానించారు.

ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

### నిజాం షుగర్ ఫ్యాక్టరీ పునః ప్రారంభంపై
## సిఫార్సుల కమిటీ ఏర్పాటు

**కమిటీలో సభ్యుడిగా మాజీ మంత్రివర్యులు డాక్టర్ ఏ చంద్రశేఖర్ నియామకం**

**హర్షం వ్యక్తం చేసిన జహిరాబాద్ చెరుకు రైతులు**

**జహీరాబాద్, 29 జనవరి, వెలుతురు:**
నిజాం చక్కెర ఫ్యాక్టరీ పునః ప్రారంభంపై సిఫారసులు చేసేందుకు ప్రభుత్వం కమిటీ ఏర్పాటు చేసింది. ఇందుకుగాను నిజాం షుగర్ ఫ్యాక్టరీ పునః ప్రారంభించేందుకు అవసరమైన సిఫార్సులు చేసేందుకు రాష్ట్ర పరిశ్రమల శాఖా మంత్రి శ్రీధర్ బాబు చైర్మన్ గా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన కమిటీ లో సభ్యుడిగా మాజీ మంత్రివర్యులు డాక్టర్ ఏ చంద్రశేఖర్ ను నియమిస్తూ రాష్ట్ర పరిశ్రమల శాఖ ఉత్తర్వులు జారీ చేసింది.



నిజాం షుగర్ ఫ్యాక్టరీ పునః ప్రారంభించేందుకు అవసరమైన సిఫార్సులు చేసేందుకు ఏర్పాటు చేసిన కమిటీ లో మాజీ మంత్రివర్యులు డాక్టర్ ఏ చంద్రశేఖర్ ను నియమించడంపై జహిరాబాద్ చెరుకు రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

### నిజాం షుగర్ ఫ్యాక్టరీ పునః ప్రారంభంపై
## సిఫార్సుల కమిటీ ఏర్పాటు

**హర్షం వ్యక్తం చేసిన బీజేపీ మహిళా మోర్చ అసెంబ్లీ కన్వీనర్ జ్యోతి పండాల్**

**జహీరాబాద్, 29 జనవరి, వెలుతురు :** నిజాం షుగర్ ఫ్యాక్టరీ పునః ప్రారంభంపై సిఫార్సుల కమిటీ ఏర్పాటుపై హర్షం వ్యక్తం చేసిన బీజేపీ మహిళా మోర్చ అసెంబ్లీ కన్వీనర్ జ్యోతి పండాల్. బీ ఆర్ ఎస్ ప్రభుత్వం చేసిన తప్పులను సరిచేస్తూ మళ్ళీ ఫ్యాక్టరీని వెంటనే నడిచేలా చూడాలని జ్యోతి పండాల్ ప్రభుత్వాన్ని కోరారు. కానీ ఫ్యాక్టరీ సమస్యలని రివ్యూ చేసి ప్రభుత్వానికి రిపోర్ట్ సబ్మిట్ చేయడానికి రెండు నెలల వ్యవధి తీసుకోకుండా ఎంత తొందరగా వీలైతే అంత తొందరగా రివ్యూ ప్రాసెస్ ని పూర్తి చేయాలని జ్యోతి పండాల్ కోరారు. అలాగే ఈ షుగర్ కేన్ ఫ్యాక్టరీని మును ముందు ఏ ప్రభుత్వం కూడా మళ్ళీ ఇలాంటి సమస్యలు చేయకుండా చాలా కట్టు దిట్ట మైన పాలసీలు, లీగల్‌గా చట్టపరమైన రూల్స్ నీ కూడా కంపెనీకి సంబంధించిన లీగల్ ప్రాసెస్ లో పొందు పర్చాలని జ్యోతి పండాల్ ప్రభుత్వాన్ని కోరారు.




# ఆగని బాగ్ అమీర్ స్మశాన వాటిక కబ్జా..
# అక్రమ భవనం నిర్మాణం..

**నిఖిలేశ్వర బిల్డర్స్ స్మశాన వాటిక కబ్జాపై విచారణ జరిపించాలి :**

**ప్రజావాణిలో జోనల్ కమిషనర్‌కి ఫిర్యాదు చేసిన నియోజకవర్గం కాంగ్రెస్ నాయకులు ఏకాంత్ గౌడ్..**

**శేర్లింగంపల్లి వెలుతురు:** శేరిలింగంపల్లి నియోజకవర్గం పరిధిలోని వివేకానంద నగర్ డివిజన్ బాగ్ అమీర్ స్మశాన వాటికను నిఖిళేశ్వర బిల్డర్స్ వారు కబ్జా చేసి అక్రమ నిర్మాణం చేపట్టడంతో నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు ఉప్పల ఏకాంత్ గౌడ్ సోమవారం ప్రజావాణి లో కూకట్ పల్లి జోనల్ కమిషనర్ కి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఏకాంత్ గౌడ్ బాగ్ అమీర్ హిందూ స్మశాన వాటిక కబ్జాపై తాము హైకోర్టును ఆశ్రయించగా స్థానిక కూకట్ పల్లి తహసీల్దార్ విచారణ జరిపి బి.మణెమ్మ ఎస్ రాజు నగర్ లేవుట్‌లో ఉన్న దానికంటే కూడా బాగ్ అమీర్ స్మశాన వాటిక బాగ్ అమీర్ గ్రామ సర్వే 70 లోని 201 గజాల స్థలాన్ని కబ్జా చేసారని తహసీల్దార్ గత సంవత్సరం మే 18న లేఖ ద్వారా నిర్ధారించినట్లు తెలిపారు. తహసీల్దార్ ఇచ్చిన లేఖపై నిఖిళేశ్వర బిల్డర్స్ WP no:-13908/2023 ద్వారా కోర్టును ఆశ్రయించగా హై కోర్టు స్టేటస్ కో ఇవ్వగ నిఖిళేశ్వర బిల్డర్స్ వారు ఆర్డర్ వైలేట్ చేసి ( 2కోట్ల విలువ జేసే స్థలం)లో అక్రమ నిర్మాణం చేశారని ఫిర్యాదులో పేర్కొన్నట్లు తెలిపారు. ఈ పిర్యాదుపై జోనల్ కమీషనర్ స్పందిస్తూ స్థానిక కూకట్‌పల్లి తహసీల్దార్‌తో విచారించి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారని ఆయన పేర్కొన్నారు.










### చెరకు పంటపై రైతులకు అవగహన కల్పించిన
## గోదావరి గంగా ఆగ్రో ప్రొడక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ సిబ్బంది

**రైతులు ఆధునిక పద్దతులు పాటిస్తూ ఎక్కువ దిగుబడి సాధించాలి**

**ఎకరానికి కనీసం 50 నుండి 80 టన్నుల వరకు చెరకు పండించాలి**

**వచ్చే సీజన్‌కు గాను 2500 మెట్రిక్ టన్నుల చెరకు కు గానుగాడిస్తాం**

**ప్రధాన శాస్త్రవేత్త విజయ్ కుమార్ వెల్లడి**

**జహీరాబాద్, 29 జనవరి, వెలుతురు :**
సంగారెడ్డి జిల్లా రాయికోడ్ మండలం మాటూర్ గ్రామ శివారులో కొత్తగా ఎర్పాటు చేస్తున్న గోదావరి గంగా ఆగ్రోప్రోడక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ (చక్కర పరిశ్రమ) అద్వర్యంలో న్యాల్కల్ మండలం గుంజోట్టి గ్రామంలో రైతులతో సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది.
ఈ సమావేశంలో ప్రధాన శాస్త్రవేత్త విజయ్ కుమార్ మాట్లాడుతూ చెరకు పంటపై అవగహన కల్పించారు. రైతులు ఆధునిక పద్దతులు పాటిస్తూ ఎక్కువ దిగుబడి సాధించాలని, ఎకరానికి కనీసం 50 నుండి 80 టన్నుల వరకు చెరకు పండించాలని తెలిపారు. ఈ సమావేశంలో రైతులు అడిగిన పలు ప్రశ్నలకు వారు సమాధానాలు ఇచ్చారు. అనంతరం
కెన్ మేనేజర్ సిహెచ్ రవీందర్ రెడ్డి మాట్లాడుతూ వచ్చే సీజన్ కు గాను 2500 మెట్రిక్ టన్నుల చెరకు కు గానుగాడిస్తామన్నారు. రైతులకు ఫ్యాక్టరీ నుండి రవాణ మరియు హార్వెస్టింగ్ సమకూరుస్తామన్నారు. ఇందులో 70% మెకానికల్ హార్వెస్టింగ్ మరియు 30% లేబర్ తో కటింగ్ చేయిస్తామన్నారు. ప్లాంటేషన్ వేసిన ప్రతి రైతుకు రూ.7000/- ( ఎడు వేల రూపాయలు) రుణ రూపేన మరియు రైతులకు అవసరమైన వివిధ రకాల నర్సరీ మొక్కలను సరఫరా చేస్తామన్నారు. సోలర్ కిట్ తీసుకున్న రైతులకు రుణ రూపేన రూ 5000/- ( ఐదు వేల రూపాయలు) ఇస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధాన శాస్త్రవెత్త విజయ్ కుమార్, కెన్ మెనెజర్ రవిందర్ రెడ్డి, ఫీల్డ్ ఆఫీసర్ విష్ణువర్ధన్ రెడ్డి,
ఫీల్డ్ మెన్ అరుణ్ కుమార్, గ్రామ సర్పంచ్ చంద్రప్ప, శేఖర్, వీరన్న మరిము గ్రామ రైతులు పాల్గొన్నారు.






### జహీరాబాద్ బీసీ హాస్టల్ విద్యార్థులకు
# చట్టాలపై అవగాహన సదస్సు

**ప్రతీ విద్యార్థి చదువుతోపాటు సాధారణ చట్టాలపై అవగాహన కలిగి ఉండడం ఎంతైనా అవసరం**

**విద్యార్థులందరూ చక్కగా చదువుకొని, ఉన్నత శిఖరాలను అధిరోహించాలి**

**సీనియర్ సివిల్ జడ్జి, మండల లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్మన్ శ్రీ సూరి కృష్ణ**

**జహీరాబాద్, 29 జనవరి, వెలుతురు :**
సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ మండల లీగల్ సర్వీసెస్ కమిటీ వారి ఆధ్వర్యంలో స్థానిక బీసీ హాస్టల్ విద్యార్థులకు చట్టాలపై అవగాహన సదస్సును సీనియర్ సివిల్ జడ్జి, మండల లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్మన్ శ్రీ సూరి కృష్ణ నిర్వహించి విద్యార్థులకు పలు చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో న్యాయమూర్తి మాట్లాడుతూ ప్రతీ విద్యార్థి చదువుతోపాటు సాధారణ చట్టాలపై అవగాహన కలిగి ఉండడం ఎంతయినా అవసరమని అన్నారు. విద్యార్థులు నిత్యజీవితంలో చిన్న చిన్న సమస్యలు ఎదురుకాకుండా ఉండడానికి, ఒకవేళ సమస్యలువస్తే వాటిని అధిగమించడానికి చట్టాలు తొడ్పాడుతాయని సూచించారు.

కార్యక్రమంలో పోక్సో చట్టం, సమాచార హక్కు చట్టం, మోటారు వాహనాల చట్టం, బాలకార్మిక నిర్మూలన చట్టం, బాల్య వివాహ నిరోధక చట్టం, జువైనెల్ జస్టిస్ యాక్ట్, ఉచిత న్యాయసేవా సహాయంపై విద్యార్థులకు తెలియజేసారు. విద్యార్థులందరూ చక్కగా చదువుకొని, ఉన్నత శిఖరాలను అధిరోహించి, చట్టాలను గౌరవిస్తూ, అవసరమైతే తోటివారికి తెలియజేప్పుతూ సమాజానికి ఆదర్శవంతంగా ఉండాలని సూచించారు.

మీ చుట్టు బాల్య వివాహ బాధితులు, బాల కార్మికులు ఎక్కడైనా ఉన్నట్లు గుర్తిస్తే స్థానిక తహసీల్దార్ లేదా స్థానిక పోలీస్ అధికారికి లేదా మండల లీగల్ సర్వీసెస్ కార్యాలయంలో గాని లేదా 1098 కి ఫోన్ ద్వారా తెలుపవచ్చని సూచించారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయని తెలియజేసారు. ఏ సమాచారం గురించి తెలుసుకోవాలనుకున్న మండల లీగల్ సర్వీసెస్ కమిటీ కార్యాలయంను సంప్రదించవచ్చని తెలిపారు. కార్యక్రమంలో బార్ సెక్రటరీ సంతోష్ కుమార్ సాగర్, న్యాయవాదులు బ్రహ్మానంద రెడ్డి, ఇబ్రహీం, మహేష్, శేఖర్, జగన్, మహేందర్, లీగల్ సర్వీసెస్ సిబ్బంది, పారాలీగల్ వాలంటీర్లు, హాస్టల్ ఇంచార్జి వంశీకృష్ణ మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

## ఉజ్వల్ రెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో మండల లెవల్ టెన్నిస్ క్రికెట్ పోటీలు

**యువకుల్లోని నైపుణ్యం వెతికి తీయడానికే క్రికెట్ పోటీలు**

**గ్రామ స్థాయిలో ఆటలకు తమ ప్రోత్సాహం ఎల్లవేళలా ఉంటుంది**

**జహీరాబాద్ పార్లమెంట్ ఇంచార్జ్ డాక్టర్ ఉజ్వల్ రెడ్డి**

**జహీరాబాద్, 29 జనవరి, వెలుతురు :**
సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ నియోజకవర్గం మొగుడంపల్లి మండల కేంద్రంలో ఉజ్వల్ రెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో మండల లెవల్‌లో నిర్వహిస్తున్న డాక్టర్ ఉజ్వల్ రెడ్డి టెన్నిస్



క్రికెట్ పోటీలను జహీరాబాద్ పార్లమెంట్ ఇంచార్జ్ డాక్టర్ ఉజ్వల్ రెడ్డి సోమవారం రిబ్బన్ కట్ చేసి క్రికెట్ టోర్నమెంట్ పోటీలను ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ యువకుల్లో నైపుణ్యం వెతికి తీయడానికే ఈ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గ్రామ స్థాయిలో ఆటలకు తమ ప్రోత్సాహం ఎల్లవేళలా ఉంటుందని డా: ఉజ్వల్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు మక్సూద్, యంపిపి ప్రియాంక గుండా రెడ్డి, మాజీ సర్పంచ్ గోపాల్, హర్షవర్ధన్ రెడ్డి, అదేవిధంగా పార్టీ ఆయా మండల అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు, యువజన, విద్యార్థి నాయకులు, ఉజ్వల్ అన్న యువసేన తదితర నాయకులు పాల్గొన్నారు.




## సంగారెడ్డి వర్కింగ్ జర్నలిస్ట్ అసోసియేషన్ డైరీని ఆవిష్కరించిన డిఎస్పీ రఘు, సీఐ రవి

**జహీరాబాద్, 29 జనవరి, వెలుతురు :**
సంగారెడ్డి వర్కింగ్ జర్నలిస్ట్ అసోసియేషన్ రూపొందించిన నూతన సంవత్సరం 2024 డైరీని సోమవారం రోజున జహీరాబాద్ ఉపమండలి పోలీస్ అధికారి కార్యాలయంలో సంగారెడ్డి వర్కింగ్ జర్నలిస్ట్ అసోసియేషన్ సహాయ కార్యదర్శి ఏం డి ముజాహెద్‌లతో కలిసి జహీరాబాద్ డిప్యూటీ సూపరింటెండెంట్ అఫ్ పోలీస్ అధికారి వి.రఘు, జహీరాబాద్ టౌన్ సి.ఐ.ఆర్.రవి ఆవిష్కరించారు. తదనంతరం వారు సంగారెడ్డి వర్కింగ్ జర్నలిస్ట్ అసోసియేషన్ సభ్యులందరికి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మంచి వార్తలు సేకరిస్తూ ప్రజలకు ప్రభుత్వాలకు జవాబుదారీతనంగా మీడియా వ్యవహరించాలని ఆయన అన్నారు. మీడియా అనేది ప్రశ్నించే విధంగా, ప్రజల సమస్యలు పరిష్కరించే విధంగా జర్నలిస్టు పని చేయాలని సూచించారు.

### నాలుగేళ్లయినా తాగునీటి సమస్యను
## పరిష్కరించరా..?

**ఒకటో డివిజన్ కార్పొరేటర్ కోలగని శ్రీనివాస్...**

**కరీంనగర్, వెలుతురు జనవరి 29:**
నగర సంస్థలో ఒకటో డివిజన్ తీగల గుట్టపల్లి లో తాగునీటి సమస్యను పరిష్కరించకపోవడం విచారకరమని, తీగల గుట్టపల్లి కరీంనగర్ కార్పొరేషన్ లో విలీనమై నాలుగు సంవత్సరాలైనా నేటికీ డివిజన్ ప్రజలకు తాగునీరు అందించకపోవడం భావ్యం కాదని ఒకటో డివిజన్ బిజెపి కార్పొరేటర్ కోలగని శ్రీనివాస్ అన్నారు. మంగళవారం కరీంనగర్ నగరపాలక సంస్థ సర్వసభ్య



సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సమావేశంలో ఒకటో డివిజన్లోని సరస్వతి నగర్ త్రాగునీటి సమస్య గురించి ప్రధానంగా ప్రశ్నించారు.

గత నాలుగు సంవత్సరాలుగా సొంత డబ్బులతో ట్యాంకర్ల ద్వారా ప్రతి వేసవికాలంలో ప్రజలకు మంచినీటిని అందించడం జరుగుతుందిని శ్రీనివాస్ ఈ సందర్భంగా అన్నారు. డివిజన్లో ఇంతవరకు పైప్ లైన్ పనులు ఇంకా పూర్తి చేయలేదని, పైప్ లైన్ పూర్తిచేసిన వీధులలో కనీసం తాగునీరును అందించడం లేదన్నారు. గతంలో 24 గంటలు మంచినీటిని ఇస్తామని చెప్పిన నేటి కి ఆ హామీని నిలబెట్టుకోలేకపోయారని ఆయన విమర్శించారు. తీగలగుట్టపల్లి ఒకటో డివిజన్లో ఒక గంట కూడా తాగునీటిని ఇచ్చే పరిస్థితిలో నగరపాలక సంస్థ ఉందని, కనీసం ఇప్పటికైనా పైపులైను డివిజన్లో పూర్తి చేసి ఈ వేసవి కాలం లోపు మంచినీటిని ప్రజలకు అందించాలని నగర మేయర్ గ కమిషనర్ గారిని సర్వసభ్య సమావేశంలో కార్పొరేటర్ కొలగని శ్రీనివాస్ కోరారు.

### ఇంద్రేశం గ్రామంలో వైభవంగా నిర్వహించిన
## శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి జాతర

**మల్లన్న స్వామి దీవెనలు ప్రజలపై ఉండాలి : కాట సుధా శ్రీనివాస్ గౌడ్**

**పటాన్ చెరు వెలుతురు జనవరి 29:**
పటాన్ చెరు మండలం ఇంద్రేశం గ్రామంలో వైభవంగా నిర్వహించిన శ్రీ భ్రమరాంబ మల్లికార్జున



స్వామి జాతరలో పాల్గొని స్వామి వారిని దర్శించుకున్న సంగారెడ్డి జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు, అమీన్ పూర్ 15వ వార్డ్ కౌన్సిలర్ కాట సుధా శ్రీనివాస్ గౌడ్ గారు

## అభివృద్ధికి నిధుల కోసమే కలిశా: ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్

**హైదరాబాద్,జనవరి 29 వెలుతురు :** నియోజకవర్గ అభివృద్ధి కోసమే సీఎంని కలిశానని చెప్పారు ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్. రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్ నియోజకవర్గం పరిధిలోని బహదూర్ గూడ, కొత్వాల్‌గూడ, ఘాస్మియగూడ గ్రామలలో రైతులకు పట్టా పాసు పుస్తకాల సమస్యలు ఉన్నాయని.. వాటితోపాటు నియోజకవర్గ అభివృద్ధి కోసం నిధులు కేటాయించాలని మర్యాదపూర్వకంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలవడం జరిగిందని ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ స్పష్టం చేశారు. దీంట్లో ఎలాంటి రాజకీయ ఉద్దేశం లేదని.. సీఎం రేవంత్ రెడ్డి కూడా సానుకూలంగా స్పందించి అతి త్వరలో సమస్యల పరిష్కారం చేద్దామని అన్నారని తెలిపారు. పార్టీ మారే ఉద్దేశం తనకు లేదని ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ అన్నారు.






### నవాబుపేట్ వివిధ గ్రామాలకు చెందిన
## కరాటే స్టేట్ లెవెల్ 3లో విద్యార్థుల ప్రతిభ..

**మాస్టర్ మహేష్ ఆధ్వర్యంలో నవాబుపెట్ మండలం విద్యార్థుల ప్రతిభ..!!**

**వికారాబాద్ జిల్లా ప్రతినిధి (వెలుతురు న్యూస్):**
వికారాబాద్ జిల్లా నవాబ్ పేట్ మండలం వివిధ గ్రామాలకు చెందిన విద్యార్థులు ప్రతిభ చాటారు. ఈమేరకు కరాటే మాస్టర్ మహేష్ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయిలో జరిగిన సక్సెస్ షోటకాన్ కరాటే పోటీల్లో ఆది చరణ్ (కటా గోల్డ్ కుమిటి బ్రౌంజ్ ) విష్ణు తేజ (కటా సిల్వర్ కుమిటి బ్రౌంజ్ ) సాయి రామ్ ( కటా సిల్వర్ కుమిటి బ్రౌంజ్ ) సిదీక్ష (కుమిటి బ్రౌంజ్ ) సంధ్య (కటా బ్రౌంజ్ ) మనీష్ గౌడ్ (కటా బ్రౌంజ్ ) మనీష్ కుమార్ (కటా సిల్వర్ ) శివ శంకర్ (కటా బ్రౌంజ్ ) శివ సాయి (కటా బ్రౌంజ్ ) శ్రవణ్ కుమార్ ( కుమిటి బ్రౌంజ్ ) మేడల్స్ సాధించడం జరిగింది. వీరే కాకుండా ఈ పోటీలో పాల్గొన్న ప్రతి ఒక్క విద్యార్థి పథకాలు సాధించాడం జరిగిందని అన్నారు. ఈ సందర్భంగా మాస్టర్ మహేష్ మాట్లాడుతూ గత సంవత్సరం నవంబర్ 19న నవాబ్ పేట్ విద్యార్థి దయాకర్ బ్లాక్ బెల్ట్ సాదించడం జరిగిందని చెప్పారు. అదే విధంగా ఈ సంవత్సరం నవంబర్ నెల వరకు నవాబ్ పేట్ లో 5 మంది బ్లాక్ బెల్టట్స్ విద్యార్థులని తయారు చేస్తానని మాస్టర్ మహేష్ ధీమా వ్యక్తం చేశారు. విద్యార్థులు సాధించిన మోడల్స్ వలన ఈ సంవత్సరం జులైలో వికారాబాద్ జిల్లా నవాబుపేట్ మండలంలో రాష్ట్ర స్థాయి పోటీలను నిర్వహించే అవకాశం దక్కిందని సంతోషం వ్యక్తం చేశారు.

## రసమయి ఖాబర్దార్...
## నీ ఫార్మహౌస్‌ను నాగల్లు పెట్టి దున్నుతాం...

**- నీ వల్ల బాగుపడ్డ ఒక్క కళాకారుడైనా ఉన్నాడా... కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు ముస్కు ఉపేందర్ రెడ్డి.**

**దొంగలందరు నీ చుట్టే ఉన్నరు... ఎస్‌సి సెల్ మండల అధ్యక్షులు మాతంగి అనిల్**

**- పదేళ్ళు గడిచినా ప్రభుత్వ కార్యాలయాలు కట్టలేదు... మైలారం సర్పంచ్ దుడ్డు రేణుక మల్లేశం.**

**- గన్నేరువరంలో మీడియా సమావేశంలో రసమయిపై విరుచుకుపడిన కాంగ్రెస్ నాయకులు**



**గన్నేరువరం, వెలుతురు జనవరి 29:**
కరీంనగర్ జిల్లా గన్నేరువరం మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ముస్కు ఉపేందర్ రెడ్డి అధ్యక్షతన ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఉపేందర్ రెడ్డి మాట్లాడుతూ మానకొండూర్ నియోజకవర్గ మాజీ శాసనసభ్యులు రసమయి బాలకిషన్ పై నిప్పులు చేరిగారు. ఆయన వల్ల ఏ ఒక్క కళాకారుల కుటుంబం బాగుపడ్డది లేదు అన్నారు. ని అవినీతి, అక్రమాలకు, భరించలేక ఆత్మహత్యలు సైతం చేసుకున్న ఘటనలు ఎన్నో ఉన్నాయి.

నువ్ చాటుగా సీనియర్ కళాకారుడు మిట్టపల్లి సురేందర్ కాళ్ళు పట్టుకున్నది ప్రజలకు తెలియదనుకున్నవా మా ఎమ్మెల్యే కవ్వంపెల్లి సత్యనారాయణపై నువ్ చేసిన అనుచిత వ్యాఖ్యలు వెనక్కి తీసుకోవాలని లేదంటే మరోసారి మండలంలో తిరగ నివ్వమని ఘాటుగా హేచ్చరించారు.

**ఎస్సి సెల్ మండల అధ్యక్షులు మాతంగి అనిల్ మాట్లాడుతూ..**

రసమయి ఒళ్ళు దగ్గర పెట్టుకోని ఫామ్ హౌసులో నాగల్లు పెట్టి దున్నుతామని, టిఆర్ఎస్ లో అప్పుడు కుక్క ను పెట్టిన గెలిచే పరిస్థితి ఉండేది ని గెలుపు ను ని సొంత గెలుపు లా భావించి అహంకారంతో, ని నోటికి ఎంత వస్తే అంతే మాట్లాడితే ఊరుకునేది లేదని, దొంగలంతా ని వద్దే ఉన్నారని, మా ఎమ్మెల్యే కు ఒకే భార్య ఉంది కాబట్టి ప్రచారం లో కి తీస్కోచ్చారని, నికు ఎంత మంది భార్యలు ఉన్నారో నీకె తెల్వది కదా అందుకే నువ్ ప్రచారానికి తీసుకురాలేక పోయవని, ఎందుకంటే ఒకరిని తీసుకొస్తే మరొకరికి కోపమని అందుకే నీవు ప్రచారంలో ని భార్య లను తీసుకురాలేక పోయవని, ఇంకోసారి మా ఎమ్మెల్యే పై ఇష్టం వచ్చినట్లు మాట్లాడితే బట్టలు విప్పించి ఊరికించి మరి కొడతామని ఘాటుగా విమర్శించారు.

**మైలారం సర్పంచ్ దుడ్డు రేణుక మల్లేశం మాట్లాడుతూ..**

మా గ్రామంలో నేను ఎలాంటి అభివృద్ధి చేయలేదని నా పై దుష్ప్రచారం చేస్తున్నావ్, నేను చేసిన అభివృద్ధి పై చర్చకు సిద్ధమా?, అసలు అభివృద్ధి జరిగింది గత కాంగ్రెస్ ప్రభుత్వం లో నె నని, మైలారం గ్రామ శివారులో మంచి నీటి కోసం లోయరు మానేరు డ్యామ్ లో గతం లో తవ్విన బావి ప్రతి సంవత్సరం నీటిలో మునుగుతూ ఆ నీరు కలుషితం అయి గ్రామ ప్రజలకు చర్మ వ్యాధులు వస్తున్నాయని, నా సొంత ఖర్చులతో కొండగట్టు నుండి పెద్ద మెషిన్లను తెప్పించి మరొక బావి తవ్వించానని, గ్రామం లో కోతుల బెడదా ఎక్కువ అవ్వడం వల్ల, నా సొంత ఖర్చులతో కొండేంగలను తీస్కోచ్చానని, రైతులకు సాగు నీరందక ఇబ్బందులు పడుతుంటే స్థానిక రైతుల సహాయంతో రాత్రింబవళ్లు కృషి చేశానన్నారు. రసమయి నువ్ చేసిన అభివృద్ధి ఏంటని, రెండు పర్యాయలు నిన్ను గెలిపిస్తే మండల ప్రజలకు మొండి చెయ్ చూపించావు, మండలకేంద్రానికి సరైన రహదారి లేదని, గుండ్లపల్లి నుండి కొండాపూర్ వరకు కాస్తో కుస్తో ఉన్న తారు రోడ్డు ను తవ్వించి ప్రయాణికుల పై దుమ్మెత్తి పోస్తున్నావు. మండల కేంద్రంలో ఒక్క ప్రభుత్వ కార్యాలయం కట్టకపోవడం చాలా దురదృష్టకరమని ఆయన విమర్శించారు. ఈ కార్యక్రమం లో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ముస్కు ఉపేందర్ రెడ్డి,బీసీ సెల్ అధ్యక్షులు మార్గం మల్లేశం, కిసాన్ సెల్ అధ్యక్షులు నల్ల చంద్రారెడ్డి, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు మాతంగి అనిల్, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ కొలుపుల రవి, సర్పంచ్ లు దుడ్డు రేణుక మల్లేశం, నరసింహారెడ్డి, కరుణాకర్ రెడ్డి, ఉప సర్పంచ్ సంపత్ రెడ్డి, సీనియర్ నాయకులు వొడ్నాల నర్సయ్య, మైసంపెల్లి తిరుపతి, చింతల శ్రీధర్ రెడ్డి, బద్దం శ్రీనివాస్ రెడ్డి, బుర్ర తిరుపతి గౌడ్, దుడ్డు నాగరాజు, నూకల ఓదెలు, మూస్కు తిరుపతి రెడ్డి, ముడికే అజయ్, కళ్లెం మల్లారెడ్డి, అంజి, పెంకర్ల ప్రశాంత్, రాపోల్ నవీన్, న్యాత నరేష్, న్యాత జీవన్, బుర్ర అంజయ్య, బుర్ర మల్లేశం గౌడ్, పాకాల పరశు రాములు, బుర్ర శ్రీకాంత్, విజేందర్, సతీష్ రెడ్డి, రవీందర్ రెడ్డి, సుధాకర్ రెడ్డి, బండి రాములు, జక్కనపెల్లి రాజకుమార్ తదితరులు పాల్గొన్నారు.





## ఎల్గోయి ఘటనపై కలెక్టర్‌కు ఎమ్మెల్యే మాణిక్ రావు ఫిర్యాదు

**ఎలాంటి నోటీసులు జారీ చేయకుండా ఇండ్లు కూల్చివేయడం అన్యాయం**

**స్థలాలకు సంబంధించిన సర్టిఫికెట్లు ఉన్న కూల్చివేయడం అన్యాయం**

**అధికారులపై చర్యలు తీసుకోని, బాధితులకు న్యాయం చేయాలి**



**జహీరాబాద్, 29 జనవరి, వెలుతురు :**
సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ నియోజకవర్గం ఝూరాసంఘం మండలం ఎల్గోయి గ్రామంలో ఇండ్లు, రేకుల షెడ్లను కూల్చి వేతకు గురైన బాధిత కుటుంబాలతో కలిసి స్థానిక ఎమ్మెల్యే కొనింటి మాణిక్ రావు శనివారం జిల్లా కలెక్టర్ వల్లూరి క్రాంతికు ఫిర్యాదు చేసి వినతిపత్రం సమర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ అధికారులు అత్యుత్సాహం ప్రదర్శించారని, అత్యుత్సాహం పనికిరాదని అన్నారు. గత ప్రభుత్వంలో మాజీ మంత్రి తన్నీరు హరీష్ రావు ఇల్లు లేనివారికి కులమతాలకు అతీతంగా ఇళ్ల స్థలాలను ఇచ్చిందని అన్నారు.

వారి వద్ద స్థలాలకు సంబంధించిన సర్టిఫికెట్లు ఉన్న కూల్చివేయడం అన్యాయమని, ఎలాంటి నోటీసులు జారీ చేయకుండా కూల్చి వేయడం అన్యాయమని అన్నారు.

ఈ కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే ఈ విధంగా చేయడం సరికాదన్నారు. బాధితులు ఎన్నో ఏళ్ల నుండి ఈ స్థలంలో పొజిషన్లో ఉండి ఇల్లు నిర్మించుకుంటే అధికారులు తొలగించడం సరైనది కాదన్నారు. అధికారులపై చర్యలు తీసుకోవాలని, బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే మాణిక్ రావుతో పాటు సీడీసి చైర్మన్ ఉమకాంత్ పాటిల్, మండల పార్టీ అధ్యక్షులు వెంకటేశం, గ్రామ సర్పంచ్ ఓం ప్రకాష్ పాటిల్ , ఉప సర్పంచ్ సునీత రమేష్, నర్సన్న, సంగమేశ్, అశోక్, లాలప్ప, గోపాల్, ఖయ్యుమ్, జోగు అంజప్ప, హఫీజ్, ఉప్పరి కృష్ణ మరియు గ్రామ మహిళలు పాల్గొన్నారు.



## పర్యావరణ పరిరక్షణపై దృష్టి సారించాలి

### ఎన్విరాన్మెంట్ కౌన్సిల్ క్యాలెండర్ ఆవిష్కరించిన ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరామ్

**హైదరాబాద్, జనవరి 29(వెలుతురు):** మానవాళికి జీవ నాడి పర్యావరణమే అని, ఆ పర్యావరణాన్ని కాపాడుకొనే బాధ్యత ప్రతి ఒక్కరిదీ అని తెలంగాణ జన సమితి అధ్యక్షులు, ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం అన్నారు. సోమవారం ఆయన " ఎన్విరాన్మెంట్ ప్రొటెక్షన్ డెవలప్మెంట్ కౌన్సిల్ " రూపొందించిన నూతన సంవత్సరం క్యాలెండర్ ఆవిష్కరించారు. ఏ వ్యవస్థ అయినా, ఏ తరం అయినా అభివృద్ధి జరగాలి అంటే ప్రకృతి కరుణ ఉండాల్సిందేనన్నారు. నాంపల్లి పార్టీ రాష్ట్ర కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో తెలంగాణ జన సమితి హైదరాబాద్ విభాగం అధ్యక్షులు నర్సయ్య, కౌన్సిల్ వ్యవస్థాపక అధ్యక్షులు రంగయ్య తదితరులు పాల్గొన్నారు.

### అమెరికాలో భారతీయ విద్యార్థి

## దారుణంగా హత్య

### ఆశ్రయం పొందిన వ్యక్తి అతడి తల, ముఖంపై సుత్తితో 50 సార్లు కొట్టి చంపినా వైనం

**న్యూఢిల్లీ జనవరి 29(వెలుతురు):** భారతీయ విద్యార్థి అమెరికా కల ఆవిరైంది. ఆశ్రయం పొందిన వ్యక్తి అతడి తల, ముఖంపై సుత్తితో 50 సార్లు కొట్టి దారుణంగా హత్య చేశాడు. పోలీసులు వచ్చే వరకు భారతీయ విద్యార్థి మృతదేహం వద్దనే ఉన్నాడు. అమెరికాలోని జార్జియాలో ఈ సంఘటన జరిగింది. భారత్‌కు చెందిన 25 ఏళ్ల వివేక్ సైనీ అమెరికాలో మాస్టర్స్ కోర్సు చదువుతున్నాడు. లిథోనియాలోని ఒక స్టోర్‌లో క్లర్క్‌గా పార్ట్‌టైం ఉద్యోగం చేస్తున్నాడు. ఇటీవల ఇల్లు లేని జూలియన్ ఫాల్క్‌నర్ అనే వ్యక్తి ఆ స్టోర్‌లోకి వచ్చాడు. బయట చలిగా ఉండటంతో వివేక్‌తోపాటు ఆ స్టోర్ సిబ్బంది అతడికి ఆశ్రయం ఇచ్చారు. రెండు రోజులు అక్కడ ఉన్న ఫాల్క్‌నర్‌కు చిప్స్, కోక్, తాగునీటితోపాటు వెచ్చదనం కోసం జాకెట్ కూడా ఇచ్చారు. ఆ వ్యక్తి వివేక్‌ను పలుమార్లు సిగరెట్లు అడిగి తీసుకున్నాడు. కాగా, జూలియన్ ఫాల్క్‌నర్ ఆ స్టోర్ నుంచి వెళ్లకుండా అక్కడే మకాం వేశాడు. ఈ నేపథ్యంలో జనవరి 16న స్టోర్ నుంచి వెళ్లాలని లేకపోతే పోలీసులకు ఫోన్ చేస్తానని వివేక్ అన్నాడు. ఆ తర్వాత ఇంటికి వెళ్లేందుకు అతడు సిద్ధమయ్యాడు. ఇంతలో జూలియన్ ఫాల్క్‌నర్ చేతిలోని సుత్తితో వివేక్ వద్దకు వచ్చి దాడి చేశాడు. అతడి తల, ముఖంపై సుమారు 50 సార్లు సుత్తితో కొట్టాడు. రక్తం మడుగుల్లో పడిన వివేక్ అక్కడికక్కడే చనిపోయాడు.మరోవైపు ఇది చూసి ఆ స్టోర్‌లోని మిగతా సిబ్బంది భయాందోళన చెందారు. వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో పోలీసులు అక్కడకు చేరుకున్నారు. వివేక్ మృతదేహం వద్ద చేతిలో సుత్తితో ఉన్న జూలియన్ ఫాల్క్‌నర్‌ను అరెస్ట్ చేశారు. ఆ స్టోర్‌లోని సీసీటీవీలో రికార్డైన వీడియో ఫుటేజ్‌ను పోలీసులు పరిశీలించారు. ఈ వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది.




### నార్సింగి వద్ద ఎండిఎంఏ డ్రగ్స్‌తో

## ఎస్ఓటీకి పట్టుబడ్డ యువతి

### 4 గ్రాముల డ్రగ్స్ స్వాధీనం

### నిందితురాలు లావణ్యతో ఓ సినీ నటుడికి సంబంధాలు ఉన్నట్లుగా అనుమానాలు

**రంగారెడ్డి జనవరి 29 (వెలుతురు):** రాజేంద్రనగర్ పరిధిలోని నార్సింగి వద్ద ఓ మహిళ ఎండిఎంఏ డ్రగ్స్ తో సైబరాబాద్ ఎస్ఓటి పోలీసులకు పట్టుబడడం కలకలం సృష్టించింది. ఈ మేరకు పట్టుబడ్డ నిందితురాలు లావణ్య నుండి 4 గ్రాముల ఎండిఎంఏ డ్రగ్స్ ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మరోవైపు మత్తు పదార్థాలతో పట్టుబడ్డ లావణ్య కు సినీ హీరోతో సంబంధం ఉన్నట్టుగా పోలీసులు అనుమానిస్తున్నారు. ఏసీపీ లక్ష్మీనారాయణ కథనం ప్రకారం.....మత్తు పదార్థాల అక్రమ రవాణాపై ఉక్కు పాదం మోపుతున్న సైబరాబాద్ పోలీసులు ఖచ్చితమైన సమాచారం మేరకు నార్సింగి వద్ద లావణ్యను అదుపులోకి తీసుకున్నారు. ఈ మేరకు ఆమె వద్ద నుండి 4 గ్రాముల ఎండిఎంఏ డ్రగ్స్ ను ఎస్ఓటి పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నిందితురాలు గోవా నుండి డ్రగ్స్ హైదరాబాద్ కు తీసుకొచ్చినట్లుగా పోలీసులు గుర్తించారు. ఈ మేరకు నిందితురాలు లావణ్యను ఎస్వోటీ టీమ్ తదుపరి విచారణ నిమిత్తం నార్సింగి పోలీసులు అప్పగించడం తో నిందితురాలి పై ఎన్ డి పీఎస్ యాక్టు కింద కేసు నమోదు చేశారు.ఇదిలా ఉండగా మత్తు పదార్థాలతో పోలీసులకు పట్టుబడ్డ నిందితురాలు లావణ్యకు తెలుగు సినీ పరిశ్రమకు చెందిన ఓ ప్రముఖ హీరోతో సంబంధాలు ఉన్నట్లుగా తెలుస్తోంది. ఈ నేపథ్యంలో కేసు నమోదు చేసిన పోలీసులు ఆ హీరో ఎవరన్నది కూపీ లాగుతున్నారు. అంతేకాకుండా సినీ పరిశ్రమలో లావణ్య కు ఇంకా ఎవరెవరితో సంబంధాలు ఉన్నాయి అనే కోణంలో పోలీసులు దర్యాప్తు సాగిస్తున్నారు.









### మీ ఇష్టారీతిన వ్యవహరిస్తే..

# ఇంటికి పంపుతా

### సమయానికిరాని ఉద్యోగులపై వేటు తప్పదు

### పొల్యూషన్ కంట్రోల్ బోర్డులో మంత్రి కొండా సురేఖ ఆకస్మిక తనిఖీలు

### బయోమెట్రిక్ చెక్..అధికారులు, సిబ్బందిని హెచ్చరించిన మంత్రి

### సీనియర్ జర్నలిస్ట్, కోడికంటి శ్రీనివాస్

**హైదరాబాద్ వెలుతురు జనవరి 29:** గత ప్రభుత్వంలో మాదిరిగా నిబంధనలు పాటించకుండా.. మీ ఇష్టారీతిన వ్యవహరిస్తామంటే?? ఊరుకునే ప్రసక్తే లేదు?.. బాధ్యత లేకుండా.. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తామంటే ఇకపై నడవదు?.. సమయానికిరాని ఉద్యోగులపై వేటు తప్పదు. ప్రభుత్వం నుంచి జీతం తీసుకుంటూ.. టైంపాస్ ఉద్యోగం చేస్తామంటే?? ఉపేక్షించబోము. అలాంటి ఆలోచన ఉన్నవారు మారాలి?? కచ్చితంగా మారాల్సిందే కూడా.. లేకపోతే?? ఇకనుంచి పనిచేయనివారిని ఇంటికి సాగనంపుతాం అంటూ మంత్రి కొండ సురేఖ తీవ్రంగా హెచ్చరించారు. ఈ మేరకు తెలంగాణ స్టేట్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు.. సనత్ నగర్ కార్యాలయంలో సోమవారం అటవీ, పర్యావరణ, దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ ఆకస్మిక తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా కార్యాలయంలోని ప్రతి సెక్షన్ ను కలియ తిరిగారు. కార్యాలయంలోని ప్రతి ఫైళ్ళను క్షుణ్ణంగా పరిశీలించారు. అధికారుల నుంచి వాటికి సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. బయోమెట్రిక్ లో నమోదైన వివరాలతో కూడిన హాజరు పట్టికను పరిశీలించారు కార్యాలయంలో ఎంతమంది పనిచేస్తున్నారు, ఎవరెవరు లీవ్ లో ఉన్నారో అగిడి తెలుసుకున్నారు. ముందస్తు సమాచారం లేకుండా గైర్హాజరు కావడం, నిర్ణీత సమయానికి కార్యాలయానికి రాకుండా ఇష్టారీతిన వ్యవహరించే వారిపై కఠిన చర్యలుంటాయని మంత్రి అధికారులు, సిబ్బందిని హెచ్చరించారు.

అనంతరం కాలుష్య నివారణ, నియంత్రణకు కాలుష్య నియంత్రణ బోర్డు ఆధ్వర్యంలో చేపడుతున్న పరిశోధనలు, చర్యల పురోగతిని మంత్రి అధికారులను అడిగి తెలుసు కున్నారు.

సిబ్బంది తమ బాధ్యతలను నిర్లక్ష్యం చేయకూడదని, సమర్థవంతంగా విధులను నిర్వహిస్తూ కాలుష్య నియంత్రణకు ప్రభుత్వం సూచించిన మార్గదర్శకాలను విస్తృతంగా అమలు పరచాలని అధికారులను ఆదేశించారు. భవిష్యత్‌లో తాను ఎప్పుడు తనిఖీ నిర్వహించిన అధికారులు, సిబ్బంది అన్ని వివ రాలతో సిద్ధంగా ఉండాలని మంత్రి సురేఖ సూచించారు.







### అమ్మలు శారీరకంగా మానసికంగా ఆరోగ్యంగా ఉంటేనే

# బిడ్డలు ఆరోగ్యంగా పుడతారు

### - మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్ రావు

**సిద్దిపేట టౌన్ వెలుతురు జనవరి 29:** సిద్దిపేట విపంచి కళానిలయంలో శ్రీ రామకృష్ణ సేవాసమితి గర్భిణీ స్త్రీలకు నిర్వహించిన శిక్షణ అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న మాజి మంత్రి హరిష్ రావు

ఈ సందర్బంగా మాట్లాడుతు గర్భిణులను సంరక్షించు కోవాల్సిన బాధ్యత సమాజంపై ఉన్నది గర్భధారణ సమ యంలో మహిళల శరీరం అనేక మార్పులకు లోనై శిశువుకు జన్మనిస్తుంది

ఈ సమయంలో మహిళలు మనసును ఎంత ప్రశాతంగా జాగ్రత్తగా మరియు ఆనందంగా ఉంటే పుట్టే పిల్లలు అంత ఆరోగ్యంగా జన్మిస్తారు సిజేరియన్‌లో కాకుండా నార్మల్ డెలివరీలో పుట్టిన పిల్లలు ఆరోగ్యంగా ఉంటారు మొదటి గంట తల్లిపాలు పిల్లలకు అమృతంలో సమానం తల్లీ బిడ్డలు ఆరోగ్యంగా ఉండాలని బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో గర్భిణులకు కేసీఆర్ కిట్ న్యూట్రిషన్ కిట్లు పంపిణీ చేశాం సమాజ హితం కోసం అంకిత భావంతో పనిచేస్తున్న రామకృష్ణ మఠం నిర్వాహకులకు హృదయపూర్వక ధన్యావాదాలు తెలిపారు.

#### గర్భిణీలు తీసుకోవాల్సిన ఆహారాలు

- ఎక్కువ నీరు త్రాగాలి (ఇది బరువు తగ్గడానికి సహాయపడుతుంది)
- గర్భధారణ సమయంలో పాల ఉత్పత్తులను సరైన మోతాదులో తీసుకోవాలి (ఎముకలు మరియు దంతాలు బలంగా మారుతాయి)
- బాదం జీడిపప్పు వాల్నట్స్ పిస్తా వంటి వాటిని తీసుకోవడం కూడా చాలా ముఖ్యం
- గర్భిణీ స్త్రీలు ఎక్కువగా పండ్లను తీసుకుంటూ ఉండాలి (రక్తహీనత మరియు హిమోగ్లోబిన్ స్థాయిలను పెంచుతుంది)
- పప్పుధాన్యాలు ఆకుకూరలు మాంసం వంటి వాటిని తప్పనిసరిగా తీసుకోవాలి.






# మన జీవితాలనుంచి ప్లాస్టిక్‌ను దూరం చేద్దాం

### ప్రముఖ కవి గాయకుడు జయరాజ్ పిలుపు

**మేడ్చల్ జనవరి 29(వెలుతురు):** మన జీవితం నుండి ప్లాస్టిక్ ని దూరం చేద్దామని ప్రముఖ కవి గాయకుడు జయరాజ్ పిలుపునిచ్చారు. సోమవారం కుషాయిగూడ చక్రిపురం లో పర్యావరణాన్ని పరిరక్షిద్దాం అవగాహన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జయరాజు మాట్లాడుతూ ప్రతి నిత్యం ప్రజలు ప్లాస్టిక్ ని



వాడుతున్నారని తద్వారా పర్యావరణం దెబ్బతింటుందని తెలిపారు. ప్లాస్టిక్ మన జీవితం లో ఉదయం పాల పాకెట్ తో మొదలైన రాత్రి భోజనం ప్యాకెట్ తో ముగుస్తుంది అని తెలిపారు. ఈ విధంగా మనం అన్నం తినే ఇస్తరాకు దగ్గర నుంచి మంచినీళ్లు తాగే ప్లాస్టిక్ గ్లాస్ వరకు ప్లాస్టిక్ ని నిత్యం వాడుతున్నామని వివరించారు. ఇదే విధానం కొనసాగితే ప్రజలు రోగాల బారిన పడే ప్రమాదం ఉందన్నారు. ఈ విధంగా మన జీవన విధానం ఉంటే భవిష్యత్తులో మంచి నీరు, మంచి గాలి మనకి దొరకటం అసాధ్యమన్నారు.

ఈ కార్యక్రమంలో పాల్గొన్న స్టెప్ ఆర్గనైజర్ ప్రముఖ సైకాలజిస్ట్ డాక్టర్ ప్రత్యూష సుబ్బారావు మాట్లాడుతూ ప్లాస్టిక్ వాడకం ద్వారా వచ్చే నష్టాలు, రోగాలను వివరించారు. త్వరలో ప్లాస్టిక్ వ్యతిరేకంగా రెండు తెలుగు రాష్ట్రాల్లో పెద్ద ఎత్తున కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. గతంలో ఈ ప్లాస్టిక్ లేకుండా ప్రజలు ఎంతో ఆనందంగా జీవనాన్ని గడిపారని, ప్రజలు ప్లాస్టిక్ కవర్లను నిషేధించడం వల్ల క్లాత్ బ్యాగులు, జ్యూట్ బ్యాగులు ప్రత్యామ్నాయంగా వాడకంలోకి వచ్చాయని వివరించారు. ఈ కార్యక్రమంలో స్టెప్ ఆర్గనైజర్లు గుమ్మడి హరిప్రసాద్, రంగన్న, గురు ప్రసాద్, జర్నలిస్టులు దొమ్మాడి కిరణ్ కుమార్, డి శ్రీనివాసరావు, ఇంద్రపాల సత్యనారాయణ, బి శాంతి బాబు తదితరులు పాల్గొన్నారు.

# సీసీఐ తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ కమిటీ అధ్యక్షునిగా మామిడి భీమిరెడ్డి

**హైదరాబాద్ జనవరి 29(వెలుతురు):** జాతీయ వినియోగదారుల సమన్వయ సమాఖ్య (సీసీఐ) తెలంగాణ రాష్ట్రము నకు వర్కింగ్ కమిటీ అధ్యక్షునిగా మామిడి భీమిరెడ్డి నియమితులైనారు. మాసబ్ ట్యాంక్ వద్దగల రెడ్ క్రాస్ భవనము లో జాతీయ వినియోగదారుల సమన్వయ సమాఖ్య సీసీఐ సభ్యత్వ నమోదు కార్యక్రమం రౌండ్ టేబుల్ సమావేషం నిర్వహించారు. ఈ సమావేశానికి జాతీయ వినియోగదారుల సమన్వయ సమాఖ్య




జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ ప్రీతి పాండ్యన్ ముఖ్యఅతిథిగా హాజరైనారు. ఈససమావేశము నకు హాజరై సభ్యులు తీసుకున్న పక్కా అభిప్రాయ తీర్మానం మేరకు ప్రీతి పాండ్యన్ గారిని నియమించారు. ఈ సందర్బంగా ప్రసంగిస్తూ సభ్యత్వము పొందిన వారికి మరియు రెడ్ క్రాస్ సంస్థ సీసీఐ సమన్వయముగా 29, 30 తేదీలలో వివిధ చట్టాలపై కల్తీలు కనుగొనుట మరియు నష్టం జరిగిన వినియోగదారుడు ఎక్కడ ఫిర్యాదు చేయాలి, నష్టపరిహారం ఏ విధంగా పొందాలి అనే అంశాలపై సుమారు 100 మంది శిక్షణ పొంది గ్రామీణ వినియోగదారులను వీరు చైతన్యము కలగజేస్తారు అని అన్నారు.

ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్టంలో వినియోగదారుల సంఘాల నాయకులు హాజరై వారి అభిప్రాయములు తెలిపారు. సమావేశంలో జాతీయ సీసీఐ ఉపాధ్యక్షుడు డాక్టర్ చదల వాడ హరిబాబు, తమిళనాడు నుండి సీసీఐ సీనియర్ జనరల్ సెక్రటరీ సెల్వరాజ్, సిసిఐ నేషనల్ జాయింట్ సెక్రటరీ నాగరాజు, సీసీఐ సీనియర్ జాయింట్ సెక్రటరీ శివపార్వతి, క్యాట్కో చైర్మన్ శంకర్ లాల్ చౌరాసియా, జాయింట్ సెక్రెటరీ విశ్వనాధర రాజు, సిసిఐ గవర్నింగ్ కౌన్సిల్ మెంబర్ కొంతం వీరాస్వామి, సుజాత, నర్సింహారెడ్డి, ఐజాక్ రాజు, అరబు రాథోడ్, శిల్పారెడ్డి, సుప్రభా తదితరులు పాల్గొన్నారు.

## కవులు సమాజానికి ఉపయోగపడే విధంగా

# రచనలు చేయాలి

### ఆనందలహరి పుస్తకావిష్కరణ సభలో వక్తలు

**హైదరాబాదు జనవరి 29 29(వెలుతురు):**
హైదరాబాదులోని విద్యానగర్ లో గల జాతీయ బీసీ భవన్ లో సుతారపు వెంకటనారాయణ రచించిన ఆనందలహరి పుస్తకావిష్కరణ కార్యక్రమం తెలంగాణ కవుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు సుతారపు వెంకటనారాయణ రచించిన ఆనందలహరి పుస్తకావిష్కరణ సభ విద్యానగర్ లోని జాతీయ బీసీ భవన్ లో ఘనంగా నిర్వహించడం జరిగింది. ఆనందలహరి పుస్తకాన్ని తెలంగాణ ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ అమ్మంగి వేణుగోపాల్ ఆవిష్కరించారు. ఈ



కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు రాజ్యసభ సభ్యులు ఆర్ కృష్ణయ్య విచ్చేసి ఉపన్యసిస్తూ సుతారపు వెంకటనారాయణ గతంలో మనసు లిపి ,కరోనా కదలికలు, అక్షర లహరి కవిత పుస్తకాలను రచించి తెలంగాణ కావులలో ప్రత్యేకతను చాటుకున్నారన్నారు. ప్రస్తుతం ఆనందలహరి గేయం సంపుటిని ఆవిష్కరించడం అభినందనీయం అన్నారు. సమాజంలోని వివిధ అంశాలను వివిధ కోణాల్లో అవగాహన చేసుకుంటూ సమాజానికి ఉపయోగపడే విధంగా రచనలు చేశారని భవిష్యత్తులో మరిన్ని రచనలు చేసే సామర్థ్యం ఉన్న కవిగా రచయితగా గుర్తింపు పొందాలన్నారు. కవులు సమాజంలోని ఏదో ఒక అంశానికి మాత్రమే పరిమితం కాకుండా సమాజంలోని అన్ని విషయాలను అవగాహన చేసుకుంటూ సమాజ ప్రయోజక రచనలు చేసినప్పుడే నిజమైన సార్ధకథ అన్నారు. గౌరవ అధ్యక్షులుగా తెలంగాణ రచయితల సంఘం అధ్యక్షుడు కాలేశ్వరం శంకరం పుస్తకాన్ని గూర్చి వివరించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ కవుల సంఘం సాహిత్య కార్యదర్శి అనుమాల ప్రభాకరాచారి ,కోశాధికారి దొంతర బోయిన దైవ దీనం, మానస ఆర్ట్ సంస్థ వ్యవస్థాపకులు రఘు శ్రీ ,తెలంగాణ భాషా చైతన్య సమితి వ్యవస్థాపకులు బడేసబ్ ప్రముఖ కవులు కవయిత్రులు రామచంద్ర మౌళి పొన్నం రాజయ్య

## రైల్వేల రాష్ట్ర స్థాయి భద్రతా కమిటీ

# పనితీరును సమీక్షించిన డిజిపి రవి గుప్తా

**హైదరాబాద్ జనవరి 29(వెలుతురు):**
రాష్ట్రంలోని రైల్వే ప్రాంతాల భద్రత పరిస్థితులపై రాష్ట్ర డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ రవి గుప్తా సమీక్షించారు. రాష్ట్ర డిజిపి కార్యాలయంలో రైల్వేస్ %డ% రోడ్ సేఫ్టీ అడిషనల్ డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ మహేష్ ఎం భగవత్ ఆధ్వర్యంలో రైల్వే పోలీస్, రైల్వే అధికారులతో సమీక్ష సమావేశం సోమవారం నాడు నిర్వహించారు. రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్(ఆర్ పి ఎఫ్) ఇన్స్పెక్టర్ జనరల్ మరియు ప్రిన్సిపల్ చీఫ్ సెక్యూరిటీ కమిషనర్ అరోమ సింగ్ ఠాకూర్, సీనియర్ డివిజనల్ సెక్యూరిటీ కమిషనర్, హైదరాబాద్ అనూప్ కుమార్ శుక్ల, సీనియర్ డిఎస్సీ సికింద్రా బాద్ దెబష్మిత సి బెనర్జీ , రైల్వే అడిషనల్ డిఆర్ఎం రాజీవ్ కుమార్ గంగెలే, ఇంటెలిజెన్స్ సెక్యూరిటీ వింగ్ డిఐజి తఫ్సీర్ ఇక్బాల్, ఇంటెలిజెన్స్ బ్యూరో అసిస్టెంట్ డైరెక్టర్ జి దామోదర్ రెడ్డి , రైల్వే ఎస్పీ సలీమ తదితరులు సమావేశంలో పాల్గొన్నారు. సమీక్ష సమావేశంలో డిజిపి రవిగుప్త మాట్లాడుతూ..... తెలంగాణ రాష్ట్రంలో రైల్వే పోలీస్ కు అవసరమైన మరి కొంతమంది పోలీస్ సిబ్బందిని కేటాయించే విషయమై చర్చిస్తానని అన్నారు. రైల్వే విభాగంలో ప్రభుత్వ రైల్వే పోలీసులు (జి అర్ పి) 12 రైల్వే పోలీస్ స్టేషన్లోనూ 17 రైల్వే అవుట్ పోస్టులను పని చేస్తున్నారని తెలియజేశారు. రైల్వే పోలీస్ స్టేషన్ల పరిధిలో అవసరమైన కెమెరాలను ఇతర భద్రతాపరమైన సామాగ్రిని పెంచేలా చర్యలు చేపట్టాల్సి ఉందని అన్నారు. హైదరాబాద్ మహానగరం దేశంలోనే అత్యధిక సిసిటీవీ లు కలిగిన రాజధానిగా పేరు ఉందని తదనుగుణంగా రైల్వే స్టేషన్లలోనూ ఏర్పాటు చేయాల్సి ఉందని అభిప్రాయపడ్డారు.

పండుగ రోజులలోను , సెలవు దినాలలోనూ ప్రయాణికుల రద్దీ అధికంగా ఉన్న సందర్భాలలో అదనపు భద్రతపై చర్యలు చేపట్టాలని అన్నారు. రైల్వే ట్రాక్లపై జరుగుతున్న ప్రమాదాలు అన్నింటి పైన రైల్వే పోలీసులు విచారణ జరపాలని సూచించారు ఈ సందర్భంగా రైల్వేస్ అడిషనల్ డిజిపి మహేష్ ఎం భగవత్ మాట్లాడుతూ.... రైల్వే ట్రాక్లపై ప్రమాదాలు అరికట్టేందుకు అయా ప్రాంతాల్లో ఫుట్ ఓవర్ బ్రిడ్జిలు , ఫెన్సింగ్ లఏర్పాటు చేయాల్సి ఉందని అభిప్రాయపడ్డారు. నాంపల్లి, కాజీపేట, మహబూబ్ నగర్ తదితర ప్రాంతాల్లోని రైల్వే పోలీస్ స్టేషన్ల ను రైల్వే స్టేషన్ల లో ఏర్పాటు చేయడం ద్వారా బాధితులు త్వరితగతిన ఫిర్యాదు చేసేందుకు ఆస్కారం ఉంటుందని అన్నారు .లింగంపల్లి ,బేగంపేట్, మేడ్చల్ లలో జి అర్ పి సిబ్బందికి అవసరమైన సదుపాయాలు కల్పించేందుకు తగిన చర్యలు చేపట్టాల్సిన ఉందని అన్నారు. సికింద్రాబాద్ రూరల్ రైల్వే పోలీస్ సబ్




డివిజన్, హైదరాబాద్, సికింద్రాబాద్ రైల్వే పోలీస్ ఇన్స్పెక్టర్ల కార్యాలయాల పునర్నిర్మాణం కానీ, కొత్త కార్యాలయం ఏర్పాటు కానీ చేయాల్సి ఉందని అన్నారు.

మహబూబ్ నగర్ , వికారాబాద్, నల్గొండ , కాజిపేట్, వరంగల్ మంచిర్యాల రైల్వే స్టేషన్లలో సదుపాయాలు ఆధునికరణ జరగాల్సి ఉందని పేర్కొన్నారు .కరీంనగర్లో రైల్వే పోలీస్ స్టేషన్ ని, కోరుట్ల ,సిద్దిపేటలో రైల్వే అవుట్ పోస్టులను ఏర్పాటు చేయాల్సి ఉందని అన్నారు. లింగంపల్లి, చర్లపల్లి, ఫలక్నామా లలో జి ఆర్ పి సిబ్బందికి సదుపాయాలు ఏర్పాటు చేయాల్సిందని తెలిపారు డ్రగ్స్ , గంజాయి సికింద్రాబాద్ కాజీపేట లలో స్నీఫర్డ్ డాగ్స్ని ఏర్పాటు చేయాలని యోచిస్తున్నట్లు తెలిపారు. జిఆర్పి సిబ్బంది కోసం రైల్వే ఆసుపత్రిలో ఉచిత వైద్య సదుపాయం కల్పించేటట్టుగా చర్యలు చేపట్టాల్సి ఉందని అన్నారు. సమావేశంలో డిజిపి రవి గుప్తా రైల్వే ప్రయాణికులకు సూచనలు చేస్తూ..... అనుమానాస్పద వ్యక్తులు తారసపడిన వస్తువులు కనిపించిన 100 గాని 139 కు గాని 1512 కు గాని సమాచారం అందించాలని, అపరిచితుల దగ్గర నుంచి తినే పదార్థాలను తీసుకోవద్దని, మహిళలు రాత్రిపూట ప్రయాణించేటప్పుడు ఎక్కువ మంది ప్రయాణికులు ఉన్న కంపార్ట్మెంట్లోనే ఉండాలని అన్నారు. ప్రయాణికులు మొబైల్ ఫోన్లు చేయుట గురైతే సమీప రైల్వే పోలీస్ స్టేషన్లో గాని, www.ceir.gov.in.కు ఫిర్యాదు చేయాలని అన్నారు. ప్రయాణికుల భద్రత కోసం, ఆర్పిఎఫ్ ,జి ఆర్ పి సిబ్బంది బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించేందుకు అడిషనల్ డిఆర్ఎం రాజీవ్ కుమార్ గెంగేలె తదితర అధికారులు తమ అభిప్రాయాలను తెలియజేశారు.







# జిల్లాలో అట్రాసిటీ కేసులను పరిష్కరించి, బాధితులకు న్యాయం చేయాలి

### మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశంలో కలెక్టర్ గౌతమ్

**మేడ్చల్ – మల్కాజిగిరి (వెలుతురు):**
జిల్లా వ్యాప్తంగా ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులకు సంబంధించి వాటిని తక్షణమే పరిష్కరించి బాధితులకు వెంటనే న్యాయం చేయాలని ఈ విషయంలో సంబంధిత శాఖల అధికారులు అవసరమైన ప్రత్యేక చర్యలు తీసుకోవాలని మేడ్చల్ – మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్ అన్నారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా పరిషత్ ఛైర్మన్ మలిపెద్ది శరత్ చంద్రారెడ్డి, మల్కాజిగిరి శాసనసభ్యులు మర్రి రాజశేఖర్రెడ్డి, మేడ్చల్ డీసీపీ నిఖిత్, జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్రెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారిణి హరిప్రియ, రాచకొండ, సైబరాబాద్ పోలీసు అధికారులు కమిటీ సభ్యులు తదితరులతో కలిసి జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ గౌతమ్ మాట్లాడుతూ ప్రభుత్వం చేపట్టే పౌరహక్కుల రక్షణ చట్టం (ప్రొటెక్షన్ ఆఫ్ సివిల్ రైట్స్) – పీసీఆర్), అట్రాసిటీ నివారణ చట్టం (ప్రివెన్షన్ ఆఫ్ అట్రాసిటీ – పీవోఏ) చట్టాలను ఖచ్చితంగా అమయ్యేలా అవసరమైన చర్యలు చేపట్టాలని జిల్లా అధికారులకు సూచించారు. జిల్లాలో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులను తక్షణమే పరిష్కరించి బాధితులకు న్యాయం చేయడానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే ఈ కేసులకు సంబంధించి రాచకొండ, సైబరాబాద్ పోలీస్ అధికారులు తమతమ పరిధిలో ఇప్పటి వరకు ఉన్న కేసుల వివరాలు వాటి పురోగతిపై కలెక్టర్ ప్రత్యేకంగా అడిగి తెలుసుకొన్నారు. ఈ కేసులను త్వరితగతిన పూర్తి చేయాలని ఏమాత్రం పెండింగ్లో ఉంచరాదని ఆయన సూచించారు. జిల్లాలో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులను సంబంధిత శాఖల సమన్వయంతో తక్షణమే పరిష్కరించి బాధితులకు న్యాయం చేసే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని వివరించారు.

ఈ కేసులపై విచారణ చర్యలను వేగవంతం చేసి సకాలంలో బాధితులకు న్యాయం జరిగేలా అధికారులు చర్యలు తీసుకోవాలని తెలిపారు. దీంతో పాటు అధికారులు ఎఫ్ఐఆర్ కేసులు నమోదు అయిన వెంటనే విచారణ దశలో ఉన్న బాధితులకు నిబంధనల మేరకు నష్టపరిహారం అందించే విధంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. విజిలెన్స్ అండ్ మానిటరింగ్కు సంబంధించి ఏమైనా ఇబ్బందులు ఉంటే వెంటనే తన దృష్టికి తీసుకురావాలని సభ్యులను ఈ సందర్భంగా కలెక్టర్ కోరారు. అట్రాసిటీ కేసుల్లో అధికారులు పూర్తి నిబద్దతతో తమ విధులు నిర్వర్తించాలని కలెక్టర్ గౌతమ్ అధికారులకు సూచించారు.

జిల్లా పరిషత్ ఛైర్మన్ శరత్ చంద్రారెడ్డి మాట్లాడుతూ... అట్రాసిటీ కేసుల్లో బాధితులకు సత్వర న్యాయం జరిగేలా అధికారులు చూడాలని అందుకు సంబంధించి కేసులు పెండింగ్ ఉండకుండా త్వరితగతిన పూర్తయ్యేలా చూడాల్సిందిగా సమావేశంలో పేర్కొన్నారు. కేసులు పెట్టిన వారిపై రకరకాల ఒత్తిడులు వస్తుంటాయని దీనిని దృష్టిలో పెట్టుకొని వారికి పోలీసులు, ఇతర శాఖలు అండగా నిలవాలని ఆయన స్పష్టం చేశారు.

మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్రెడ్డి మాట్లాడుతూ జిల్లాలో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు లేకుండా చూడాల్సిన అవసరం ఉందని అన్నారు. ఈ విషయంలో కేసులు నమోదైన వెంటనే త్వరితగతిన దర్యాప్తు ప్రారంభించి వీలైనంత త్వరగా పూర్తి చేయాలని వారికి న్యాయం జరిగేలా చూడాలన్నారు.

ఈ కార్యక్రమంలో మేడ్చల్ డీసీపీ నిఖితపంత్, జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్రెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారిణి హరిప్రియ, రాచకొండ, సైబరాబాద్ పోలీసు అధికారులు, జిల్లా ఎస్సి,ఎస్టి కమిటీ మెంబర్లు వెంకటేష్, ధనరాజ్ నాయక్, జిల్లా ఎస్సీ సంక్షేమ శాఖ అభివృద్ధి అధికారి వినోద్, విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# అరాచక శక్తులకు కొమ్ము కాస్తున్న టెక్కలి డిఎస్పీ చర్యలు తీసుకోవాలి

### ఐహెచ్‌అర్‌ఏ ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర సివిల్ రైట్స్ చైర్మన్ కరణం తిరుపతి నాయుడు డిమాండ్

**అమరావతి జనవరి 29(వెలుతురు):** అరాచక శక్తులు, గుండాలు కొమ్ము కాస్తున్న టెక్కలి డిఎస్పీ బాలచంద్ర రెడ్డి పై చర్యలు తీసుకోవాలని అంతర్జాతీయ మానవ హక్కుల సంఘం ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర సివిల్ రైట్స్ చైర్మన్ కరణం తిరుపతి నాయుడు డిమాండ్ చేసారు. శ్రీకాకుళం జిల్లా, హిరమండలం మండలం, రుగడ సదేవాలయం పరిధిలో యున్న యమ్. అవిలింగి గ్రామములో గత 20 సంవత్సరాలు నుండి హక్కు అనుభములో యున్న కొండ ఆదివాసి గిరిజనులు రాహుల్ పెగైరా తాలూకా భూమిపై కన్నువేసి, ఆక్రమించడానికి దౌర్జన్యం చేసిన పదాల రఘు వగైరా ఆరావక శక్తుల గుండాలపై యస్.పి. అట్రాసిటీ కేసు నమోదు వేసి తగు చర్యలు తీసుకోవాలని తిరుపతి నాయుడు డిమాండు చేస్తున్నది.

ఈ నెల 25న యమ్.ఆవలింగి గ్రామములో మధ్యాహ్నం 4-00 గంటలు సమ యంల ఆదివాసీలు గిరిజనులుపై భయంకరమైన దాడులు చేసి అడవారిని కూడా జుట్టుపట్టి ఈడ్చి పిల్లలు ఉన్నారని కూడా మాడకుండా వంటిపిల్లల తల్లులను దారుణంగా కొట్టి హింసించి మరియు తక్షణమే గ్రామం వదిలి వెళ్లిపోవాలని బెదిరించిన ఆరావక శక్తి పడాల రఘు వగైరా 25 మందిపై క్రిమినల్ కేసు సమాదు వేసి తగుచర్యలు తీసుకోవాలని కొండ ఆదివాళి గిరిజనులకు తగు భద్రత కల్పించాలని డిమాండ్





చేసారు. గత 20 సంవత్సములు నుండి వారి హక్కు అనుభములో వున్న భూమిని రెవిన్యూ అధికారులు, రెవిన్యూ రికార్డులను బెంపరింగు వేసి అధిక మొత్తములో లంచం తీసుకొని గత మూడు సంవత్సరములు క్రింద అప్పటి హిరమండల రెవిన్యూ తహశీల్దారు పాసుపుస్తకములు పడాల రఘు అనే అసామికి మంజూరు చేయడం వెనక పెద్ద కుట్ర ఉన్నదని ప్రత్యేక ఆంధ్రప్రదేశ్ ఏర్పడినందున భూములు ధరలు పెరిగినందున పడాల రఘు వగైరా ఎ. 3-40 సెంట్లు భూమిని కాజేయుటకు ప్రయత్నిస్తున్నట్లు ఈ క్రమంలో వారిపై దాడులు చేసారని వారిని చంపడానికి కూడా ప్రయత్నాలు చేస్తున్నారని గతంలో కూడా పడాల రఘు వగైరాల మీద బైండవరు కేసులు ఉన్నాయని కాబట్టి పై అంశములు అన్ని పరిగణలోనికి తీసుకొని ఇంతవరకు ఎటుంటి చర్యలు తీసుకోకుండా ఉన్న క్రింద స్థాయి పోలీస్ అధికారులపై తగుచర్యలు తీసుకొని గౌరవ జిల్లా సూపరెండెంటుకు తగు ఆదేశాలు జారీచేసి గిరిజనుల ప్రాథమిక హక్కులు, వారి జీవన బృతిని కాపాడాలని విజ్ఞప్తి చేసారు. వెంటనీ నిందితులను అరెస్ట్ చేయాలని లేని పక్షం లో కేంద్ర హోమ్ శాఖా మంత్రికి పిర్యాదు చేయనున్నట్లు తెలిపారు. ఈ మేరకు శ్రీకాకుళం జిల్లా, కలెక్టరు మరియు జిల్లా మేజిస్ట్రేట్ స్పందనలో పిర్యాదు చేసినట్లు తెలిపారు.



# బ్లాక్ ఎందుకు ధరించాలి?..

## ఫ్యాషన్‌లో అశుభమన్న మాటకు తావులేదంటున్న డిజైనర్లు
## ధరించడంలో కాస్త మెలకువ పాటిస్తే మీరే ఫ్యాషన్ ఐకాన్ అంటూ సూచన

బ్లాక్ (నలుపు) అశుభానికి చిహ్నంగా భావించే వారెందరో.. ఫ్యాషన్ ప్రియులు మాత్రం ఎవర్‌గ్రీన్ కలర్స్‌లో ఒకటిగా దీనికి ప్రత్యేక స్థానమే ఇస్తుంటారు. ఈ కలర్ ఎలాంటి వారికైనా కొత్తందాలను అందిస్తుందన్నది డిజైనర్ల మాట. క్యాజువల్ మొదలు పార్టీ డ్రెస్సింగ్, వెడ్డింగ్స్‌లో అక్కడక్కడా ఈ నలుపందాలు కనిపిస్తుంటాయి.

**హైదరాబాద్:** అంతర్జాతీయ ధోరణుల కారణంగా ఫ్యాషన్‌లో తప్పనిసరి రంగుగా బ్లాక్ చేరింది. వేడుకలలో బ్లాక్‌కు అసలు స్థానం లేదన్నది సత్యం కానీ పలువురు సినీతారలు మొదలుకుని సోషలైట్స్ వరకూ వేడుకలు, సంప్రదాయ పండుగలలో ఆ రంగు వస్త్రాలను సౌకర్యవంతంగా ధరిస్తున్నారు. ఎందుకలా అని అంటే, బ్లాక్ డ్రెస్‌కు డిజైన్ పరంగా పెద్దగా కష్టపడాల్సిన అవసరం ఉండదు. పైగా కాంబినేషన్‌గా బ్లాక్ చాలా వరకూ కలర్స్‌తో సులువుగా కలిసిపోతుంది. బ్లాక్ డ్రెస్‌పై కొద్దిగా ఎంబ్రాయిడరీ వర్క్ చేసినా చాలు.. అందంగా కనిపిస్తుంది... పైగా పదిమందిలో సైతం ప్రత్యేకంగా కనిపించవచ్చు. ఈ కారణాలే బ్లాక్‌ను ఇప్పుడు అభిమాన కలర్‌గా మారుస్తున్నాయని డిజైనర్ హరీష్ అన్నారు.

### బ్లాక్ ఎందుకు ధరించాలంటే..

ఫ్యాషన్‌లో రంగులకు ఓ గుర్తింపు ఉంది. నమ్మకాల పరంగానూ వీటికి అధికప్రాధాన్యతే ఉంది. బ్రౌన్ కలర్ నమ్మకానికి ప్రతీకగా, ఎర్తీ కలర్‌గా చెబితే, వైట్‌ను శుభ్రతకు ప్రతీకగా చెబుతారు. కానీ బ్లాక్‌కు అలాంటి గుర్తింపేమీ లేదు. అయినప్పటికీ దీనికి ఫ్యాషన్‌లో ప్రత్యేకస్థానముంది. ఎందుకూ అంటే ఇది మీ మొహం మీద మాత్రమే ఎదుటి వారి చూపు పడేలా చేస్తుందంటున్నారు డిజైనర్లు. మరీముఖ్యంగా సినీతారలు, బిజినెస్ టైకూన్స్ ప్రత్యేక సందర్భాలలో బ్లాక్ ధరించడానికి కారణమిదే అని కూడా చెబుతున్నారు. ఇదే విషయమై డిజైనర్ అర్షియా మాట్లాడుతూ బ్లాక్ ధరించడానికి పెద్దగా కష్టపడాల్సిన అవసరం లేదు. దాదాపుగా అన్ని రంగులతోనూ ఇది బాగుంటుంది. ఎలాంటి స్కిన్‌టోన్‌పై అయినా ఇది బాగుంటుంది. సీజన్‌లతో సంబంధం ఉండదు సరికదా ఎలాంటి యాక్సరీస్ ధరించినా అవి మరింతగా అందంగా కనబడతాయి.. అనిఅన్నారు.

### బ్లాక్ షర్ట్ ఎలా ధరించాలంటే..

బ్లాక్ షర్ట్‌ను ఎలా పడితే అలా ధరించొచ్చు అనుకుంటే పొరబడినట్లే అని అంటున్నారు హరీష్. కొద్దిపాటి మెలకువలు పాటించాల్సిందేనని ఆయన చెబుతూ పలు సూచనలు చేశారు. అవేమిటంటే..

- ప్రతిరోజూ ఉద్యోగానికి వెళ్తూ వైట్స్ లేదంటే పేస్టల్ కలర్స్.. వాటికి కాంబినేషన్స్ ఎంచుకోవడం కష్టమనుకుంటే సింపుల్‌గా బ్లాక్ షర్ట్ ధరించొచ్చు. కాకపోతే మనం చేసే ఉద్యోగం కూడా పరిగణలోకి తీసుకోవాల్సి ఉంటుంది. ఐటీ రంగంలో ఇది పెద్ద ఇబ్బంది కాకపోవచ్చు. అలాగని బ్లాక్ షర్ట్, నేవీబ్లూ ట్రౌజర్స్ ధరిస్తే కౌబాయ్‌లా ఉంటారు.
- బ్లాక్ కాంబినేషన్‌గా థిక్ కలర్స్ ఉంటే బాగుంటుంది. అదీ ఫుల్ బ్లాక్ అయితే మీ సహచరులు మీపై అధిక శ్రద్ధ చూపేందుకు ఎక్కువ అవకాశముంటుంది. ఔట్‌ఫిట్ ఎప్పుడూ కూడా సింపుల్‌గా ఉండాలి.
- చాలామంది బ్లాక్ షర్ట్ ధరించి జీన్స్ ఫ్యాంట్ వేస్తారు. క్యాజువల్ డిజైన్‌గా బాగానేఉంటుంది కానీ అన్ని సందర్భాలలోనూ ఇది బాగోదు. అలాకాకుండా ఉండాలంటే స్కిన్నీ జీన్స్‌తో ధరిస్తే బెటర్. స్కిన్నీ జీన్స్‌మనకు పడదనుకుంటే స్లిమ్ ఫిట్టింగ్ చినోస్ అయినా బాగానే ఉంటాయి. ఇంకాస్త వెరైటీ చూపాలనుకుంటే రిప్డ్ జీన్స్ కూడా ధరించొచ్చు.
- ఎలాంటి ఇబ్బంది లేకుండా క్యాజువల్ లుక్ చూపాలనుకుంటే, కాంట్రాస్టింగ్ కలర్‌లో టీషర్ట్ వేస్తే చాలు. రిలాక్సింగ్, క్యాజువల్ ఔట్‌లుక్ కావాలనుకుంటే బ్లాక్ హుడీనీ బ్లాక్ జీన్స్‌తో ధరించొచ్చు.
- బ్లాక్ షర్ట్‌ను గ్రే ప్యాంట్స్‌తో ధరిస్తే క్లాసిక్ లుక్ ఇవ్వొచ్చు. మొత్తం బ్లాక్ కూడా మంచి ఆలోచన కానీ అది సూట్స్‌తో అయితే ఎదుటి వారిని ఇంప్రెస్ చేయొచ్చు.
- ఒన్లీ బ్లాక్ కష్టం.... ఇంకాస్త వెరైటీ కావాలనుకుంటే, బ్లాక్ చెక్స్ షర్ట్ ధరించొచ్చు. ఈ తరహా షర్ట్ ధరించినప్పుడు బ్లాక్ స్కిన్నీ జీన్స్ ధరిస్తే క్యాజువల్ ఔట్‌ఫిట్ ధరించిన అనుభూతి పొందొచ్చు.
- మన వాతావరణానికి పూర్తి అనువైన బ్లాక్ షర్ట్ అంటే షార్ట్ స్లీవ్ షర్ట్. కాకపోతే ఈవెనింగ్ వేర్‌గా మాత్రమే వీటిని ట్రై చేయాల్సి ఉంటుంది.
- బైకర్స్ కాస్త వెరైటీ ట్రై చేయాలనుకుంటే బ్లాక్ షర్ట్‌ను లెదర్ జాకెట్‌తో కలిపి ధరించొచ్చు. స్మార్ట్‌గా, కాంట్రాస్ట్‌గా ఇది ఉంటుంది. ఈ తరహా షర్ట్ వేసినప్పుడు ఫేడెడ్ బ్లాక్ జీన్స్, చంకీ బూట్స్ వాడాలి.
- కాలేజీ విద్యార్థులు బ్లాక్ షర్ట్ ధరించాలనుకుంటే పోలో షర్ట్ ధరించొచ్చు. అదే వర్క్‌వుట్స్‌కు వెళ్లేవారు ఆలివ్ గ్రీన్ జాగర్ ప్యాంట్స్‌తో పాటుగా బ్లాక్ టీ షర్ట్ ధరించొచ్చు.



# శ్వేత సోయగాలు

తెలుపు రంగును ఫ్యాషన్ డిజైనర్లు తెగ ప్రేమించేస్తారు తెలుసా. ఈ ప్రేమకు సరైన పోలిక... చిత్రకారులు. అదెలాగంటే ఖాళీ కాన్వాస్ మీద రంగులద్దేందుకు చిత్రకారులు ఎంతగా తపించిపోతారో అంతగా ఫ్యాషన్ డిజైనర్లు తెలుపు రంగును ప్రేమిస్తారన్నమాట. తెలుపురంగు మిగతా ఏ రంగులతో జతకట్టినా అందంగా కనిపించడమే ఇందుకు కారణం. ముత్యంలా మెరిసిపోయే స్వచ్ఛమైన తెలుపు రంగుకు గులాబీ రంగు అద్దితే యువతుల చెక్కిళ్లు తలపుకొస్తాయి. ఎరుపు రంగు అద్దితే నుదిటిమీద కుంకుమ నాట్యమాడుతున్నట్టు ఉంటుంది. పసుపు రంగు అద్దితే ఇంటి వాకిలి గడప ఆనందాల స్వాగతాలు పలికినట్టే అనిపిస్తుంది. అదే ఆకుపచ్చ రంగుతో కలిస్తే ప్రకృతి ఒడిలో సేదతీరిన భావనే కలుగుతుంది. ఇలా తెలుపు రంగును ఏ రంగుతో జత చేర్చినా మనసుకు హాయైన భావనలు కలగడం ఖాయం. ఒక్క మాటలో చెప్పాలంటే మనసు పలికే తెలుపు భావనలు ఎంతో అపురూపం. ఈ మధ్య జరిగిన ఒక పరిశోధన కూడా కాస్త అటుఇటుగా ఇదే అభిప్రాయాన్ని వ్యక్తపరిచింది.

తెలుపు రంగు వస్త్రాలు ధరిస్తే నిరాశా పూరిత భావాలు తగ్గుతాయనేది ఆ పరిశోధనా సారాంశం. మనసుకు హాయి కలిగించే మంత్రదండం తెలుపు రంగును ఆప్యాయంగా కౌగిలించుకోవడమే ఆలస్యం.



# ఎరుపు మెరుపు

బోల్డ్ ఈజ్ బ్యూటిఫుల్! అది రంగులకూ వర్తిస్తుంది. కాబట్టే ముదురు రంగులు ఫ్యాషన్ స్టేట్‌మెంట్‌గా మారాయి. మరీ ముఖ్యంగా ఎరుపు రంగు లేటెస్ట్ ఫ్యాషన్ ట్రెండ్! కాబట్టి రౌడీ రెడ్ స్టయిల్స్ ఫాలో అయిపోదాం!




### రెడ్ స్పెక్స్

కళ్లజోడు ఫ్రేములు ఇప్పుడు ఎన్నో రకాల్లో దొరుకుతున్నాయి. వీటిలో ఎరుపు రంగువి ఎంచుకుంటే అందర్లోకి ప్రత్యేకంగా కనిపిస్తాం! ఎరుపు రంగు ఎంత దూరం నుంచి అయినా కళ్లను ఆకర్షిస్తుంది కాబట్టి కళ్లజోడు మిస్ కాదు.

### లిప్‌స్టిక్

లేలేత పెదవులకు ఎర్రరంగు లిప్‌స్టిక్ మరింత అందాన్నిస్తుంది. అందులోనూ మాట్ టైప్ రెడ్ లిప్‌స్టిక్స్, నెయిల్ పాలిష్‌లు వేస్తే కిల్లింగ్ స్టయిల్!

### యాక్సెసరీస్

గొడుగు నల్లగానే ఎందుకుండాలి?

ఎరుపుది ఎంచుకుంటే అదొక ఆకర్షణ.

### రెడ్ షూస్

అటైర్‌లో ఆటిట్యూడ్ కనిపించాలంటే ఎరుపును జోడించాలి. కాంట్రాస్ట్‌గా రెడ్ కలర్ షూ, బ్యాగ్ మ్యాచ్ చేస్తే అదిరిపోతుంది.

### రెడ్ ఫ్రాక్

ఫ్రాకులు ఎరుపువైతే ఆ ఆకర్షణే వేరు. నలుగురిలో నదురుగా కనిపించాలనుకుంటే మోకాళ్ల వరకూ ఉండే రెడ్ ఫ్రాక్ ఎంచుకోవాలి. లాంగ్‌ఫ్రాక్‌ల స్టయిల్ కూడా బాగుంటుంది. అయితే వీటికి మ్యాచింగ్ నెయిల్ పాలిష్, ఐ షాడో తప్పనిసరి.





# సమ్మర్ స్టయిల్

హ్యాట్స్, గాగుల్స్ పెట్టుకుని సమ్మర్ ఫ్యాషన్‌కి షిఫ్ట్ అయిపోతారు చాలామంది అమ్మాయిలు. అంతవరకు ఓకే కాని సమ్మర్‌లో సింపుల్‌గా, స్టయిలిష్‌గా కనిపించాలంటే ఏం చేయాలి... అదింకా సింపుల్. ఈ ఫోటోల్లో కనిపిస్తున్న అమ్మాయికి మల్లే రెడీ అయిపోవాలి. క్యాప్రిలు, ట్రౌజర్స్... ఏవి వేసుకున్నా వాటిపై టీషర్ట్ వేసుకోవాలి. జుట్టు మెడ మీద పడి చిరాకు పెట్టకుండా తలకి ఒక పక్కగా హెయిర్ బ్యాండ్ పెట్టేయాలి. ఒకవేళ ఈ హెయిర్‌స్టయిల్ నచ్చకపోతే జుట్టు ముఖం మీదకి పడకుండా హ్యాట్‌తో మేనేజ్ చేసేయొచ్చు. ఈ డ్రస్సింగ్‌తో హాట్‌హాట్ సమ్మర్‌లో మరింత హాట్‌గా కనిపించడం ఖాయం.

# వన్ గ్రామ్ గోల్డ్ జువెలరీ...

వన్‌గ్రామ్ గోల్డ్ జువెలరీ... ఒకప్పుడు దిగువ మధ్యతరగతి ప్రజలకు మాత్రమే పరిమితమైన ఈ ఆభరణాలు ఇప్పుడు సంపన్న వర్గాల మహిళలను కూడా ఆకర్షిస్తున్నాయి. పార్టీలు, వేడుకల్లో అతివలు వీటినే వినియోగిస్తున్నారిప్పుడు. బంగారం ధరలు రోజూ రికార్డులను తాకుతున్నాయి. దీపావళి నాటికి 30 వేల రూపాయల మార్క్‌కు 10 గ్రాముల బంగారం చేరిపోతుందని నిపుణులు అంచనా వేస్తున్నారు. పెరుగుతున్న ధరలు ఒకవైపు ఆందోళన కలిగిస్తుంటే.. మరోవైపు చైన్ స్నాచర్‌లు, దొంగల భయం. బయటకు వెళ్లిన వారు మంగళ సూత్రాలతో సహా అయినా సురక్షితంగా ఇంటికి వస్తారన్న గ్యారంటీ లేదు.

ప్రతి రోజూ చైన్ స్నాచర్ల విజృంభణ చూస్తూనే ఉన్నాం. ఈ భయాలకు చెక్ పెడుతూనే అతివలకు కావాల్సిన డిజైన్స్‌లో లభిస్తూ స్టైలిష్‌గా మార్కెట్‌ను ఆక్రమిస్తున్నాయి వన్ గ్రామ్ గోల్డ్ ఆభరణాలు.యాంటిక్ నుండి స్లిమ్ ఫిట్ జువెలరీ వరకూ వేలాది మోడల్స్ వస్తున్నాయి. ఇక సినిమా, టీవీ సీరియల్స్‌లో ఓ ఆభరణం కనిపించింది అని అంటే.. మరుసటి రోజుకు ఆ ఆభరణం ప్రత్యక్షమవటం కూడా నగరంలో కనిపిస్తోన్న నయా ట్రెండ్.

### బంగారానికి ప్రత్యామ్నాయం...

సప్లయ్ తక్కువ కావడం.. డిమాండ్ పెరగడం.. ప్రభుత్వాలు విధించే పన్నులు.. వెరసి పసిడి ధరలు ఆకాశంలో పయణించడం మొదలుపెట్టాయి. మరి ప్రత్యామ్నాయం ఏమిటి..? ఆ ఆలోచనలో నుండి పుట్టుకు వచ్చిందే వన్ గ్రామ్ గోల్డ్. మెడలో వీసమెత్తు బంగారం లేకుండానా అనే వారు కూడా ఇప్పుడు ఈ వన్‌గ్రామ్ జువెలరీ మెరుపుల పట్ల ఆకర్షితులవుతున్నారు. దీనికి తోడు ఫ్యాషన్‌ల పట్ల మోజు ఎలాగూ ఉంది. తమ డ్రెస్‌కు మ్యాచ్ అయ్యే రీతిలో ఆభరణాలు ఉండాలని కోరుకుంటోన్న మహిళలు పెరిగారు. ఇటీవలి కాలంలో అతి ఎక్కువగా కనిపిస్తోన్న ట్రెండ్ నల్లపూసలు (బ్లాక్ బీడ్స్) ను కూడా వన్‌గ్రామ్ గోల్డ్‌తో చేసినవే వాడుతుండటం. దాదాపు 100కు పైగా డిజైన్స్ ఈ నల్లపూసల్లో లభిస్తున్నాయిప్పుడు. ఆఫీస్‌వేర్ కలెక్షన్‌గా ఎక్కువమంది అతివలు ఇష్టపడుతున్న పెండెంట్, ఇయర్ రింగ్స్, చైన్‌లు కూడా ఎన్నో వెరైటీల్లో లభిస్తున్నాయి. వన్‌గ్రామ్ గోల్డ్‌కు ఇటీవలి కాలంలో విపరీతమైన ఆదరణ లభిస్తోందంటున్నారు చిరాగ్ అలీ లేన్‌లోని సాయి పెరల్స్ అండ్ గిఫ్ట్స్ అధినేత రమేష్‌కుమార్.



సరిగ్గా చెప్పాలంటే పది పన్నెండేళ్ల నుంచీ వీటిని ఆదరిస్తున్నారు కానీ ఇటీవలికాలంలో డిమాండ్ పెరిగింది. కేవలం 100 రూపాయల నుంచే వీటి ధరలు ఉండటం.. గరిష్టంగా 25 వేల రూపాయలకు తల నుంచి పాదాల వరకూ కావాల్సిన జ్యుయెలరీ మొత్తం వైవిధ్యమైన డిజైన్లలో లభించటం.. వీటికి తోడు కనీసం ఆరు నెలల వారెంటీ... ఇవన్నీ ఇటు వైపు మహిళలు దృష్టి సారించేలా చేసునా్యయంటునా్రరు. అందుకే ఒకప్పుడు చిరాగ్ అలీ లేన్ లాంటి ప్రాంతాల్లో మాత్రమే కనిపించే ఈ ఆభరణాలు ఇప్పుడు ఫ్యాన్సీ షాపుల్లో కూడా కనిపిస్తున్నాయి. అయితే వన్‌గ్రామ్ గోల్డ్ ఆభరణాలను మాత్రమే అమ్మే షాప్‌లు హైదరాబాద్, సికిందరాబాద్‌లలోనే దాదాపు 500 వరకూ ఉన్నాయి. ఆబిడ్స్‌లోని చిరాగ్ అలీలేన్‌లోనే కనీసం 30 వరకూ ఈ తరహా ఆభరణాల షాపులు దర్శనమిస్తుండటం విశేషం.

### జాగ్రత్తలు తప్పనిసరి..


సాధారణంగా ఈ జువెలరీ ఓ సంవత్సరం పాటు అందాలను చిందిస్తాయి కానీ.. కొద్దిపాటి జాగ్రత్తలు తీసుకుంటే 10 సంవత్సరాలు కూడా పాడవకుండా ఉంటాయి. అలా ఎక్కువ కాలం మన్నాలంటే ఇలా చేయాల్సిందే అంటూ కొన్ని సూచనలు చేస్తున్నారు..

1 పాలిథిన్ కవర్ లేదా ప్లాస్టిక్ బాక్స్‌లలోనే వీటిని భద్రపరచాలి

2 ఆభరణాలను ధరించిన తరువాత ఫెర్ఫ్యూమ్‌లను ఎట్టి పరిస్థితుల్లోనూ స్ప్రే చేయకూడదు.

3 స్నానం చేసేటప్పుడు ఈ ఆభరణాలను ధరించకూడదు. సబ్బు నీళ్లు తగిలితే త్వరగా పాడయ్యే అవకాశం ఉందట.

4 అతి ఎక్కువ వేడి ఉన్న ప్రాంతాల్లో ఈ జువెలరీ వాడకపోవడం మంచిది. ఎక్కువ వేడి శరీరం తత్త్వం కలిగిన వాళ్లు ఈ తరహా జువెలరీ జోలికి వెళ్లకపోవడమే ఉత్తమం.



# మంగళవారం సినిమాకు అవార్డుల పంట

ఆర్ఎక్స్ 100', 'మహాసముద్రం' చిత్రాల తర్వాత అజయ్ భూపతి దర్శకత్వం వహించిన సినిమా 'మంగళవారం'. ఈ సినిమా ఒక సస్పెన్స్ థ్రిల్లర్ తో కూడి వున్న నేపథ్యంలో వచ్చింది. థియేటర్స్ లో విడుదలై అక్కడ మంచి విజయం సాధించిన ఈ చిత్రం ఇటీవల పాపులర్ ఓటిటి డిస్నీ హాట్ స్టార్ లో కూడా విడుదలై ప్రపంచవ్యాప్త ప్రేక్షకులని కూడా అలరిస్తోంది. మా 'మంగళవారం', టెక్నీషియన్స్ సినిమా అని గర్వంగా చెబుతున్నాను!' అని దర్శకుడు అజయ్ భూపతి సక్సెస్ మీట్ లో చెప్పింది నిజం చేస్తూ ప్రతిష్ఠాత్మకంగా జరిగే జైపూర్ ఫిలిం ఫెస్టివల్ లో ఈ సినిమా నాలుగు అవార్డులని గెలుచుకుంది. అందులో ఈ సినిమాలో ఒక బోల్డ్ పాత్రలో నటించిన పాయల్ రాజపుత్ కి వుత్తమ నటి అవార్డు దక్కింది. అలాగే ఈ సినిమా సాంకేతికపరంగా కూడా ఎంతో బాగుంది అని ఏకగ్రీవంగా అందరూ ఆమోదించారు. అందులో కూడా మూడు అవార్డులు ఈ సినిమా గెలుచుకుంది. చిత్ర నిర్మాతలు ముద్ర మీడియా వర్క్స్ స్వాతి రెడ్డి గునుపాటి, సురేష్ వర్మ ఈ విషయాన్ని సంతోషంగా చెబుతూ అవార్డులు గెలిచిన వారి పేర్లు వెల్లడించారు... ఉత్తమ సౌండ్ డిజైన్ - రాజా కృష్ణన్, ఉత్తమ ఎడిటింగ్ - గుళ్ళపల్లి మాధవ్ కుమార్ ఉత్తమ కాస్ట్యూమ్ డిజైన్ - ముదసర్ మొహమ్మద్, సాంకేతిక పరంగా, నిర్మాణ పరంగా మంచి విలువలున్న చిత్రంగా 'మంగళవారం' ఇప్పటికే ప్రశంసలు అందుకోగా ఈ అవార్డులు కేవలం ఆరంభం మాత్రమేని తమ ఆనందం వ్యక్తం చేసారు చిత్ర దర్శకుడు,

# మరింత చురకుగా సమంత

అగ్ర నటీమణుల్లో ఒకరైన సమంత ఎయిర్ పోర్టు నుండి వస్తున్నప్పుడో, వెళుతున్నప్పుడో ఫోటోలు సామజిక మాధ్యమాల్లో వైరల్ అవుతూ ఉంటాయి. సమంత మయోసిటిస్ అనే వ్యాధితో బాధపడుతూ అందుకోసమని ఇప్పుడు విశ్రాంతి తీసుకుంటున్న సంగతి కూడా తెలిసిందే. ఆమె చివరి సినిమా 'ఖుషి' విడుదలైంది, ఆ తరువాత ఆమె సినిమాలు ఏమీ కొత్తవి ఒప్పుకోలేదు, కానీ నిర్మాతగా కొన్ని సినిమాలు చేస్తాను అని చెప్పారు. ఈమె చెయ్యాల్సిన సినిమా ఒకటి ఇప్పుడు శృతి హాసన్ చేస్తున్నారు. అంటే సమంత ఇప్పట్లో సినిమాలు చేసే పరిస్థితి కనిపించడం లేదు అని తెలుస్తోంది. అయితే ఇంతకీ సమంత మళ్ళీ వెండితెర మీద కనిపించదా, అనే సందేహం కూడా ఆమె అభిమానుల్లో చోటుచేసుకుంటోంది. ఎందుకంటే ఆమె చివరి సినిమా 'ఖుషి' గత సంవత్సరం సెప్టెంబర్ 1న విడుదలైంది. ఆ సినిమా విడుదలవ్వకముందే సమంత అమెరికా వెళ్లి అక్కడ విశ్రాంతి తీసుకుంది. మళ్ళీ ఇండియా వచ్చింది, ఇక్కడ సినిమాలు చెయ్యడం లేదు కానీ, చాల చురుకుగా సామజిక మాధ్యమాల్లోనూ, అలాగే కొన్ని షోస్‌లో కనపడుతూ అభిమానులను అలరిస్తున్నారు.



# నటి కీర్తి సురేశ్‌కు భారీ ఫ్యాన్స్ ఫాలోయింగ్

మహానటి సినిమాతో దేశవ్యాప్తంగా బాగా క్రేజ్ తెచ్చుకున్న కీర్తి సురేష్ కెరీర్ ఒక్క అడుగు ముందుకేస్తే రెండడుగులు వెనుకకు అన్నట్లుగా ఉంది. 2023లో తెలుగులో దసరా, భోళా శంకర్ రెండు సినిమాలు, తమిళంలో మామన్నన్ అనే మూడు సినిమాలు చేయగా ఈ యేడు తెలుగులో ఇప్పటికీ ఒక్క సినిమా కూడా సంతకం చేయకపోవడం గమనార్హం. గర్ల్ నెక్ట్స్ డోర్ వంటి క్యారెక్టర్లతో మొదలు పెట్టి నిత్యం వైవిధ్యభరిత పాత్రలను చేసుకుంటూ తనకంటూ ఓ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న ఈ ముద్దుగుమ్మ ప్రస్తుతం బాలీవుడ్ మీద దృష్టి పెట్టింది. ఇప్పటికే తేరి అనే తమిళ సినిమా బాలీవుడ్ రిమేక్ బేబీ జాన్‌లో వరుణ్ దావన్‌తో కలిసి నటిస్తుండగా, ఓ వెబ్ సిరీస్‌లోనూ నటిస్తోంది. అదే విధంగా తమిళంలో రఘు తాత, రివాల్వర్ రిటా, సైరెన్, కన్నివేడి వంటి నాలుగు చిత్రాలలో నటిస్తోంది కీర్తి సురేష్ . ఇప్పటివరకు సౌత్ ఇండియా అన్ని ఇండస్ట్రీలలోను మంచి పాపులారిటీని సంపాదించుకున్న ఈ నటికి ఫ్యాన్ బేస్ భారీగానే ఉండగా సోషల్ మీడియాలోను చాలా యాక్టివ్‌గా ఉంటుంది. అయితే ఈ ఫ్యాన్స్ విషయంలోనే తాజాగా ఓ వార్త నెట్టింట బాగా వైరల్ అవుతున్నది.విషయానికి వస్తే.. కృష్ణ అనే ఓ వీరాభిమాని కీర్తికి డైహార్డ్ ఫ్యాన్. ఈ క్రమంలో కీర్తికి సోషల్‌మీడియా ప్లాట్ ఫాం ఎక్స్‌లో ఇప్పటివరకు 233 లేఖలు రాయడమే కాకుండా వాటికి రిప్లై ఇవ్వాలని చాలాసార్లు కోరాడు. చివరకు 234వ లెటర్‌కు స్పందించిన కీర్తి ఇంత ఆలస్యంగా సమాధానం ఇచ్చినందుకు క్షమాపణలు కోరింది. మీలాంటి అభిమాని నాకు లభించడం నా అదృష్టం అని, ఆ నెంబర్ నాకు ఫాంటసీ నెంబర్ అని చెప్పి తన అభిమానిని ఖుషీ చేసింది. సడన్‌గా కీర్తి ఓ ఫ్యాన్ కామెంట్స్‌ను చదివి సమాధానం ఇవ్వడంతో ఆమె ఫ్యాన్స్ చాలా హ్యాపీగా ఫీలవుతూ ఆమె ట్వీట్‌ను రీ ట్వీట్ చేస్తున్నారు.






# కంగువలో విలన్ పాత్ర పోస్టర్ విడుదల

ప్రస్తుతం చాలావరకు హీరోలు పాన్ ఇండియా ప్రాజెక్ట్స్‌పై ఫోకస్ పెడుతున్నారు. పైగా ఈ ప్రాజెక్ట్స్ తెరకెక్కించే క్రమంలో బ్జడెట్ విషయంలో కూడా ఏ మాత్రం కాంప్రమైజ్ అవ్వడం లేదు. అలాంటి హీరోల్లో సూర్య కూడా ఒకరు. ప్రస్తుతం సూర్య 'కంగువ' అనే పాన్ ఇండియా ప్రాజెక్ట్‌లో నటిస్తున్నాడు. ఇప్పటివరకు 'కంగువ' నుంచి విడుదలయిన ప్రతీ గ్లింప్స్, పోస్టర్స్.. సినిమాపై ఆసక్తిని మరింతగా పెంచేశాయి. ఇందులో సూర్య.. మునుపెన్నడూ కనిపించని అవతారంలో కనిపించి అందరినీ ఆశ్చర్యపరుస్తున్నాడు. ఇక ఈ సినిమాలో విలన్ ఎవరో తాజాగా రివీల్ చేశారు మేకర్స్. శివ దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'కంగువ'లో టైటిల్ రోల్ ప్లే చేస్తున్నాడు సూర్య. ఇక తనను ఢీ కొట్టే విలన్ పాత్రలో బాలీవుడ్ నటుడు బాబీ డియోల్ నటిస్తున్నట్టు మేకర్స్ తాజాగా రివీల్ చేశారు. జనవరి 27న బాబీ డియోల్ పుట్టినరోజు కావడంతో 'కంగువ'లో విలన్ తానే అని చెప్తూ ఒక స్పెషల్ పోస్టర్‌ను రిలీజ్ చేశారు. ఇందులో బాబీ.. ఉధిరన్ అనే పాత్రలో నటిస్తున్నట్టు తెలుస్తోంది. హీరో సూర్య కూడా బాబీ డియోల్‌కు బర్త్ డే విషెస్ చెప్తూ.. ఈ పోస్టర్‌ను తన సోషల్ మీడియాలో షేర్ చేశాడు. 'హ్యాపీ బర్త్ డే బాబీ డియోల్ బ్రదర్. మీ ఫ్రెండ్‌షిప్‌కు థాంక్యూ. కంగువలో గొప్ప ఉధిరన్‌లాగా కనిపించడం కోసం మీ ట్రాన్స్ఫార్మేషన్ అదిరిపోయింది. ప్రేక్షకులందరూ ఆయన కోసం ఎదురుచూడండి' అనే క్యాప్షన్‌తో లుక్‌ను ట్వీట్ చేశాడు సూర్య.

## ఆగస్ట్‌లో విడుదలకు సిద్ధంగా పుష్ప-2

టాలీవుడ్‌లో రాబోతున్న మోస్ట్ అవెయిటెడ్ సినిమాల్లో ఒకటి 'పుష్ప.. ది రూల్'. సుకుమార్ దర్శకత్వంలో తెరకెక్కి బ్లాక్ బస్టర్ హిట్‌గా నిలిచిన పుష్ప.. ది రైజ్‌కు సీక్వెల్‌గా వస్తున్న ఈ మూవీలో ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ పుష్పరాజ్‌గా మరోసారి ఎంటర్‌టైన్ చేసేందుకు రెడీ అవుతున్నాడు. ఇండిపెండెన్స్ డే సందర్భంగా ఆగస్టు 15న విడుదల చేస్తున్నట్టు ఇప్పటికే ప్రకటించేశారు మేకర్స్. ఈ సందర్భంగా పుష్ప రాజ్ తన రూల్‌ను ప్రారంభించడానికి ఇంకా 200 రోజులు మిగిలి ఉందంటూ మేకర్స్ కొత్త పోస్టర్‌ను విడుదల చేశారు. ఇక ఈ పోస్టర్‌లో ఒక కొండపై పులి కనిపిస్తున్నట్లు ఉంది. కాగా ప్రస్తుతం ఈ పోస్టర్ నెట్టింట వైరల్‌గా మారింది. ÷ఎప్ప.. ది రూల్ కోసం రాక్ స్టార్ దేవీ శ్రీ ప్రసాద్ నుంచి ఫస్ట్ పార్టును మించిపోయే మరో చార్ట్ బస్టర్ ఆల్బమ్ రాబోతుందని ఇన్‌సైడ్ టాక్. ఈ మూవీని మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్ భారీ బ్జడెట్‌తో తెరకెక్కిస్తోంది. ఫస్ట్ పార్టులో శ్రీవల్లిగా నటించిన కన్నడ సోయగం రష్మిక మందన్నా సీక్వెల్‌లో మరోసారి ఫీ మేల్ లీడ్ రోల్‌లో కనిపించనుంది.



# ఊరిపేరు భైరవకోన విడుదల తేదీల్లో మార్పు

సంక్రాంతి పండగ నాడు నాలుగు సినిమాలు విడుదలయ్యాయి. అయితే అప్పుడు ఐదో సినిమా రవితేజ నటించిన 'ఈగల్' కూడా విడుదలవ్వాల్సి వుంది కానీ, నిర్మాతల మండలి, తెలుగు ఫిలిం ఛాంబర్ అఫ్ కామర్స్ ఆ సినిమా నిర్మాతల మధ్య సయోధ్య కుదిర్చి 'ఈగల్' సినిమాని వాయిదా వేసుకోమని చెప్పారు. అప్పుడు పోటీ లేకుండా చేస్తామని కూడా ఆ సినిమా నిర్మాతకి హామీ ఇచ్చారు. తరువాత 'ఈగల్' ఫిబ్రవరి 9న విడుదల చెయ్యాలని నిర్ణయించుకొని ఆ తేదీని ప్రకటించారు. కార్తీక్ ఘట్టమనేని దర్శకుడు, పీపుల్స్ మీడియా ఫ్యాక్టరీ నిర్మాణ సంస్థ. తరువాత సందీప్ కిషన్ తన సినిమా 'ఊరి పేరు భైరవకోన' అనే సినిమాని ఫిబ్రవరి 9న విడుదల చేస్తున్నట్టుగా ప్రకటించారు. ఈ సినిమాకి నిర్మాత రాజేష్ దండా, దర్శకుడు విఐ ఆనంద్. ఇది ఒక ఫాంటసీ నేపథ్యంలో తీసిన సినిమా. ఈ సినిమా ప్రచారాలు కూడా మొదలెట్టేసారు, ఫిబ్రవరి 9 తప్పితే మాకు ఇంకా వేరే తేదీ లేదు విడుదల చెయ్యడానికి అని కూడా ఒక ప్రచార ఈవెంట్ లో చెప్పేసాడు సందీప్ కిషన్. ఇది తెలిసి పీపుల్స్ మీడియా ఫ్యాక్టరీ కొన్ని రోజుల క్రితం, నిర్మాతల మండలికి, తెలుగు ఫిలిం ఛాంబర్ అఫ్ కామర్స్ కి ఒక లేక రాశారు. అందులో తన సినిమా 'ఈగల్' విడుదలప్పుడు పోటీ లేకుండా చేస్తామని మాటిచ్చారు, ఆ మాట నిలబెట్టుకోండి అని చెప్పారు. అందుకోసమని ఈరోజు నిర్మాతల మండలి, తెలుగు ఫిలిం ఛాంబర్ అఫ్ కామర్స్ సమావేశం నిర్వహిస్తున్నారు. అందులో 'ఊరు పేరు భైరవకోన' సినిమా విడుదల వాయిదా వేసుకోమని ఆ సినిమా నిర్మాతకి చెపుతారని తెలిసింది. అతను కూడా ఇంకో కొత్త విడుదల తేదీని ప్రకటించనున్నారని కూడా తెలిసింది.



## టిటిడి వార్షిక బడ్జెట్ రూ.5,122.80 కోట్లకు పాలకవర్గం ఆమోదం

**తిరుమల జనవరి 29 (వెలుతురు):** తిరుమల తిరుపతి దేవస్థానం వార్షిక బడ్జెట్ రూ.5వేలకోట్లు దాటింది. రూ.5,141.74 కోట్ల అంచనాలతో 2024–25 వార్షిక బడ్జెట్‌ను ప్రవేశపెట్టగా.. రూ.5,122.80 కోట్ల బడ్జెట్‌కు పాలకవర్గం ఆమోదించింది. ఇంజినీరింగ్ విభాగానికి రూ.350 కోట్లు, హిందూ ధర్మప్రచార, అనుబంధ ప్రాజెక్టులకు రూ.108.50 కోట్లు కేటాయించారు. వివిధ సంస్థలకు గ్రాంట్స్ రూపంలో రూ.113.50 కోట్లు, రాష్ట్ర ప్రభుత్వానికి సహకారం రూపంలో రూ.50 కోట్లు, టీటీడీ విద్యాసంస్థలు, పలు వర్సిటీలకు గ్రాంట్స్ రూ.173.31 కోట్లు, పారిశుధ్య విభాగానికి రూ.261.07 కోట్లు, నిఘా– భద్రతా విభాగానికి రూ.149.99 కోట్లు, వైద్య విభాగానికి రూ.241.07 కోట్లు కేటాంచారు.ఆదాయం అంచనాలో శ్రీవారి హుండీ కానుకల ద్వారా రూ. 1,611 కోట్లు, ఫిక్స్‌డ్ డిపాజిట్లపై వడ్డీ రూపంలో రూ.1,167 కోట్లు, ప్రసాదం విక్రయాల ద్వారా రూ.600 కోట్లు, కల్యాణకట్ట రసీదుల ద్వారా రూ.151.50 కోట్లు, గదులు, కల్యాణమండపం బాడుగల ద్వారా రూ.147 కోట్లు, శ్రీవారి దర్శనం, ఆర్జిత సేవ టికెట్ల విక్రయాల ద్వారా రూ.448 కోట్లు ఆదాయం సమకూరుతుందని అంచనా వేశారు.ఇదిలా



ఉండగా.. లడ్డు ట్రే మోసే కార్మికుల వేతనాలు రూ.15 వేలు అదనంగా పెంచుతూ నిర్ణయం తీసుకున్నారు. వేద పాఠశాలల్లో 51 మంది సంభావన అధ్యాపకుల వేతనాలు రూ.34 వేల నుంచి రూ.54 వేలకు పెంచారు. టీటీడీ ఆధ్వర్యంలో నడుస్తున్న 60 ఆలయాల్లో పని చేసేందుకు కొత్త పోస్టుల మంజూరుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాలని టీటీడీ పాలక మండలి నిర్ణయించింది. 3, 4, 5వ తేదీల్లో ధార్మిక సదస్సును నిర్వహిస్తున్నట్లు పాలకమండలి చైర్మన్ కరుణాకర్‌రెడ్డి తెలిపారు. సదస్సుకు 57 మంది మఠాధిపతులు, పీఠాధిపతులు హాజరవుతారని తెలిపారు. సలహాలు, సూచనలను స్వీకరించి అమలు చేస్తామని భూమన వివరించారు.

## సుప్రీంకోర్టులో చంద్రబాబుకు ఊరట

### బెయిల్ రద్దు పిటిషన్‌ను కొట్టేసిన ధర్మాసనం

**న్యూఢిల్లీ,జనవరి 29 వెలుతురు:** సుప్రీంకోర్టులో టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడుకి ఊరట లభించింది. ఐఆర్ఆర్ కేసులో సోమవారం ధర్మాసనం విచారణ జరిపింది. చంద్రబాబు ముందస్తు బెయిల్ రద్దు చేయాలంటూ దాఖలైన పిటిషన్‌ను న్యాయస్థానం తోసిపుచ్చింది. కనీసం నోటీసులు కూడా ఇవ్వాల్సిన అవసరం లేదని అభిప్రాయపడింది. గతంలో సుప్రీంకోర్టు ఇదే కేసులో దాఖలు చేసిన ఎస్ఎల్‌పీని రద్దు చేసిన నేపథ్యంలో చంద్రబాబు బెయిల్ రద్దు పిటీషన్‌ను విచారించాల్సిన అవసరం లేదని సుప్రీం దర్మాసనం స్పష్టం చేసింది. ఐఆర్ఆర్ కేసులో చంద్రబాబు ముందస్తు బెయిల్ రద్దుకు సుప్రీంకోర్టు నిరాకరించింది. బెయిల్ రద్దు చేయాలని కోరుతూ ఏపీ ప్రభుత్వం వేసిన పిటిషన్ ను సర్వోన్నత న్యాయస్థానం కొట్టేసింది. ఇదే కేసులో సహ నిందితులపై ఉన్న ఉత్తర్వులు చంద్రబాబుకూ వర్తిస్తాయని తెలిపింది. 420 సెక్షన్ చంద్రబాబుకు ఎలా వర్తిస్తుందని జస్టిస్ సంజీవ్ ఖన్నా ప్రశ్నించారు. 17 ఏ సెక్షన్‌తో ఈ కేసుకు కూడా సంబంధం ఉందా? అని ధర్మాసనం నిలదీసింది. ఇన్నర్ రింగ్ రోడ్ కేసులో చంద్రబాబు ముందస్తు బెయిల్ రద్దు పిటిషన్‌పై సోమవారం విచారణ జరిగింది. కాగా ఐఆర్ఆర్ కేసులో ఏపీ హైకోర్టు చంద్రబాబుకు ముందస్తు బెయిల్ మంజూరు చేసిన విషయం తెలిసిందే. దీంతో ఏపీ ప్రభుత్వం హైకోర్టు తీర్పును సుప్రీం కోర్టులో సవాలు చేసింది. జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ దత్తా నేతృత్వంలోని ధర్మాసనం విచారణ జరిపింది. న్యూఢిల్లీ: సుప్రీంకోర్టులో ఏపీ సీఎం జగన్మోహన్ రెడ్డికి ఎదురుదెబ్బ తగిలింది. టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడుకి ఊరట లభించింది. ఐఆర్ఆర్ కేసులో సోమవారం ధర్మాసనం విచారణ జరిపింది. చంద్రబాబు ముందస్తు బెయిల్ రద్దు చేయాలంటూ దాఖలైన పిటిషన్‌ను న్యాయస్థానం తోసిపుచ్చింది. కనీసం నోటీసులు కూడా ఇవ్వాల్సిన అవసరం లేదని అభిప్రాయపడింది. గతంలో సుప్రీంకోర్టు ఇదే కేసులో దాఖలు చేసిన ఎస్ఎల్‌పీని రద్దు చేసిన నేపథ్యంలో చంద్రబాబు బెయిల్ రద్దు పిటీషన్‌ను విచారించాల్సిన అవసరం లేదని సుప్రీం దర్మాసనం స్పష్టం చేసింది.

## కెటిఆర్, బండిల మధ్య మాటల యుద్ధం

### పరస్పర విమర్శలతో వేడెక్కుతున్న రాజకీయం

**హైదరాబాద్,జనవరి29వెలుతురు:** కేటీఆర్, బండి మధ్య మాటల యుద్ధం తారాస్థాయికి చేరింది.మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కౌంటర్లు.. బీజేపీ ఎంపీ బండి సంజయ్ ప్రతికౌంటర్లతో కరీంనగర్ రాజకీయాలు వేడెక్కుతున్నాయి. పార్లమెంట్ ఎన్నికలే టార్గెట్‌గా బీఆర్ఎస్, బీజేపీ పార్టీలు ఒకరిపై ఒకరు నిప్పులు చెరుగుతున్నాయి. తాజాగా మరోసారి కేటీఆర్‌పై బండి సంజయ్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. పనిలో పనిగా మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌పైనా వ్యాఖ్యలు చేశారు. నేను మఠం పెట్టుకుంటే.. మీ అయ్య బార్ పెట్టుకుంటాడా.. నువ్వు మసీదు పెట్టుకుని నమాజ్ చేసుకుంటూ ఉండు' అంటూ కేటీఆర్‌పై సెటైర్ విసిరారు. యాదాద్రిని వ్యాపార కేంద్రం చేశారని మండిపడ్డారు. కరీంనగర్ బీఆర్ఎస్ అభ్యర్థి నాస్తికుడని.. కేటీఆర్ కూడా నాస్తికుడే అని అన్నారు. కరీంనగర్ బీఆర్ఎస్ అభ్యర్థి పెద్ద మేధావిలాగా ఫోజ్ కొడతారని బండి సంజయ్ దుయ్యబట్టారు. బండి సంజయ్ ఇంకా మాట్లాడుతూ... జీపీలకు బీఆర్ఎస్ ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదన్నారు. కేంద్రం ఇచ్చిన నిధులను దారి మళ్లించారని ఆరోపించారు. సర్పంచ్‌లు అప్పుల పాలయ్యారని... సర్పంచ్‌ల ఆందోళనకు మద్దతు ఇస్తామన్నారు. సర్పంచ్‌లతో పనులు చేయించి.. బిల్లులు ఇవ్వలేదన్నారు. గత ప్రభుత్వం పేరు చెప్పి.. ఈ ప్రభుత్వం తప్పించుకోవద్దని హితవుపలికారు. సర్పంచ్‌ల సమస్యలపై అడిగే హక్కు బీఆర్ఎస్‌కు లేదన్నారు. బీఆర్ఎస్ కొత్త డ్రామా మొదలు పెట్టిందన్నారు. తెలంగాణలో పది ఎంపీ సీట్లు గెలుస్తామని బండి సంజయ్ ధీమా వ్యక్తం చేశారు.

## అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొన్న బస్సు

### తృటిలో ప్రయాణికులకు తప్పిన ముప్పు

**యాదాద్రి భువనగిరి,జనవరి 29 వెలుతురు:** ఆర్టీసీ బస్సు అదుపు తప్పి డివైడర్‌పై దూసుకు పోయింది. ఈ సంఘటన ఆలేరు లోని హైదరాబాద్– వరంగల్ జాతీయ రహదారిపై గల కందిగడ్డ తండా శివారులో సోమవారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. హైదరాబాద్ నుంచి వరంగల్ వెళ్తున్న జనగామ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు అదుపుతప్పి డివైడర్ పై దూసుకుపోయింది. ప్రమాదం జరిగిన సమయంలో బస్సులో 40 మంది ప్రయాణికులు ఉండగా కొద్ది మంది స్వల్ప గాయాలతో బయటపడ్డారు. క్షతగాత్రులను దవాఖానకు తరలించి ప్రయాణికులను మరో బస్సులో పంపించారు. తృటిలో పెను ప్రమాదం తప్పడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

## హార్టికల్చర్ హబ్‌గా అశ్వారవు పేట

### ఆయిల్ పామ్ పరిశ్రమకు చేయూత: తుమ్మల

**కొత్తగూడెం,జనవరి29వెలుతురు:** ఆయిల్‌పామ్ పరిశ్రమలో రూ.30 కోట్లతో బయోవిద్యుత్ ప్లాంట్‌ను ఏర్పాటు చేస్తామని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. దీంతో సంస్థపై కరెంటు భారం తగ్గుతుందని చెప్పారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని అశ్వారావుపేటను హార్టికల్చర్ హబ్‌గా మార్చడమే తన లక్ష్యమని మంత్రి తుమ్మల అన్నారు.అశ్వారావుపేటలోని పామాయిల్ పరిశ్రమను ఆయన సందర్శించారు. అనంతరం మాట్లాడుతూ.. విద్యుత్ ఎ÷–లాంటు నిర్మాణాన్ని మే నెలలోపు పూర్తిచేసి అందుబాటులోకి తీసుకువస్తామన్నారు. ఈ మేరకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. మాయిల్‌లో అంతర పంటల సాగుతో రైతులకు మేలు జరుగుతుందని చెప్పారు. ఈ ప్రాంతం కొబ్బరి, జాజి, మిరియాలు, వక్క తదితర పంటలకు చాలా అనువుగా ఉందని, ప్రభుత్వం నుంచి రైతులకు అవసరమైన సహకారాన్ని అందిస్తామని వెల్లడించారు. అశ్వారావుపేట వ్యవసాయ కళాశాలలో హార్టికల్చర్ కోర్సులు ఉండేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ విషయమై త్వరలోనే వీసీతో చర్చిస్తానని తెలిపారు.

## చంద్రబాబుకు తృటిలో తప్పిన ప్రమాదం...

### రాజమండ్రిలో రా కదలిరా సభ

### కిందపడబోగా పట్టుకుని కాపాడిని భద్రతాసిబ్బంది

**రాజమండ్రి,జనవరి29వెలుతురు:** టీడీపీ అధినేత చంద్రబాబుకు తృటిలో ప్రమాదం తప్పింది. రాజమండ్రిలోని కాతేరులో సోమవారం టీడీపీ 'రా.. కదలిరా' సభలో ఆయన కింద పడబోగా భద్రతా సిబ్బంది పట్టుకున్నారు. రాజానగరం టికెట్ ను జనసేనకు కేటాయించడంపై బొడ్డు వెంకటరమణ వర్గీయులు ఆందోళనకు దిగారు. ఈ క్రమంలో సభలో గందరగోళం నెలకొంది. స్టేజ్ పై నుంచి చంద్రబాబు దిగుతుండగా.. కార్యకర్తలు దూకుడుగా దిగడంతో ఆయన తూలి కింద పడబోయారు. వెంటనే అప్రమత్తమైన భద్రతా సిబ్బంది ఆయన్ను పట్టుకున్నారు. కార్యకర్తల తీరుపై చంద్రబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. సంయమనం పాటించాలని సూచించారు. టీడీపీ అధినేత చంద్రబాబు ఇటీవలే మండపేట, అరకు స్థానాలకు అభ్యర్థులను ప్రకటించారు. అయితే, తమతో ఎలాంటి సంప్రదింపులూ చేయకుండానే ఏకపక్షంగా ఈ ప్రకటన చేశారని జనసేనాని పవన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మండపేటలో టీడీపీ అభ్యర్థిని ప్రకటించడం బాగా లేదన్నారు. తాను రాష్ట్రాన్ని యూనిట్‌గా చూస్తానని.. దీని వల్ల కొన్నిసార్లు ఇబ్బంది కలగవచ్చని అన్నారు. పొత్తు ధర్మం ప్రకారం ఆ స్థానాలు ప్రకటించకుండా ఉండాల్సిందనే అభిప్రాయాన్ని పవన్ వ్యక్తం చేశారు. లోకేష్ సీఎం పదవి గురించి మాట్లాడిన తాను పట్టించుకోలేదన్న



జనసేనాని.. చంద్రబాబు నన్ను అడగకుండా రెండు సీట్లు ప్రకటించారు కాబట్టి తాను రెండు సీట్లు ప్రకటిస్తానని అన్నారు. అందుకు అనుగుణంగానే రాజోలు, రాజానగరంలో జనసేన పోటీ ఉంటుందని స్పష్టం చేశారు. పవన్ ప్రకటనతో రాజానగరం నియోజకవర్గంలో టీడీపీ నేతలు ఆందోళన చెందారు. దీనిపై టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడును ఇటీవల కలవగా.. ఆయన చంద్రబాబు సరైన నిర్ణయం తీసుకుంటారని నేతలకు సర్ది చెప్పి పంపించారు. అయితే, సోమవారం కాతేరు 'రా.. కదలిరా' సభలో దీనిపైనే గందరగోళం నెలకొంది. రాజానగరం నియోజకవర్గ టికెట్ ను జనసేనకు కేటాయించడంపై బొడ్డు వెంకటరమణ వర్గీయులు అసంతృప్తి వ్యక్తం చేశారు. రాజానగరం అసెంబ్లీ స్థానంలో టీడీపీయే పోటీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ విషయమై ప్రకటన చేయాలని పట్టుబట్టారు.అయితే ఈ విషయమై కార్యకర్తలకు చంద్రబాబు సర్దిచెప్పే ప్రయత్నం చేశారు. స్టేజీపై ఉన్న కార్యకర్తలకు పార్టీ సీనియర్లు కూడా సర్దిచెప్పే ప్రయత్నం చేశారు. అయితే, వెంకటరమణ వర్గీయులు స్టేజీపై ఒక్కసారి తోసుకువచ్చారు. మరోవైపు, జనసేన, టీడీపీ నేతలు పోటాపోటీగా నినాదాలు చేయడంతో గందరగోళం నెలకొంది. ఈ క్రమంలోనే టీడీపీ కార్యకర్తలు ఒక్కసారి గా దూకుడుగా దిగడంతో చంద్రబాబు పట్టు తప్పి కింద పడబోయారు. భద్రతా సిబ్బంది అప్రమత్తతతో ప్రమాదం తప్పింది. అటు, కాతేరు సభకు 7 నియోజకవర్గాల నుంచి భారీగా జనం తరలివచ్చారు. టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు యనమల రామకృష్ణుడు, మాజీ డిప్యూటీ సీఎం నిమ్మకాయల చినరాజప్ప, రాజమండ్రి రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి, మాజీ మంత్రులు కేఎస్ జవహర్, పత్తిపాటి పుల్లారావు సభా ఏర్పాట్లను పర్యవేక్షించారు.

## మాయమాటలతో వృద్ధుడికి టోకరా

### బంగారు గొలుసుతో ఉడియించిన లేడీలు

### రంగంలోకి దిగి పట్టుకున్న పోలీసులు

**హైదరాబాద్,జనవరి29వెలుతురు:** ఇద్దరు మహిళలు బ్యూటీ పార్లర్‌లో పనిచేస్తూ..ఓ వృద్ధుడిని మోసగించి అడ్డంగా దొరికి పోయారు. ఇద్దరూ ఓ పార్లర్‌లో బ్యూటీషియన్లుగా పని చేస్తున్నారు. చివరకు వారిద్దరూ జైల్లో ఊచలు లెక్కించాల్సి వచ్చింది. హైదరాబాద్‌లోని నాగోల్‌లో వృద్ధుడిపై వలపు వల విసిరి.. బంగారు గొలుసు కొట్టేసిన ఇద్దరు కిలాడీ లేడీలను అరెస్ట్ చేశారు పోలీసులు. వృద్ధుడి ఇంటికొచ్చి.. అతన్ని మాటల్లో పెట్టి బంగారు చైన్‌ను దొంగిలించారు. వృద్ధుడి ఫిర్యాదుతో రంగంలోకి దిగిన పోలీసులు.. మాయలేడీలను మాటు వేసి పట్టుకున్నారు. మేడ్చల్‌కు చెందిన పసుపులేటి శిరీష(36), ఎన్టీఆర్‌నగర్‌కు చెందిన ఉన్నీసా బేగం అలియాస్ సమీనా (40). ఇదదరూ బ్యూటీషియన్లుగా పని చేస్తూనే.. ఘరానా మోసాలకు పాల్పడుతున్నారు. చేసే పనితో వస్తున్న డబ్బులు చాలక.. సులువుగా సంపాదించేందుక మాస్టార్ ప్లాన్స్ వేస్తుండే వారు. ఈ క్రమంలోనే.. వీరిద్దరికీ నాగోలు మత్తుగూడ సమీపంలోని ఓ హోటల్‌లో ఇటీవల ఓ వృద్ధుడితో పరిచయం ఏర్పడింది. ఫోన్ ద్వారా వీరిద్దరూ ఆ వృద్ధుడితో రొమాంటిక్‌గా మాట్లాడుతూ వలపు వల విసిరారు. ఈ క్రమంలోనే హోటల్‌కు రమ్మని అతన్ని పిలిచారు. అయితే, ఇంట్లో ఎవరూ లేరని, మీరే రావాలంటూ ఇద్దరు మహిళలకు వృద్ధుడు చెప్పాడు. దాంతో ఇద్దరు మహిళలు.. అతని ఇంటికి వెళ్లారు. అతన్ని మాటల్లో పెట్టి మెడలోంచి 2 తులాల బంగారం చైన్ లాక్కొని పరారయ్యారు. దీంతో ఖంగుతిన్న వృద్ధుడు.. పోలీసులను ఆశ్రయించాడు. జరిగిన విషయాన్ని పోలీసులకు చెప్పాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు.. వృద్ధుడి వద్ద నుంచి దోచుకున్న బంగారు గొలుసు స్వాధీనం చేసుకుని, నిందితులను అరెస్ట్ చేశారు.

## ఆందోళనలతో ప్రభుత్వ వ్యతిరేకత

### ప్రజల సమస్యలపై నిర్లక్ష్య వైఖరి

### ఎన్నికల్లో ప్రభావం చూపనున్న కార్మిక సంఘాలు

**విజయవాడ,జనవరి29వెలుతురు:** ఎపిలో ఇటీవలి వరుస ఆందోళనలు అధికార వైసిపిపై తీవ్ర వ్యతిరేకతను చాటాయి. ఈ ప్రభుత్వం తమను పట్టించుకోదన్న వైఖరిలో పలు రంగాలు ఉన్నాయి. మరింత మెరుగైన వేతనాలు, ప్రయోజనాలు కావాలని వివిధ విభాగాలకు చెందిన వేలాదిమంది కార్మికులు డిమాండ్ చేస్తున్నారు. అనేక సంఘాలు ఇప్పటికే నిరసనలకు దిగడమో లేదా ఎన్నికల్లోగా ఆందోళనలు చేపట్టడానికి ప్రణాళికలు రూపొందించడమో చేస్తున్నాయి. వారి డిమాండ్లను పరిశీలిస్తామని ప్రభుత్వం హామీ ఇవ్వడంతో వారిలో కొంతమంది మాత్రమే తాత్కాలికంగా తమ ఆందోళనలను ఆపారు. అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు సైతం ప్రభుత్వంతో కొంత కాలంగా పోరాడు తున్నారు. ఎస్మాను ప్రయోగించడం ద్వారా ఆందోళనలను అణగదొక్కేందుకు ప్రభుత్వం ప్రయత్నించింది. కానీ అంగన్‌వాడీలు తమ పట్టును ఏమాత్రమూ సడలించ లేదు. ఆందోళన విరమించలేదు. తమ డిమాండ్లన్నింటికీ ప్రభుత్వం ఆమోదించేవరకు సమ్మె కొనసాగి తీరుతుందని స్పష్టం చేశారు. న్యాయమైన తమ డిమాండ్ల పట్ల ప్రభుత్వం దీర్ఘకాలంగా ఉదాసీనంగా వ్యవహరించడంపై ఉపాధ్యాయ సంఘాల నేతలు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. దశలవారీగా నిరసనలు చేపట్టేందుకు ఎ.పి యునైటెడ్ టీచర్స్ ఫెడరేషన్ సమాయత్తమవుతోంది. విజయవాడలో ఫిబ్రవరి మొదటి వారంలో మహాధర్నాతో ముగించాలని భావిస్తోంది. రూ.18 వేల కోట్ల మేరకు వివిధ పద్దుల కింద పెండింగ్ వున్న తమ బకాయిలు, ఎరియర్లను తక్షణమే చెల్లించాలని వారు డిమాండ్ చేస్తున్నారు. పారా మెడికల్ సిబ్బంది, 104, 108 అంబులెన్స్ సర్వీసుల్లో పని చేస్తున్న ఇతర ఉద్యోగులు జనవరి 23 నుండి ప్రతిపాదిత సమ్మెకు ఆరోగ్య శాఖకు నోటీసు ఇచ్చారు. ఉద్యోగ భద్రత కల్పించడంతో పాటు వేతనాలు, ఇతర ప్రోత్సాహకాలను పెంచాలని వారు కోరుతున్నారు. ఆంధ్రప్రదేశ్ ఔట్‌సోర్స్‌డ్ సర్వీసెస్ కార్పొరేషన్‌లో తమని భాగం చేసినట్లైతే ఇవన్నీ తమకు వస్తాయని వారు పేర్కొంటున్నారు. మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, పట్టణాభివృద్ధి స్పెషల్ చీఫ్ సెక్రటరీ వై.శ్రీలక్ష్మితో చర్చలకు తమ నేతలను ఆహ్వానించడంతో రాష్ట్ర వ్యాప్తంగా నిరవధిక సమ్మె చేస్తున్న ఔట్‌సోర్సింగ్ మున్సిపల్ వర్కర్లు తాత్కాలికంగా సమ్మె విరమించారు. దాదాపు 55,400 మంది అక్రిడేటెడ్ సామాజిక ఆరోగ్య కార్యకర్తలు కూడా విధులకు దూరంగా వున్నారు. తమకు నెలకు రూ.26 వేలు కనీస వేతనంగా ఇవ్వాలని వారు పట్టుబడుతున్నారు. మున్సిపల్ పాఠశాలలను విద్యా శాఖ పర్యవేక్షణ కిందకు తీసుకువస్తూ జారీ చేసిన ప్రభుత్వ ఉత్తర్వులపై మున్సిపల్ టీచర్లు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తమ డిమాండ్లలో కొన్నింటిని అమలు చేయడానికి ప్రభుత్వం అంగీకరించడంతో సమగ్ర శిక్షా పథకానికి చెందిన కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు 22 రోజుల నుండి చేస్తున్న సమ్మెను ఇటీవలే విరమించారు. మధ్యాహ్న భోజన కార్మికులు, విద్యుత్ శాఖ ఉద్యోగులు, నిర్మాణ కార్మికులు, గ్రామ రెవిన్యూ అసిస్టెంట్లు, గ్రామీణాభివృద్ధి విభాగానికి చెందిన ఫీల్డ్ అసిస్టెంట్లు వీరందరిదీ ఒకటే ఫిర్యాదు. ద్రవ్యోల్బణం నెలకొన్నప్పటికీ తమ ఆదాయాలు అస్సలు పెరగడం లేదని వాపోతున్నారు. 2019 ఎన్నికల సమయంలో పాదయాత్ర సందర్భంగా వేతనాలు పెంచుతానని, మరింత మెరుగైన పని పరిస్థితులు కల్పిస్తానని ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహన్ రెడ్డి ఆనాడు హామీ ఇచ్చారని, కానీ నేడు వాటన్నింటినీ గాలికి వదిలేశారని, మాట నిలబెట్టుకోలేదని వారు విమర్శిస్తున్నారు. తమ ఆందోళనలు, డిమాండ్ల పట్ల ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరుతో ఆందోళన చేస్తున్న సంఘాలు తీవ్ర ఆగ్రహంతో వున్నాయి. సమ్మెల పట్ల ప్రభుత్వం తీసుకున్న కఠిన వైఖరితో సమస్య ఇంకా ముదిరిందని అత్యధికులు అభిప్రాయ పడుతున్నారు. వేతనాలు పెంచినట్లైతే వాటిని ప్రస్తుత బడ్జెట్లలోనే చెల్లించాల్సిన అవసరం వుంది. అందుకే పరిష్కారాలను కనుగొనడంలో జాప్యం జరుగుతోందనేది వాస్తవం. ఇదిలావుండగా, ఈ వైఫల్యాలన్నింటికీ ప్రభుత్వాన్ని లక్ష్యంగా చేసుకోవడానికి ఈ నిరసనలు, సమ్మెలు, ఆందోళనలన్నీ కూడా ప్రతిపక్షాలకు ఒక అవకాశాన్ని ఇచ్చాయి. తెలుగుదేశం–జనసేన కూటమి, బిజెపి, కాంగ్రెస్‌లు అన్నీ కూడా జగన్మోహన్ రెడ్డిపై దాడి చేస్తున్నాయి.

## నర్సారెడ్డి మృతి కాంగ్రెస్‌కు తీరని లోటు

### సంతాపం ప్రకటించిన సిఎం రేవంత్ తదితరులు

**హైదరాబాద్,జనవరి 29 వెలుతురు:** మాజీ పీసీసీ అధ్యక్షులు, సీనియర్ కాంగ్రెస్ నాయకులు పొద్దుటూరి నర్సారెడ్డి మృతిపట్ల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంతాపం తెలిపారు. అలాగే పలువురు మంత్రులు, నేతలు కూడా నర్సారెడ్డికి ప్రగాఢ సంతాపం తెలియజేశారు. ఆయన మృతి కాంగ్రెస్



పార్టీకి తీరని లోటని ఆవేదన వ్యక్తం చేశారు. ఉమ్మడి రాష్ట్రంలో పీసీసీ అధ్యక్షులుగా, మంత్రిగా ఆయన చేసిన సేవలు మరువలేనివి అని నేతలు కొనియాడారు. నర్సారెడ్డి మృతిపట్ల సీఎం రేవంత్ రెడ్డి సంతాపం తెలియ జేశారు. ఎంపీగా, ఎమ్మెల్యేగా, ఎమ్మెల్సీగా ప్రజలకు ఆయన అనేక సేవలందించారన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో పీసీసీ అధ్యక్షులుగా, మంత్రిగా ఆయన చేసిన సేవలు మరువలేనివన్నారు. ఆయన అనుభవాలు తమకు మార్గదర్శకంగా ఉండేవని చెప్పుకొచ్చారు. ఆయన మరణం కాంగ్రెస్ పార్టీకి తీరని లోటని సీఎం ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజల మనిషి, నీతికి నిజాయితీకి మారు పేరుగా నిలిచిన మాజీ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ పీసీసీ అధ్యక్షులు, మాజీ మంత్రి పి. నర్సారెడ్డి ఈరోజు ఉదయం స్వర్గస్తులయ్యారని తెలియజేయడానికి చింతిస్తున్నామని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేష్‌కుమార్ గౌడ్ అన్నారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తున్నామని తెలిపారు. నర్సారెడ్డి మృతి పట్ల మంత్రి



ఉత్తమ్ కుమార్ రెడ్డి సంతాపం తెలిపారు. నిజాయితీగా రాజకీయాలు చేసి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో తనకంటూ మంచి గుర్తింపు తెచ్చుకొని జీవితాంతం నమ్ముకున్న సిద్ధాంతం కోసం పని చేసిన మాజీ పీసీసీ అధ్యక్షులు పి.నర్సారెడ్డి మరణం కాంగ్రెస్ పార్టీకి తీరని లోటన్నారు. ఆయన మరణం పట్ల ప్రగాఢ సంతాపం వ్యక్తం చేస్తూ.. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని కోరుకుంటున్నానన్నారు. మాజీ పీసీసీ అధ్యక్షులు, కాంగ్రెస్ సీనియర్ నాయకులు, మాజీ మంత్రి పి.నర్సారెడ్డి మరణం పట్ల రవాణా మరియు బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సంతాపం వ్యక్తం చేశారు. ఆయన కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. విలువలు కలిగిన రాజకీయ నాయకుడిగా, కాంగ్రెస్ వాదిగా, సుపరిపాలనాదక్షుడిగా అందరి మన్ననలు పొందారని గుర్తు చేశారు. ఆయన రాజకీయ జీవితం నేటితరానికి ఆదర్శంగా నిలుస్తుందని పేర్కొన్నారు. సుదీర్ఘ రాజకీయ జీవితంలో ఎన్నో పదవులు అలంకరించిన నర్సారెడ్డి మృతి రాష్ట్రానికి, కాంగ్రెస్ పార్టీకి తీరని లోటన్నారు. మాజీ పీసీసీ అధ్యక్షులు పొద్దుటూరి నర్సారెడ్డి మృతిపై ఉమ్మడి జిల్లాలోని అన్ని పార్టీల నేతలు సంతాపం తెలియజేశారు. మంత్రి, ఎంపీ, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, పీసీసీ అధ్యక్షులుగా నర్సారెడ్డి విశేష సేవలు అందించారని కొనియాడారు. నర్సారెడ్డి మృతితో స్వగ్రామం సారంగాపూర్ మండలం మలక్‌చించోలిలో విషాదఛాయలు అలముకున్నాయి. ఆయన చేసిన సేవలను గ్రామస్తులు గుర్తు చేసుకుంటున్నారు. నర్సారెడ్డి మృతిపై మాజీ మంత్రి ఇంద్ర కరణ్ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. ఉమ్మడి రాష్ట్రంలో నీటి పారుదల, రెవెన్యూ శాఖల మంత్రిగా ఆయన సమర్ధవంతంగా పని చేశారని ఇంద్రకరణ్‌రెడ్డి కొనియాడారు.

Edited, Printed, Published and Owner by BAKKA YADAIAH, Published & Printed at **SRI SHANTHI PUBLICCATIONS** H.No. 7-2-31/221/2, S.V. Colony, Bairamalaguda, Saroornagar, Mdl.R.R. DIST, Telangana-79. **EDITORG BAKKA YADAIAH, R.N.I. TEL TEL /2019 / 78609.** Cell:91773 87328, Email: velthurunewspaper@gmail.com